# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 262 | హైదరాబాద్ | సోమవారం 13-04-2026 | పేజీలు : 12 | వెల : 1.00




చర్చల కోసం పాకిస్థాన్ బయల్దేరిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్.. ఇరాన్‌కు వార్నింగ్

11లో



## తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల..
# అమ్మాయిలదే హవా!

- తెలంగాణ ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాలు 2026 విడుదల
- ఫస్టియర్‌లో 66.20%, సెకండియర్‌లో 70.58% మంది ఉత్తీర్ణత
- ఫలితాల్లో మరోసారి సత్తా చాటిన అమ్మాయిలు
- అధికారిక వెబ్‌సైట్లతో పాటు వాట్సాప్ ద్వారా కూడా ఫలితాల వెల్లడి
- ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు మే నెలలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

11లో

## రాష్ట్రంలో కాంగ్రెస్
# ‘దోచుకో-దాచుకో’ పథకం నడిపిస్తోంది

- సీఎం రేవంత్ రెడ్డి దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన సీఎం అంటూ కేటీఆర్ ఫైర్
- తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చీకటి దోస్తీ చేస్తున్నాయంటూ వ్యాఖ్యలు
- సింగరేణిలో అవినీతి ఆపకపోతే ప్రతి బొగ్గు గనిపై అగ్గిపుట్టిస్తామని హెచ్చరిక
- సింగరేణి కుంభకోణంపై కేంద్రం విచారణ జరపడం లేదని ఆగ్రహం


11లో



## భారత్‌పాక్
# యుద్ధాన్ని ఆపాను

- అమెరికాఇరాన్ మధ్య విఫలమైన ఉన్నత స్థాయి శాంతి చర్చలు
- కీలకమైన హర్మూజ్ జలసంధిని దిగ్బంధిస్తామని సంచలన ప్రకటన
- అమెరికా సైన్యం సిద్ధంగా ఉందని స్పష్టం చేసిన ట్రంప్

11లో





## అమర్‌నాథ్ యాత్ర 2026 షెడ్యూల్ విడుదల..
# 57 రోజుల పాటు యాత్ర

- ఈ ఏడాది అమర్‌నాథ్ యాత్ర జులై 3న ప్రారంభం
- మొత్తం 57 రోజుల పాటు కొనసాగనున్న పవిత్ర యాత్ర
- రక్షాబంధన్ రోజున ఆగస్టు 28న యాత్ర ముగింపు
- ఈ నెల 15 నుంచి యాత్ర కోసం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం

11లో

## విజయ్‌పై డీఎంకే
# ‘వర్క్ ఫ్రమ్ హోమ్’ సెటైర్లు!

- ఎన్నికల ప్రచార సభలను రద్దు చేసుకున్న విజయ్
- అధినేత నిర్ణయంతో తమిళగ వెట్రి కళగం శ్రేణుల్లో కొంత గందరగోళం
- డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ప్రచారం కొనసాగిస్తామని పార్టీ ప్రకటన

11లో



మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ **వినయ్ కృష్ణారెడ్డి**

హెచ్ఎండీఏ కమిషనర్ **సర్ఫరాజ్ అహ్మద్**



# నమిశ్రీ ‘అరియా’లో ఫ్లాటు, కొంటే మునిగిపోవాల్సిందే..!

- అనుమతులు సర్వే నెం. 121లో.. అక్రమ నిర్మాణాలు ఫారెస్ట్ ల్యాండ్‌లో!
- ఎల్బీనగర్ జోన్ నాగోల్ సర్కిల్ మున్సిపల్ అధికారుల చర్యలు ఎక్కడ..!
- హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారుల అండతోనే రియల్ మాఫియా పంజా? సామాన్యుల సొమ్ముకు భద్రత ఏది?
- సరూర్నగర్ సబ్ రిజిస్టర్ , స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఉన్నత అధికారులు దృష్టి సారించి రిజిస్ట్రేషన్లు ఆపాలి..!
- భవిష్యత్తులో హైడ్రా లాంటి సంస్థ ఈ భారీ నిర్మాణాన్ని కూల్చివేస్తే నివాసం ఉంటున్న అమాయకులు ఎక్కడికి వెళ్లాలి..!
- పూర్తి ఆధారాలు పెట్టి వ్రాతపూర్వక ఫిర్యాదు చేసి .. వార్తలు వ్రాస్తున్నా.. మల్కాజ్గిరి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫ్ రాజ్ అహ్మద్ చర్యలు ఎక్కడ..!
- నాగోల్ బండ్లగూడలో జరుగుతున్న అవినీతి తంతును ఆపే వారే లేరా..!
- మున్సిపల్ శాఖ సెక్రెటరీ జయేష్ రంజన్, సీ.ఎం రేవంత్ రెడ్డి, దృష్టి సారించి ఈ అవినీతితంగాన్ని ఆపాలంటూ: స్థానిక ప్రజల డిమాండ్..!




బిల్డింగ్ ఫోటో

12లో

రాష్ట్రంలో పాలన మారినా, రియల్ మాఫియా తీరు మారలేదనడానికి నాగోల్ ‘నమిశ్రీ అరియా’ వ్యవహారమే నిదర్శనం. అటవీ భూములను మింగేస్తూ ఆకాశహర్మ్యాలు లేస్తుంటే, నిఘా పెట్టాల్సిన హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ‘ముడుపుల’ మత్తు ఎంత ఉందో అర్థమవుతోంది. ఫోర్జరీ కేసులున్నా నిర్మాణాలు ఆగకపోవడం ప్రభుత్వ రిట్ పిటిషన్లకే సవాలుగా మారింది. హైడ్రా వంటి సంస్థలు ఒకవైపు అక్రమాలను కూలుస్తుంటే, మరోవైపు అధికారుల అండతోనే కొత్త అక్రమాలు పుట్టుకురావడం సిగ్గుచేటు. సామాన్యుడి సొమ్మును రిస్క్‌లో పెడుతూ, పర్యావరణాన్ని చెరబడుతున్న ఈ ‘రియల్’ దందాను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైతే, అది వ్యవస్థాగత వైఫల్యమే అవుతుంది. కంచె చేను మేసిన చందంగా మారిన అధికారుల నిర్లక్ష్యంపై ముఖ్యమంత్రి తక్షణమే ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉంది.

# రాజ్యసభ రేసు
# భారీగా పెరుగుతున్న ఆశావహులు

విజయవాడ, ఏప్రిల్ 12

తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ సీట్ల కేటాయింపు అంశం ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. జూన్‌లో ఖాళీ అవుతున్న నాలుగు స్థానాలకు గాను, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎవరిని ఎంపిక చేస్తారనే దానిపై పార్టీ వర్గాల్లో తీవ్ర స్థాయిలో కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం వినిపిస్తున్న పేర్లలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మిగిలిన స్థానాలకు రకరకాల పేర్లు చర్చల్లోకి వస్తున్నాయి. టీడీపీ ఐటీ విభాగంలో చురుగ్గా ఉంటూ, గత ఎన్నికల్లో పార్టీ సోషల్ మీడియా వ్యూహకర్తగా పనిచేసిన చింతకాయల విజయ్ పేరు రేసులో ముందుండటానికి ప్రధాన కారణం యువతకు ప్రాధాన్యత ఇవ్వాలన్న అధిష్టానం ఆలోచనే. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి బలమైన బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో విజయ్ వైపు చంద్రబాబు మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో అనేక రాజకీయ సవాళ్లను ఎదుర్కొని పార్టీ కోసం నిలబడినందుకు ఆయనకు ఈ గుర్తింపు దక్కవచ్చని క్యాడర్ భావిస్తోంది.మరోవైపు, పార్టీలో అత్యంత సీనియర్ నేత అయిన యనమల రామకృష్ణుడు పేరు కూడా చర్చల్లో ఉంది. గత కొంతకాలంగా ఆయన రాజ్యసభకు వెళ్లాలని ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీకి ట్రబుల్ షూటర్‌గా, ఆర్థిక వ్యవహారాల్లో పట్టున్న నేతగా యనమల సేవలను ఢిల్లీ స్థాయిలో ఉపయోగించుకోవాలని అధిష్టానం భావిస్తే ఆయనకు అవకాశం దక్కవచ్చు. అయితే, సామాజిక సమీకరణాలు , కొత్త రక్తాన్ని ఎక్కించాలనే లోకేష్ వ్యూహం కారణంగా సీనియర్లకు ఏ మేరకు ప్రాధాన్యత ఉంటుందన్నది ఉత్కంఠగా మారింది. వ్యాపార కారణాలు, రాజకీయ ఒత్తిళ్ల వల్ల గత లోక్‌సభ ఎన్నికలకు దూరంగా ఉన్న గల్లా జయదేవ్ పేరు మళ్లీ తెరపైకి వచ్చింది. పార్లమెంటులో రాష్ట్ర సమస్యలపై గళం విప్పడంలో ఆయనకు ఉన్న అనుభవం, అంతర్జాతీయ స్థాయిలో ఆయనకున్న నెట్‌వర్క్ పార్టీకి అవసరమని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ఆయన రాజకీయాలకు బ్రేక్ ఇస్తున్నట్లు గతంలోనే ప్రకటించినందున, మళ్లీ రాజ్యసభ ద్వారా క్రియాశీలక రాజకీయాల్లోకి వస్తారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది. ఇక గత ఎన్నికల్లో చాన్స్ దొరకని దేవినేని ఉమ కూడా రేసులో ఉన్నారు. యువనేతలు వంగవీటి రాధాతో పాటు మహాసేన రాజేష్ వంటి వారు కూడా సామాజికవర్గ కోటాల్లో ప్రయత్నాలు చేస్తున్నారు. రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో చంద్రబాబు ప్రధానంగా మూడు సూత్రాలను పాటిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన వారికి ప్రాధాన్యత ఇస్తారు. బీసీ, ఎస్సీ , కాపు సామాజిక వర్గాలకు సమతుల్యత పాటించడం.. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర ప్రయోజనాల కోసం గట్టిగా మాట్లాడగలిగే వ్యక్తులను పంపే అంశాలను పరిశీలిస్తున్నారు. వీరితో పాటు పార్టీ కోసం పనిచేసిన మరికొందరు పారిశ్రామికవేత్తలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను కూడా టీడీపీ పరిశీలిస్తోంది. ఢిల్లీలో పార్టీ వాయిస్ బలంగా వినిపించే వారికే చంద్రబాబు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. మిత్రపక్షాలకూ సీట్లు కేటాయించాల్సి ఉంది. జాతీయ స్థాయి ప్రాధాన్యత దృష్ట్యా బీజేపీ ఓ సీటును కోరుకుంటుందని అంచనా వేస్తున్నారు. బీజేపీకి ఇస్తే జనసేన పార్టీకి చాన్స్ ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నారు. రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడైనా వచ్చే అవకాశం ఉన్నందున అభ్యర్థుల ఎంపికను చంద్రబాబు ఫైనల్ చేస్తున్నారు.

# అన్ని రంగాలపై యుద్ధప్రభావం

పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు కేవలం భౌగోళిక రాజకీయాలకే పరిమితం కాలేదు.అవి గ్లోబల్ సప్లై చైన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. యుద్ధం అనేది మానవ సమాజానికి అత్యంత ప్రమాదకరం. చరిత్రలో జరిగిన ప్రపంచ యుద్ధాలు అపార నష్టాన్ని మిగిల్చాయి. యుద్ధం వల్ల కేవలం రెండు దేశాలకే కాదు, మొత్తం ప్రపంచానికే కోలుకోలేని నష్టం జరిగి ఆర్థిక సంక్షోభంలోకి అనివార్యంగా నెట్టబడతాయి. యుద్ధం వల్ల జరిగే ప్రధాన నష్టం ప్రాణనష్టం. లక్షలాది మంది సైనికులు, సాధారణ ప్రజలు తమ ప్రాణాలను కోల్పోతారు. అనేక కుటుంబాలు తమ బంధువులను కోల్పోయి దుఃఖంలో మునిగిపోతాయి. రెండోది ఆర్థిక నష్టం. యుద్ధం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుంది. పరిశ్రమలు, వ్యవసాయం నిలిచిపోతాయి. ప్రభుత్వాలు రక్షణ ఖర్చుల కోసం భారీగా నిధులు ఖర్చు చేయాల్సి వస్తుంది.మూడవది మౌలిక సదుపాయాల నష్టం. యుద్ధ సమయంలో రహదారులు, వంతెనలు, భవనాలు ధ్వంసమవుతాయి. విద్యుత్, నీటి సరఫరా వంటి అవసరమైన సేవలు నిలిచిపోతాయి. నాలుగోది శరణార్థుల సమస్య. యుద్ధం కారణంగా ప్రజలు తమ ఇళ్లను వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఫలితంగా ఇరాన్?లో ఇప్పటికే ప్రజలు సంక్షోభంలో బతుకుతున్నారు.ప్రపంచ చమురు వాణిజ్యంలో 20 శాతం, భారతదేశ ముడి చమురు దిగుమతుల్లో 50 శాతం వాటా కలిగిన హోర్ముజ్ జలసంధి ప్రస్తుతం ఓ ప్రమాదకరమైన మలుపులో ఉంది. జల సంధి అధికారికంగా మూసివేయకపోయినా అక్కడ పెరిగిన ఇన్సూరెన్స్ రేట్లు, దాడులకు భయంతో షిప్పింగ్ కార్యాకలాపాలు స్తంభించిపోయాయి. దాదాపు 4500 భారతీయ ఎగుమతిదారులు, 1800 మంది దిగుమతిదారులు ఈ మార్గంపై ఆధారపడి ఉన్నారు. షిప్పింగ్ కంపెనీలు ఇప్పుడు వార్ రిస్క్ సర్ఛార్జ్, ఎమర్జెన్సీ ఫ్యూయల్ సర్ఛార్జ్ వంటి కొత్త పన్నులను విధిస్తున్నాయి. దీని వల్ల కంటైనర్ రవాణా ఖర్చు ఏకంగా రెండు వేల నుంచి మూడు వేల డాలర్ల వరకు పెరిగింది షిప్పింగ్ ఆలస్యం వల్ల వస్తువులు చేరడానికి పట్టే సమయంలో మరో పది నుంచి ఇరవై రోజులు పెరుగుతోంది. ఆసియాలోనే అతి పెద్ద ఆటోమొబైల్ విడిభాగాల మార్కెట్ అయిన ఢిల్లీలోని కశ్మీర్ గేట్‌లోని పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ముడి చమురు ధరలు పెరగడం వల్ల ప్లాస్టిక్, రబ్బర్, ప్యాకేజింగ్ మెటీరియల్స్ ధరలు పెరిగాయి. మార్కెట్ నిపుణుల ప్రకారం విడిభాగాల తయారీ ఖర్చు 25 శాతం నుంచి 50 శాతం వరకు పెరిగింది. మరోవైపు ఇంధన ధరల పెరుగుదల వల్ల ఫ్యాక్టరీల్లో కార్మికులు స్వగ్రామాలకు తరలిపోతుండటంతో ఉత్పత్తి కుంటుపడింది. రబ్బర్ విడిభాగాల తయారీ ఖర్చు పది నుంచి 16 రూపాయలకి పెరగగా, ముడి చమురు ధరల పెరుగుదల వల్ల ప్లాస్టిక్ వస్తువుల ధరలు రెట్టింపు అవుతున్నాయి. దీనికి తోడు హుర్మూజ్ జలసంధి వద్ద సుమారు 2,300 పెట్రోలియం కంటైనర్లు నిలిచిపోవడం వల్ల సప్లై పూర్తిగా దెబ్బతింది. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి తయారీదారులు ధరలను పెంచడం అనివార్యమని ప్రకటించారు. ముడిసరుకుల ధరలు పెరగడం వల్ల కార్లు, టీవీలు, ఏసీలు, రిఫ్రిజిరేటర్ల ధరలు ఐదు శాతం నుంచి ఆరు శాతం వరకు పెరగనున్నాయి. మెర్సిడెస్ బెంజ్, ఆడి వంటి సంస్థలు ఇప్పటికే రెండు శాతం ధరల పెంపును ప్రకటించాయి. షూస్, ప్లాస్టిక్ ఆధారిత దుస్తుల ధరల 8 శాతం నుంచి 12 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది.వాహన తయారీ సంస్థలు పాండమిక్ సమయంలో చేసినట్టుగానే క్రైసిస్ మేనేజ్‌మెంట్ టీమ్‌లను ఏర్పాటు చేస్తున్నాయి. అల్యూమినియం, కాపర్, ఎలక్ట్రానిక్ విడిభాగాల కోసం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే మార్గాలను అన్వేషిస్తున్నాయి. అయినప్పటికీ భారత్ విడిభాగాలు దిగుమతుల్లో చైనా వాటా 30 శాతంగా ఉంది. జర్మనీ, దక్షిణ కొరియా నుంచి కూడా దిగుమతులు పెరుగుతున్నప్పటికీ, ప్రస్తుతం పరిస్థితుల్లో ధరల నియంత్రణ అనేది తయారీదార్లకు ఒక సవాల్‌గా మారింది. నేటి పరిస్థితులు చూస్తుంటే 1970 నాటి అంతర్జాతీయ సంక్షోభాన్ని గుర్తు తెస్తుందని నిపుణులు చెబుతున్నారు. కేవలం చమురు మాత్రమే కాదు, టైల్స్, పేపర్, పెట్రోకెమికల్ ఉత్పత్తులపై ఆధారపడిన పరిశ్రమలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి.పశ్చిమాసియాలో జరుగుతున్న ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం గత నెల రోజులుగా తీవ్రస్థాయిలో కొనసాగుతూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. యుద్ధంపై అమెరికా ఇప్పటికే 27 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. యుద్ధానికి ప్రతి సెకనుకు 10,300 వేల డాలర్స్ ఖర్చు అవుతున్నాయి, ఆయుధాలకు, 320మిలియన్, విమానాలకు 245 మిలియన్, నేవీకి 155 మిలియన్, రక్షణ వ్యవస్థకు 95 మిలియన్ డాలర్లు, దీనివలన భవిష్యత్ లో అమెరికా ఎదుర్కొనే సంక్షోభం గ్రహించి అమెరికా చరిత్రలో తొలిసారి 50 రాష్ట్రాలలో 'నో కింగ్ నో వార్' నినాదంతో లక్షలాది ప్రజలు నిరసన వ్యక్తం చేశారు, ఇరాన్, ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలు యుద్ధం ముగియాలని కోరుకుంటున్నాయి. కానీ అమెరికా అవలంబిస్తున్న విధానాల వలన యుద్ధం ఇప్పట్లో ముగిసే అవకాశాలు కనిపించడం లేదు.హార్మూజ్? జలసంధి తెరిచేందుకు ప్రయత్నిస్తే ఉద్రిక్తతలు మరింత పెరుగుతాయి. నాటో కూటమిని ట్రంప్ మద్దతు కోరినా సానుకూల స్పందన లేదు. దీనితో అమెరికా దిక్కు తోచని పరిస్థితుల్లో కూరుకుపోయిందని అర్థమవుతోంది. ఇరాన్, ఇజ్రాయెల్ ఇతర గల్ఫ్ దేశాలు అనేక రకాల నష్టాలు ఎదుర్కొంటున్నాయి. తిరిగి కోలుకోవడానికి ఎన్ని ఏండ్లు పడుతుందో చెప్పలేం. అమెరికా సైనిక స్థావరాల మీద ఇరాన్ దాడులు చేయడం కొనగిస్తూనే వుంది. పైగా అమెరికాకు చెందిన 18 కంపెనీలపై దాడులు చేస్తామని హెచ్చరించడంతో లక్షలాది ఉద్యోగులు తమ ప్రాణాలను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. అమెరికా మద్దతుతో ఇజ్రాయెల్ ఇరాన్ పై నిరంతర దాడులు చేస్తోంది, అయితే యుద్ధంతో ఎలాంటి సంబంధం లేని భారతదేశం తీవ్ర ఇబ్బందులు పడుతోంది. అన్ని రంగాలలో సంక్షోభం నెలకొంది. యుద్ధ ప్రభావంతో తగ్గిన నౌకల రవాణా వల్ల ముడి సరుకు దిగుమతి తగ్గి రెట్టింపు స్థాయిలో ధరలు పెరిగాయి. ఒక్క ఫార్మా రంగంలోనే మార్చినెలలో రూ. 5000 కోట్లు నష్టం జరిగింది అని అంచనా వేస్తు న్నారు. చమురు, గ్యాస్ ధరల పెరుగుదల, ఆహార పదార్థాల కొరత, వలన సామాన్య ప్రజలకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు తప్పని పరిస్థితి. వ్యవసాయ రంగంలో కూడా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది,

====================చీచీ

# టీడీపీలో థర్డ్ జనరేషన్..3.0

విజయవాడ, ఏప్రిల్ 12



తెలుగుదేశం పా జాతీయ ప్రధాన కార్యదర్శి , మంత్రి నారా లోకేష్ పార్టీ సంస్థాగత నిర్మాణంపై తనదైన ముద్ర వేస్తున్నారు. పార్టీని సాంకేతికంగా పరిపుష్టం చేస్తూ, అట్టడుగు స్థాయి కార్యకర్తలతో నేరుగా సంబంధాలు నెలకొల్పుకుంటూ ఀఆఖ 3.0 అనే కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. లోకేష్ ఇటీవలే ఀఆఖ 3.0 వెర్షన్‌ను లాంచ్ చేశారు. ఇది కేవలం ఒక నినాదం కాదు, పార్టీని మరింత శక్తివంతంగా, జవాబుదారీతనంతో నడిపించే ఒక వ్యవస్థ. ఇందులో భాగంగా కార్యకర్తలకు నేరుగా గుర్తింపు ఇవ్వడం, వారి పనితీరును అంచనా వేయడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. పార్టీని ఒక నాయకులను తయారు చేసే విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దాలని, ఏడాదికి కనీసం 300 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు.పార్టీలో క్రమశిక్షణ విషయంలో లోకేష్ చాలా కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల మళ్లీ గెలవాలంటే ప్రజల మధ్యే ఉండాలి అని ఎమ్మెల్యేలకు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. రెవెన్యూ వ్యవహారాల్లో జోక్యం చేసుకున్నా, ఇసుక లేదా ఇతర అక్రమ రవాణాలో పాల్గొన్నా సహించేది లేదని తెగేసి చెప్పారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల పనితీరును, ప్రజల్లో వారికున్న ఇమేజ్‌ను ఎప్పటికప్పుడు సర్వేల ద్వారా అంచనా వేస్తూ, గ్రాఫ్ పడిపోయిన వారికి క్లాస్ తీసుకుంటున్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడానికి లోకేష్ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే 85కు పైగా ప్రజా దర్బార్‌లు నిర్వహించి, వేలాది మంది అర్జీలను స్వయంగా స్వీకరించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఉదయాన్నే అందుబాటులో ఉంటూ, ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు అధికారులతో నేరుగా మాట్లాడుతున్నారు. ఇది కేవలం సామాన్య ప్రజలకే కాకుండా, పార్టీ కార్యకర్తలకు కూడా తమ నాయకుడిని నేరుగా కలిసే ధైర్యాన్ని ఇస్తోంది.సాంకేతికతపై పట్టున్న లోకేష్, పార్టీ పర్యవేక్షణ కోసం ఓఎ౨ఆఖ యాప్‌ను సమర్థవంతంగా వాడుతున్నారు. ఈ యాప్ ద్వారా క్షేత్రస్థాయిలో ఏ కార్యకర్త చురుగ్గా ఉన్నారో, ఏ బూత్ స్థాయిలో పార్టీ బలహీనంగా ఉందో డేటా రూపంలో విశ్లేషిస్తున్నారు. పనితీరు ఆధారంగానే పదవులు, గుర్తింపు ఉంటాయని స్పష్టం చేయడం ద్వారా పార్టీలో సమర్థులకు ప్రాధాన్యత లభిస్తోంది. పారిశ్రామిక వేత్తల తరహాలో డాష్ బోర్డ్ మేనేజ్‌మెంట్ ద్వారా పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించడం ఆయన పనితీరుకు నిదర్శనం. కష్టకాలంలో పార్టీ జెండా మోసిన కార్యకర్తలను లోకేష్ కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. వైసీపీ హయాంలో కేసులు ఎదుర్కొన్న వారిని ఆదుకోవడంతో పాటు, పార్టీ ఆవిర్భావ దినోత్సవం వంటి వేదికలపై సామాన్య కార్యకర్తలకు సీనియర్ నేతలతో సమానంగా గౌరవం కల్పిస్తున్నారు. పదవులు మూడు సార్లు మాత్రమే అనే కొత్త ప్రతిపాదన ద్వారా కొత్త రక్తాన్ని పొలిట్‌బ్యూరో స్థాయికి చేర్చాలని ఆయన చూస్తున్నారు. ఇది యువ నాయకత్వంలో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది.లోకేష్ కేవలం చంద్రబాబు వారసుడిగా కాకుండా, తనకంటూ ఒక సొంత పనితీరు బ్రాండ్ ను సృష్టించుకున్నారు. అడ్మినిస్ట్రేషన్‌లో చురుగ్గా ఉంటూనే, పార్టీ యంత్రాంగాన్ని 24/7 అలెర్ట్‌గా ఉంచడంలో ఆయన సఫలీకృతమవుతున్నారు. లోకేష్ అనుసరిస్తున్న ఈ కార్పొరేట్ తరహా రాజకీయ వ్యూహం, అట్టడుగు స్థాయి కార్యకర్తలతో ఉన్న అనుబంధం టీడీపీని రాబోయే దశాబ్ద కాలానికి సిద్ధం చేస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.


# 14 నుంచి 21
# చిత్తూరు జిల్లాల్లో నియోజకవర్గాలు

తిరుపతి, ఏప్రిల్ 12, చంద్రబాబు నాయుడు సొంత జిల్లా అయిన ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నియోజకవర్గాల పునర్విభజన అంశం ఇప్పుడు పెను సంచలనంగా మారింది. కేంద్రం నుంచి వస్తున్న సంకేతాలతో జిల్లా రాజకీయ స్వరూపమే మారిపోబోతోంది. ప్రస్తుతం ఉన్న 14 అసెంబ్లీ స్థానాల సంఖ్య ఏకంగా 21కి పెరిగే అవకాశం ఉండటంతో రాజకీయ పార్టీల్లోనూ, అభ్యర్థుల్లోనూ కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. 2004 వరకు ఉమ్మడి జిల్లాలో 15 నియోజకవర్గాలు ఉండేవి. 2009 పునర్విభజనలో వాయల్పాడు, పుత్తూరు, వేపంజేరి నియోజకవర్గాలు రద్దు కాగా.. కొత్తగా గంగాధర నెల్లూరు, పూతలపట్టు ఏర్పడ్డాయి. దీంతో సీట్ల సంఖ్య 14కి తగ్గింది. అయితే తాజా ప్రతిపాదనల ప్రకారం ఈ సంఖ్య 21కి చేరనుండటం విశేషం.రాష్ట్రంలోనే అతిపెద్ద జిల్లాగా ఆవిర్భవించిన తిరుపతిలో జనాభా ప్రాతిపదికన భారీ మార్పులు చోటుచేసుకోనున్నాయి. చంద్రగిరి నియోజకవర్గంలో భాగంగా ఉన్న తిరుపతి రూరల్ మండలాన్ని విడదీసి కొత్త నియోజకవర్గంగా మార్చే అవకాశం ఉంది. ఇందులో రామచంద్రపురం మండలాన్ని కూడా కలిపే అవకాశం ఉంది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య భారీగా ఉండటంతో రేణిగుంట కేంద్రంగా కొత్త సీటు ఏర్పాటుపై చర్చ జరుగుతోంది. గతంలో రద్దయిన పుత్తూరు నియోజకవర్గం మళ్ళీ తెరపైకి రానుంది. సూళ్లూరుపేట నియోజకవర్గం నుంచి నాయుడుపేటను విడదీసి కొత్త నియోజకవర్గం చేసే ఛాన్స్ ఉంది.పూతలపట్టు నియోజకవర్గంలోని బంగారుపాళ్యం కేంద్రంగా కొత్త స్థానం ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నాయి. పీలేరు నియోజకవర్గం నుంచి కలికిరి కేంద్రంగా మరో కొత్త నియోజకవర్గం ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.అసెంబ్లీ స్థానాలతో పాటు ఉమ్మడి జిల్లాలో మరో లోక్ సభ స్థానం కూడా పెరిగే అవకాశం ఉందన్న చర్చ జోరుగా సాగుతోంది. ప్రస్తుతం చిత్తూరు, తిరుపతి రెండు పార్లమెంట్ స్థానాలు ఎస్సీ రిజర్వ్‌డ్ కావడంతో కొత్తగా ఏర్పడే పార్లమెంట్ స్థానం జనరల్ కేటగిరీ అవుతుందన్న అంచనాలు ఉన్నాయి. దీంతో ఇప్పటి నుంచే ఆయా నియోజకవర్గాల కీలక నేతలు ఢిల్లీ స్థాయిలో పావులు కదుపుతున్నారు. జిల్లాల విభజనతో ఇప్పటికే మూడు ముక్కలైన ఉమ్మడి చిత్తూరు జిల్లా ఇప్పుడు నియోజకవర్గాల పెంపుతో పొలిటికల్ పవర్‌హౌస్‌గా మారబోతోంది. ఈ మార్పులు ఏ పార్టీకి కలిసి వస్తాయి? పాత నియోజకవర్గాల సరిహద్దులు ఎలా మారుతాయి? అన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

# జనారణ్యంలోకి జంతువులు

కర్నూలు, ఏప్రిల్ 12

రాయలసీమ వ్యాప్తంగా జనావాసాల్లోకి చిరుతల చొరబాట్లు పెరగడం కనిపిస్తోంది. పులులకు తీవ్రమైన నీటి కొరత, ఆవాసాలు తగ్గిపోవడం, పెరుగుతున్న పర్యావరణ ఒత్తిడే ఈ ధోరణికి కారణమని అటవీ అధికారులు పేర్కొంటున్నారు. తక్షణమే సరిదిద్దే చర్యలు తీసుకోకపోతే..



ఈ ప్రాంతంలో మానవ-వన్యప్రాణుల సంఘర్షణ తీవ్రంగా పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.వైఎస్ఆర్ కడప జిల్లా దువ్వూరు మండలం చిన్న బకరపురం గ్రామంలో ఇటీవల జరిగిన ఓ ఘటన జరిగింది. గ్రామంలోకి ప్రవేశించిన చిరుత పిల్లను వీధి కుక్కలు చంపడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అటవీ అధికారుల సమాచారం ప్రకారం, రాయలసీమలో గత మూడేళ్లలో మానవ నివాస ప్రాంతాల్లోకి ప్రవేశించిన 30కి పైగా చిరుతలు మరణించాయి. ఆందోళనకరంగా, గత సంవత్సరంలోనే 16 మరణాలు నమోదయ్యాయి.చిరుతపులులు మేకలు, గొర్రెలు, దూడలు, ఆవులు వంటి జంతువులను ఇష్టపడతాయి. ఆహారం కోసం అవి మానవ నివాస ప్రాంతాల్లోకి ప్రవేశిస్తాయి. కొన్నిసార్లు, అటవీ ప్రాంతాల్లో సమీపంలో నీటి వనరులు లేకపోవడం కూడా ఒక కారణంగా ఉంది. చిరుతపులులు దట్టమైన అడవుల్లో లోపల ఉండటానికి బదులుగా, కొద్దిగా బహిరంగ లేదా మైదాన ప్రాంతాల్లోకి వెళ్లడానికి ఇష్టపడతాయని అటవీ అధికారులు అంటున్నారు.చిరుతపులులు మనుషులపై దాడి చేయడానికి బయటకు రావడం లేదు. కానీ ఆకస్మాత్తుగా మనిషి ఎదురైతే దాని రక్షణలో భాగంగా దాడి చేయాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. వాటి సంచారం ప్రధానంగా ఆహారం, నీటి అన్వేషణ కోసమే ఉంటుంది. అడవుల అంచున ఉన్న గ్రామాల్లోకి చిరుతలు ఎక్కువగా వస్తుంటాయి.వేటగాళ్లు ఏర్పాటు చేసిన ఉచ్చులు, అడవి పందులను నివారించడానికి రైతులు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెలు పులులకు ఇబ్బందికరంగా మారాయి. విద్యుత్ కంచెల కారణంగా ప్రమాదవశాత్తు మరణాలు పెరుగుతున్నాయి. రైతులలో తక్షణమే అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.అటవీ భూముల ఆక్రమణలతో పులుల సహజ ఆవాసాలను తగ్గిపోయేలా చేస్తూ, వన్యప్రాణులను మానవ నివాసాలకు మరింత దగ్గరగా నెడుతున్నాయి. దట్టమైన అడవుల్లో ఉండాల్సిన వన్యప్రాణులు ఇప్పుడు జనావాస ప్రాంతాల వైపు వస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో చిరుతపులుల సంచారం ఎక్కువగా ఉందని, ఇది తమ జీవనోపాధికి ముప్పుగా మారిందని రైతులు వాపోతున్నారు.కొన్నిసార్లు పొలాల దగ్గర చిరుతపులులు సంచారం ఉన్నట్టుగా రైతులు చూస్తున్నారు. దానికి సంబంధించిన ఆనవాళు కనిపిస్తున్నాయి. పశువులను, మేకలను మేతకు బయటకు తీసుకెళ్లాలంటే భయపడుతున్నాయి.

# మంగల్ హాట్ పోలీసుస్టేషన్ పరిధిలో పోలీసుల కార్డెన్ సెర్చ్

హైదరాబాద్ ఏప్రిల్ 12

గోల్కొండ జోన్ లోని మంగళ్ హాట్ లో పోలీపులు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. 200మంది పోలీసులతో ఉదయం 5గంటలనుండి నిర్వహించిన కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ జరిగింది. డ్రగ్స్ ,గంజాయి ,మరక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ మంగలహాట్ లోని అప్పర్ ధూల్ పేట్, టక్కర్ వాడి, లాల్ భవన్, జింగుర్ బస్తి తదితర ప్రాంతాల్లో ఆపరేషన్ నిర్వహించారు.

ఈ ఆపరేషన్ లో పది బోమెస్టిక్ సిలిండర్లు, కమార్షియల్ సిలిండర్లు 7, చిన్న సిలిండర్లు 79, బెల్టు షాపులలో 41లిటర్స్ బీర్లు,విస్కీ 8లీటర్లు,3ఆటలో 15, చిన్న సిలిండర్లు, ఎలాంటి ధ్రువీకరణ పత్రాల, నెంబర్ ప్లేట్ లేని ద్విచక్రవాహనాలు 28 సీజ్ చేసారు.

# ఏపీలో చిన్నారులకు సోషల్ మీడియా బ్యాన్

నెల్లూరు, ఏప్రిల్ 12

ఏపీలో 13 ఏళ్ల పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్ చేయటంపై ప్రభుత్వం ఫోకస్ పెటటింది. ఇప్పటికే ప్రాథమికంగా కసరత్తు చేయగా? త్వరలోనే విధివిధానాలు తయారుచేసి, ముసాయిదా చట్టాన్ని సిద్ధం చేయనున్నారు. ఇదే అంశంపై తాజాగా ఐటీ మంత్రి నారా లోకేశ్ సమీక్షించారు. చిన్నపిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచేందుకు విధివిధానాల తయారీ, చట్టరూపకల్పనపై మంత్రుల బృందం చర్చించింది పిల్లలకు వయసు ఆధారిత కంటెంట్ ను అందుబాటులో ఉంచేవిధంగా విధివిధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియాలో మహిళలపట్ల అవమానకరమైన, విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. పిల్లల డిజిటల్ భద్రత, శ్రేయస్సు, లీగల్ మెకానిజం ఫ్రేమ్ వర్క్ పై ఇతర రాష్ట్రాలు, దేశాల్లో అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలను అధికారులు అధ్యయనం చేయాలన్నారు. పిల్లలను సెన్సిటివ్ కంటెంట్ కు దూరంగా ఉంచడంపై ఆస్ట్రేలియా, సింగపూర్, డెన్మార్క్ వంటి దేశాల్లో అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు. పిల్లలపై సోషల్ మీడియా ప్రభావంపై పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. నో బ్యాగ్ డే రోజున ఉపాధ్యాయులు విద్యార్థులకు, ప్రతిఏటా రెండుసార్లు నిర్వహించే మెగా పిటిఎంలో కూడా తల్లిదండ్రులు, విద్యార్థులకు సోషల్ మీడియా దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తామన్నారు. వయసు నిర్ధారణ కోసం డిజిలాకర్ తో కూడిన ఏజ్ టోకెన్ ల వినియోగంపై అధ్యయనం చేయాల్సిందిగా మంత్రి లోకేశ్ అధికారులకు సూచించారు. ప్రజాభిప్రాయం అనంతరం కేంద్రప్రభుత్వ చట్టపరిధిలోని అంశాలపై నివేదికను అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సున్నితమైన కంటెంట్ ను చిన్నపిల్లలకు దూరంగా ఉంచడంపై విధివిధానాలు, ఫిర్యాదులపై తీసుకుంటున్న చర్యలను వివిధ సోషల్ మీడియా ప్లాట్ ఫాంల ప్రతినిధులు మంత్రుల బృందానికి వివరించారు. ఐటీ చట్టంలోని సెక్షన్ ? 46 కింద న్యాయ నిర్ణయాధికారిని వెంటనే నియమించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 13 ఏళ్లలోపు పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచడంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాథమికంగా కసరత్తు చేస్తోంది. ఆస్ట్రేలియా, సింగపూర్ మరియు డెన్మార్క్ వంటి దేశాల్లో అమలులో ఉన్న మైనర్ల డిజిటల్ భద్రతా చట్టాలను అధికారులు అధ్యయనం చేస్తున్నారు. ముసాయిదా చట్టం సిద్ధం చేసిన తర్వాత ఏపీ కేబినెట్ ఆమోదముద్ర వేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత శాసనసభ ఆమోదం తర్వాత? గవర్నర్ సంతకం చేయాలి. ఆ తర్వాత గెజిట్ విడుదలవుతుంది.

# వైసీపీలో మారుతున్న సామాజిక లెక్కలు

విజయవాడ, ఏప్రిల్ 12



వైఎస్సార్ పార్టీ.. ఏపీలో విపక్షం. మాజీ సీఎం వైఎస్సార్ తనయుడిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టి, ఆ తర్వాత ఉమ్మడి రాష్ట్ర విభజన, కాంగ్రెస్ వైఖరితో విభేదించి కొత్తపార్టీ పెట్టిన రాజకీయ అసాధ్యుడు. ఐదేళ్ల విపక్ష బాధ్యతల తర్వాత 2019లో అధికారాన్ని సైతం సాధించి, సీఎంగా పాలన సాగించారు. పరిపాలన సమయంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలకు ప్రజామోదం లేకపోవడం, అదే సమయంలో చంద్రబాబు, లోకేష్ అలుపెరగక చేపట్టిన ప్రచారంతో.. వైసీపీ ఘోరంగా ఓటమి పాలైంది.

బేసిగ్గా చూస్తే.. జగన్ అధికారంలో ఉన్నప్పుడు వైసీపీలో ఎక్కువ పదవులు రెడ్డి సామాజిక వర్గానికే దక్కాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆయా సామాజిక వర్గం నేతలు.. రాజకీయాల్లో హడావుడి చేసేవారు. వారు కోటరీ కట్టి జగన్ కు కళ్లు, చెవులుగా వ్యవహరించారన్న విమర్శలు ఉన్నాయి. అలాంటి నేతలు పవర్ పోవడం, లోకేష్ రెడ్ బుక్ లాంటి పరిణామాలతో కాస్త సైలెంట్ అయ్యారు. వారిస్థానాల్లో ఇప్పుడు బీసీ, ఎస్సీ ఎస్టీ నేతలు .. ముందుండి పార్టీ కార్యక్రమాలను నడుపుతున్నారు. బొత్స సత్యనారాయణ శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా చురుకుగా వ్యవహరిస్తుండగా, అంబటి రాంబాబు, పేర్ని నాని పార్టీ స్వరంగా నిలుస్తున్నారు. జోగి రమేష్ కూడా బెయిల్‌పై విడుదలైన తర్వాత తన స్వరాన్ని మరింత పెంచారు. పార్టీ కార్యక్రమాలు, మీడియా సమావేశాల్లో వీరే ముందుండటం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ పరిణామాలన్నింటినీ పరిశీలిస్తే? వైసీపీలో సామాజిక సమీకరణాలు కొత్త దిశగా మారుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కష్టకాలంలో బీసీ, ఎస్సీ వర్గాలకు చెందిన నేతలు ముందుకు వచ్చి పార్టీని నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారని, అదే సమయంలో జగన్‌కు సమీపంగా ఉన్న నేతలు వ్యూహాత్మకంగా దూరంగా ఉంటున్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఇదే నేతలు ఒక వేళ జగన్రాజకీయంగా పుంజుకుంటే మళ్లీ ఆయన పక్కకు చేరతారని, కోటరీ కడతారనే వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో జగన్ అధికారంలోకి రాగానే తన సామాజిక వర్గానికి చెందిన వారికి ముఖ్యమైన మంత్రి పదవులను అప్పగించారు. జగన్ హయాంలో దాదాపు 24 మంది ప్రభుత్వ సలహాదారులలో 17 మంది రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారే ఉండటం అప్పట్లో రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఇప్పుడు అదే నేతలు మౌనంగా ఉండడానికి కారణం ఏమిటనే చర్చ సాగుతోంది.

# కేబినెట్ లో లీక్ వీరులు...

కాకినాడ, ఏప్రిల్ 12

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇప్పుడు ఒకే ఒక అంశం హాట్ టాపిక్‌గా మారింది. అదే 'కేబినెట్ అజెండా లీక్'. ప్రభుత్వ నిర్ణయాలు అధికారికంగా వెలువడక ముందే బయటకు పొక్కడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఈ అంశంపై మంత్రులకు ఆయన క్లాస్ పీకడమే కాకుండా, సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. సాధారణంగా కేబినెట్ సమావేశం అంటే అత్యంత గోప్యంగా జరిగే ప్రక్రియ. అందులో చర్చించే అంశాలు, తీసుకోబోయే నిర్ణయాలు సమావేశం ముగిసిన తర్వాత మీడియాకు వెల్లడిస్తారు. కానీ, గత కొంతకాలంగా ఏపీలో కేబినెట్ భేటీ కంటే ముందే అజెండాలోని అంశాలు మీడియాలో హల్చల్ చేస్తున్నాయి. దీనిపై చంద్రబాబు గుర్రుగా ఉన్నారు. ప్రభుత్వంలోని అత్యున్నత నిర్ణాయక మండలి నిర్ణయాలు ఇలా వీధికెక్కడం ఏంటని సీఎం మంత్రులను సూటిగా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. కీలక సమాచారం బయటకు వెళ్లడం వల్ల ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతినడమే కాకుండా, కొన్ని నిర్ణయాల అమలులో ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు గత చరిత్రను గుర్తు చేస్తూ మంత్రులను హెచ్చరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎన్టీఆర్ తీసుకున్న సంచలన నిర్ణయాన్ని ఆయన ప్రస్తావించారు. గతంలో కేబినెట్ అజెండా లీక్ అయినప్పుడు, క్రమశిక్షణ విషయంలో రాజీ పడని ఎన్టీఆర్ ఏకంగా తన పూర్తి మంత్రిమండలిని రద్దు చేసిన విషయాన్ని చంద్రబాబు గుర్తు చేశారు. ఇకపై అజెండా లీక్ అయితే దానికి సంబంధిత శాఖా మంత్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని, బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని తేల్చి చెప్పారు. ప్రభుత్వ సమాచారం లీక్ అవ్వడం వెనుక రెండు ప్రధాన కోణాలు కనిపిస్తున్నాయి. తాము చేస్తున్న పనులు లేదా తీసుకోబోయే నిర్ణయాలను ముందే లీక్ చేయడం ద్వారా క్రెడిట్ కొట్టేయాలని కొందరు మంత్రులు లేదా వారి అనుచరులు ప్రయత్నిస్తున్నారా? అనే అనుమానం ఉంది. మంత్రుల కార్యాలయాల్లోని పీఎస్ లు లేదా ఇతర సిబ్బంది ద్వారా మీడియాకు సమాచారం చేరుతోందా? అనే కోణంలోనూ చర్చ జరుగుతోంది. భూముల కేటాయింపు లేదా కొత్త పథకాలకు సంబంధించిన నిర్ణయాలు ముందే లీక్ అయితే మార్కెట్ శక్తులు వాటిని ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. కేబినెట్ గోప్యతను కాపాడలేకపోతే ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న పట్టు సడలుతుందనే భావన ఏర్పడుతుంది. చంద్రబాబు కేవలం హెచ్చరికతోనే ఆగిపోకుండా, నిఘా పెంచాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. "గతంలో లీకులు జరిగాయి.. ఇకపై అవి పునరావృతం కాకూడదు" అని ఆయన స్పష్టం చేశారు. ఎన్టీఆర్ ఉదంతాన్ని గుర్తు చేయడం ద్వారా, తాను కూడా కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి వెనుకాడబోననే సంకేతాన్ని తన కేబినెట్ సహచరులకు పంపారు.

# వైసీపీతో బీసీవై కలిసి పోటీ...

విజయవాడ, ఏప్రిల్ 12 , రాజకీయాల్లో ఎవరు ఎప్పుడు ఏ స్థితిలో ఉంటారో చెప్పలేము. ఎందుకంటే ఒకసారి ఓటమి ఎదురవుతుంది. మరోసారి గెలుపు తలుపు తడుతుంది. అయితే రాజకీయ అవసరాలు కూడా అంతే. ఎవరితో ఏ అవసరం వస్తుందో చెప్పలేం కూడా. ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అదే పరిస్థితి. ప్రత్యర్థి పార్టీలను ఓ రేంజ్ లో వేసుకోవడం వైసీపీకి తెలిసినంతగా మరొకరికి తెలియదు. అయితే ఈ విషయంలో జనసేన కూడా బాధితురాలు. ఎందుకంటే జనసేన ను టార్గెట్ చేసుకొని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేయని ప్రచారం అంటూ లేదు. మొన్న జనసేన సంపూర్ణ విజయం, వైయస్సార్ కాంగ్రెస్ దారుణ ఓటమితో ఈ ప్రచారం కొట్టుకెళ్లిపోయింది. కానీ ఇప్పుడు అదే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భారత చైతన్య యువజన పార్టీ.. అలియాస్ బిసివై పార్టీపై ఆధారపడుతోందన్న టాక్ ప్రారంభం అయింది. ఆ పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా మాట్లాడుతుండడం కొత్త రాజకీయ పరిణామం. చిత్తూరు జిల్లాకు చెందిన బోడె రామచంద్ర యాదవ్ భారత యువజన చైతన్య పార్టీని ఏర్పాటు చేశారు. బడుగులకు రాజ్యాధికారం అన్న నినాదంతో ఈ పార్టీని స్థాపించారు. పారిశ్రామికవేత్త అయిన బోడే రామచంద్ర యాదవ్ కు కేంద్రంలో మంచి పట్టు ఉంది. 2019 ఎన్నికల కు ముందు పొలిటికల్ ఎంట్రీ ఇచ్చి జనసేన తరఫున పుంగనూరు నుంచి పోటీ చేశారు. కానీ ఓటమి ఎదురయింది. కనీసం డిపాజిట్లు రాలేదు. అయితే తరువాత భారత చైతన్య యువజన పార్టీని ఏర్పాటు చేశారు. కానీ అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బీసీవై పార్టీని టార్గెట్ చేశారు. పలుమార్లు బోడే రామచంద్ర యాదవ్ ఇంటిపై దాడి కూడా జరిగింది. కేవలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని టార్గెట్ చేస్తూ చంద్రబాబు బీసీవై పార్టీ వెనుక ఉన్నారనేది అప్పట్లో ఒక విమర్శ. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అయితే బోడె రామచంద్ర యాదవ్ పై ఓ రేంజ్ లో విరుచుకు పడేవారు. ఆయన పేరును ప్రస్తావించేందుకు కూడా ఇష్టపడేవారు కాదు. పూజకు పనికిరాని పువ్వు అని సంబోధించేవారు. గతంలో బోడె రామచంద్ర యాదవ్ పై దాడి జరిగినప్పుడు అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు ఖండించారు. ఒక సాధారణ నేతగా ఉన్న బోడె రామచంద్ర యాదవ్ విషయంలో ప్రతిపక్ష నేత స్పందించడం అప్పట్లో ఒక సంచలనమే. కనీసం బీసీవై పార్టీ ఒక పార్టీయేనా అని వ్యాఖ్యానించేవారు వైసీపీ సామాన్య కార్యకర్తలు.. కానీ ఇటీవల ఎందుకో బోడె రామచంద్ర యాదవ్ రూట్ మారింది. తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వాన్ని విపరీతంగా వ్యతిరేకిస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి విషయంలో సానుకూలంగా ఉన్నారు.

## మరో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కు ప్రమాదం

సూర్యాపేట ఏప్రిల్ 12

సూర్యాపేట జిల్లా కోదాడ బైపాస్ వద్ద జాతీయ రహదారిపై.. ముందు వెళ్తున్న లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. హైదరాబాద్ నుండి ఏలూరు వెళ్తున్న ఇంటర్ సిటీ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు లో బస్సులో 36 మంది ప్రయాణికులు ఉండగా..అందులో 16మంది గాయపడినట్లు సమాచారం. వారిని స్థానికులు స్థానిక కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ నిద్ర మత్తులో ఉండడం వల్లనే ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా పోలీసులు నిర్ధారించారు.

## బాలిక హత్యకు పాల్పడ్డ నిందితుడు వెంకటేష్ పై పోలీసుల కాల్పులు

కడప ఏప్రిల్ 12

ఖాజీపేట లోని అగ్రహారం కిందిన కీర్తన అనే విద్యార్థిని గొంతు కోసిన వెంకటేష్ ను పోలీసులు వేరే ప్రదేశంకు తీసుకెళుతుండగా.. పోలీసులపై వెంకటేష్ దాడికి పాల్పడిన నేపథ్యంలో మైదుకూరు బద్వేల్ ప్రధాన రహదారిలోని బసాపురం చెక్ పోస్ట్ వద్ద నిందితుడు వెంకటేష్ పై పోలీసులు కాల్పులు జరిపినట్లు సమాచారం.. ఈ ఘటనలో పోలీసులకు కొందరికి గాయాలైన నేపథ్యంలో మైదుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నారు..ఈ ఘటనపై పూర్తి సమాచారం పోలీసుల వర్గాల నుండి వెల్లడి కావాల్సి ఉంది. నిందితుడు రిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు.

## బోటు బోల్తా పడి 10 మంది భక్తులు దుర్మరణం

లక్నో ఏప్రిల్ 12

బోటు బోల్తాపడి పదిమంది భక్తులు దుర్మరణం పాలయ్యారు. ఉత్తరప్రదేశ్లోని బృందావనాన్ని సందర్శించేందుకు.. లుథియానా నుంచి 30 మంది పర్యాటకులు వెళ్లారు. యమునా నదిలో రెండు బోట్లలో ప్రయాణం చేస్తుండగా బలంగా వీచిన గాలులకు ఒక బోటు ఊగిపోయింది. ఈ క్రమంలోనే అది పాంటూన్ వంతెనను ఢీకొనడంతో బోల్తా పడింది.

# కన్నింగ్ పాక్ మధ్యవర్తిత్వం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12

ఇరాన్?అమెరికా మధ్య రెండు వారాల సీజ్‌ఫైర్ కుదిరింది. దీనిని శాశ్వత శాంతిగా మార్చేందుకు పాకిస్తాన్ యత్నిస్తోంది. ఇందుకు రెండు దేశాల ప్రతినిధులతో ముఖాముఖి చర్చలు జరిపేందుకు ఇస్లామాబాద్‌లో వేదిక ఏర్పాటు చేసింది రెండు వారాల కాల్పుల విరమణ తర్వాత శాశ్వత శాంతి ఒప్పందం కుదుర్చుకునే లక్ష్యంతో జరుగుతున్న ఈ చర్చల్లో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అలీ బాగేరి కౌనీ పాల్గొంటున్నారు. నిలకడ లేని అమెరికా విధానాలు, టెంపరమెంట్‌తో ఊగిపోయే ఇరాన్ మధ్య పాకిస్తాన్ చేస్తున్న మధ్యవర్తిత్వం ఫలితాన్నిస్తుందా లేక మధ్యలోనే ఆగిపోతుందా అనేది ఉత్కంఠగా మారిందిపశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలకు తెరదించేందుకు పాకిస్తాన్?ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేసిన ప్రతిపాదనకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సానుకూలంగా స్పందించారు. ఇరాన్?అమెరికా మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణాన్ని చల్లార్చేందుకు పాకిస్థాన్ మధ్యవర్తిగా అవతరించడం ఇదే తొలిసారి. తొలుత చర్చల వార్తలను కొట్టిపారేసిన ఇరాన్, ఇప్పుడు కొన్ని స్నేహపూర్వక దేశాల ద్వారా అమెరికా నుంచి ప్రతిపాదనలు వచ్చినట్లు అంగీకరించింది. ఈ చర్చల్లో రెండు ప్రధాన అంశాలు కీలకంగా మారనున్నాయి. హార్ముజ్ జలసంధిపై నియంత్రణ మరియు ఇరాన్ అణు కార్యక్రమంపై ఇరు పక్షాలు తమ పట్టుదలను కొనసాగిస్తాయని అంచనా. పశ్చిమాసియా సంక్షోభానికి సెంటర్ ఆఫ్ పాయింట్ అయిన హార్ముజ్ జలసంధిపై ఆధిపత్యం కోసం ఇరు దేశాలు పోటీ పడుతున్నాయి. సీజ్‌ఫైర్ ఒప్పందం కోసం ఇరాన్ తన 10 షరతులలో హార్ముజ్ గుండా నౌకాయనం కూడా ఉంది. నౌకల రాకపోకలపై హామీతో కూడిన నియంత్రణ కల్పించాలని, చమురు, ఇంధన సరఫరా కోసం సురక్షితమైన నియమావళిపై నిర్ణయం తీసుకోవాలని ఇరాన్ డిమాండ్ చేసింది. హార్ముజ్‌పై తన నియంత్రణను కొనసాగించాలని పట్టుబడుతోంది. చర్చల్లో అమెరికా ఇరాన్ ముందు తన డిమాండ్లను ఉంచనుంది. వాటిలో అణు, బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాలను పూర్తిగా నిలిపివేయడం ఉండనుంది. గతంలో టెహ్రాన్ ఈ రెండింటినీ తిరస్కరించడం, చివరికి యుద్ధానికి దారితీసింది. ఇరాన్ అణు సంస్థ అధిపతి ఇటీవల మాట్లాడుతూ, 'యురేనియం సమృద్ధి హక్కును రక్షించుకోవడం అవసరం' అని ఘాటుగా హెచ్చరించారు. చర్చలు విఫలమైతే దీర్ఘకాలిక యుద్ధానికి సిద్ధమంటూ ఇరాన్ తేల్చి చెప్పింది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వం విజయవంతమవుతుందా అనే దానిపై అంతర్జాతీయ వర్గాల్లో మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. అమెరికాకు నమ్మకమైన భాగస్వామిగా పాకిస్తాన్ ఉంది. ఇరాన్‌తో పాకిస్తాన్ సత్సంబంధాలు కలిగి ఉంది. శాంతి చర్చలు సఫలమైతే ప్రాంతీయ శక్తిగా పాకిస్తాన్‌కు గుర్తింపు ఉంటుంది. అయితే పాకిస్తాన్ నిలకడ లేని విదేశాంగ విధానాలు, గతంలో పాక్?ఆఫ్ఘాన్ శాంతి చర్చలు విఫలం కావడం, ఇజ్రాయెల్?పాక్ మధ్య తాజా దౌత్య వివాద, అమెరికా, ఇరాన్ మధ్య నమ్మకం లేకపోవడం చర్చలకు విఘాతంగా మారింది.. పాక్ మధ్యవర్తిత్వంతో కుదిరిన ఈ చారిత్రాత్మక పరిణామం చమురు ధరల తగ్గింపుకు, ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి దోహదం చేస్తుంది. శాశ్వత కాల్పుల విరమణ, హార్ముజ్ జలసంధిలో స్వేచ్ఛాయుత నౌకాయనం, ఇరాన్ అణు కార్యక్రమంపై పరిమితులు, ఆర్థిక ఆంక్షల సడలింపు, ప్రాంతీయ భద్రతా హామీలు, ఉగ్రవాద వ్యతిరేక సహకారం, చమురు సరఫరా హామీలు, దౌత్య సంబంధాల పునరుద్ధరణ, మానవతా సహాయం, భవిష్యత్ సంఘర్షణల నివారణ అంశాలు కీలకంగా మారాయి. చర్చలు ప్రారంభమయ్యే ముందే ఇరాన్ ఘాటు హెచ్చరికలు చేసింది. చర్చలు విఫలమైతే దీర్ఘకాలిక యుద్ధానికి సిద్ధమంటూ ఇరాన్ తేల్చి చెప్పింది. హార్ముజ్‌ను తెరవకపోతే మళ్లీ దాడులు చేస్తామంటూ అమెరికా హెచ్చరించింది. ఈ నేపథ్యంలో చర్చలు విజయవంతమయ్యే అవకాశాలు సన్నగిల్లుతున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పాకిస్థాన్ మధ్యవర్తిత్వం విజయవంతమైతే పశ్చిమాసియాలో శాశ్వత శాంతి నెలకొనే అవకాశం ఉంది. అయితే, ఇరు పక్షాల పట్టుదల, నమ్మకరాహిత్యం, ప్రాంతీయ శక్తుల జోక్యం ఈ చర్చల విజయాన్ని ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి.

# పుంజుకుంటున్న టీవీకే పార్టీ

చెన్నై, ఏప్రిల్ 12 తమిళనాట టీవీకే పార్టీ ఎఫెక్ట్ రెండు ప్రధాన పార్టీలకు గట్టిగానే తగిలేట్టు ఉంది. తొలిసారి బరిలో ఉన్న దళపతి విజయ్‌కు ఏమాత్రం కలిసి వస్తుంది అన్నది అలా ఉంచితే, ప్రధాన పార్టీలైన డీఎంకే, అన్నా డీఎంకేలకు మాత్రం గట్టి దెబ్బ తప్పదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా సర్వేలు తమిళనాడు రాజకీయాల్లో సంచలన మార్పు తప్పదని సూచిస్తున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక ఓటు కొత్తగా పార్టీ విజయ్ వైపు వెళితే, అది అన్నాడీఎంకెకు కలిసి రావాలి.. కానీ తమిళనాట అది జరుగుతుందా అంటే కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. దీంతో ఇటు ఏఐడీఎంకే, అటు అధికార డీఎంకే రెండు పార్టీలను గుబులు పట్టుకుంది. చెన్నై మహానగరంలో 16 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఇవన్నీ దశాబ్దాలుగా డీఎంకే పార్టీకి కంచుకోటగా ఉంటున్నాయి. చెన్నై తోపాటు తిరువల్లూరు కాంచీపురం చెంగల్పట్టు జిల్లాలో కూడా డీఎంకేకు మంచి పట్టు ఉంది. ఈసారి డీఎంకే కూటమి ఏర్పాటు చేసి ఎన్నికల్లో వెళ్లిన ప్రతి సందర్భంలోనూ డీఎంకే పోటీ చేసే స్థానాలు కూడా ఈ ప్రాంతంలోనే ఎక్కువగా ఉంటాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మెజారిటీ స్థానాలు, ప్రతిపక్షంలో ఉన్నా కూడా ఆ పార్టీకి బలంగా నిలుస్తున్న ప్రాంతాలు కూడా ఈ జిల్లాలోని ఎక్కువగా ఉండడం అనేకసార్లు రుజువైంది. తాజాగా విజయ్ పార్టీ పెట్టడం విజయ్ స్వతహాగా క్రిస్టియన్ కావడం క్రిస్టియన్ మైనారిటీ ఓట్లన్నీ ఎక్కువగా విజయ్ వైపు వచ్చే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. అదే జరిగితే డీఎంకే ఓటు బ్యాంకును భారీగా గండి కొట్టడం జరుగుతుందన్న టాక్ బలంగా ఉంది. దీంతో డీఎంకేకు వచ్చే సీట్లపై విజయ్ ఎఫెక్ట్ పడుతుందన్న మాట వినబడుతుంది. అలా అని అక్కడ విజయ్ గెలిచే అవకాశాలు కూడా తక్కువే ఓట్ల చీలిక ఎక్కువగా ఉంటే అది అన్న డీఎంకే పార్టీకి తెచ్చి అవకాశం ఉందన్న అభిప్రాయం ఉంది.

# తెలుగు రాష్ట్రాల్లో ఆరెంజ్ అలెర్ట్...

హైదరాబాద్, ఏప్రిల్ 12

ఎండ తీవ్రత, వడగాల్పులపై ఏపీ ప్రజలకు వాతావరణశాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులపై ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ ప్రకటన జారీ చేశారు. ఏప్రిల్ 11వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా భానుడి ప్రతాపం, వడగాల్పులు తీవ్ర స్థాయిలో ఉండే అవకాశముందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. శనివారం ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమలో వేడి గాలులు బలంగా వీసే అవకాశముందని, గరిష్ట ఉష్ణోగ్రతలు తారాస్థాయిలో నమోదవుతాయని అంచనా వేశారు. కాకినాడ జిల్లాలోని 2, తూర్పుగోదావరి జిల్లాలో 4, ఎన్టీఆర్ జిల్లాలో 3, ఏలూరు జిల్లాలో 3, అనకాపల్లి జిల్లాలో 5, పోలవరం జిల్లాలో 6, పార్వతీపురం మన్యం జిల్లాలో 14, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1, విజయనగరం జిల్లాలో 20, శ్రీకాకుళం జిల్లాలో 8 మండలాల్లో వడగాలులు వీస్తాయని హెచ్చరించారు.ఇక ఎన్టీఆర్ జిల్లాలో 3 మండలాల్లో వడగాల్పులు ఇవాళ వీస్తాయని, ఇక 79 మండలాల్లో వీటి ప్రభావం ఉంటుందని వాతావరణశాఖ తెలిపింది. ఇక ఆదివారం 93 మండలాల్లో వడగాల్పుల తీవ్రత కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఇక శుక్రవారం ఉష్ణోగ్రతల విషయానికొస్తే.. కాకినాడ జిల్లా కరపలో 44.1 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదవ్వగా.. కడపలో 43.6 డిగ్రీల ఉష్ణోగ్రత, పశ్చిమగోదావరి జిల్లా పోడూరులో 42.9 డిగ్రీల ఉష్ణోగ్రత, తిరుపతి జిల్లాలోని వరదయ్యపాలెంలో 42.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణశాఖ వివరాలు వెల్లడించింది. ఇక రాష్ట్రంలోని 22 జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అటు నేడు ఏపీలోని విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాలో పిడుగులతో కూడిన తేలికపాటి వానలు పడతాయని అంచనా వేసింది.

తెలంగాణకు ఆరెంజ్ అలర్ట్

ఇక తెలంగాణలో రాబోయే మూడు నుంచి నాలుగు రోజుల పాటు ఎండ తీవ్రత పెరిగే అవకాశముందని ఈ మేరకు హైదరాబాద్ వాతావరశాఖ తెలిపింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతాయని అంచనా వేసింది. పలు జిల్లాల్లో ఇప్పటికే గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. ఇక నిజామాబాద్, ఆదిలాబాద్, నల్లగొండ, ఖమ్మం, ఆదిలాబాద్, మహబూబ్ నగర్ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. ఎండల క్రమంలో మధ్యాహ్నం వేళల్లో వృద్దులు, పిల్లలు బయటకు రాకపోవడం మంచిదని సూచించింది. అత్యవసరమై బయటకు వస్తే పలు జాగ్రత్తలు పాటించాలని సూచించింది. గర్భిణులు కూడా జాగ్రత్తలు పాటించాలని, వడదెబ్బ బారిన పడకుండా తగిన సూచనలు పాటించాలని సూచించింది. కాగా తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే ఎండలు దంచికొడుతుండగా.. రానున్న మరికొద్ది రోజుల్లో మరింత పెరిగే అవకాశముంది.

# కాళేశ్వరం రిపేర్లు... సవాలే..

కరీంనగర్, ఏప్రిల్ 12

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కాళేశ్వరం ప్రాజెక్టు గు రించి చర్చనీయాంశంగా మారింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ పునరుద్ధరణలో సమయమే ప్రస్తుతం అదిపెద్ద సవాల్‌గా మారింది. వరదల సీజన్ వేగంగా దగ్గరపడుతున్న నేపథ్యంలో, పరిమిత గడువులోనే విస్తృత స్థాయి మరమ్మతులు పూర్తి చేయాల్సిన పరిస్థితి అధికారుల ముందుంది. ఒకవైపు దెబ్బతిన్న బరాజ్‌లు, పంప్ హౌస్‌లో సాంకేతిక సమస్యలు, మరోవైపు క్లిష్టమైన ఇంజినీరింగ్ పనులు.. ఈ రెండింటినీ సమాంతరంగా పూర్తి చేయడం పెద్ద పరీక్షగా మారింది. వివరాలు పరిమితంగా ఉండటం రైతుల్లో అనుమా నాలను పెంచుతోంది. ఈసారి నిజంగా గడువులో పూర్తవుతాయా? అనే ప్రశ్న గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది.కాళేశ్వరం ప్రాజెక్ట్ పునరుద్ధరణలో నిర్మాణ సంస్థల స్పందన అత్యంత కీలకంగా మారింది. భారీస్థాయిలో సాంకేతిక మరమ్మతులు, నిర్మాణపరమైన పనులు అవసరమవుతున్న నేపథ్యం లో సంస్థలు ముందుకు వస్తాయా అన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా నిలిచింది. గతంలో ఎదురైన సాంకేతిక సమస్యలు, ప్రాజెక్ట్‌పై ఏర్పడిన ప్రతిష్ఠాత్మక ఒత్తిడి, ఆర్థిక లావాదేవీల అనిశ్చితి కలిసి కాంట్రాక్టర్లలో అభద్రతాభావం నెలకొంది.ముఖ్యంగా మేడిగడ్డ



అయితే ప్రాజెక్టులోని బరాజ్‌ల కుంగుబాటు కారణంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో చుక్క నీరు కూడా ఎత్తిపోయని విషయం తెలిసిందే. తాజాగా సీఎం రేవం త్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతుల పురోగతిపై సమీక్షించిన నేపథ్యంలో ప్రాజెక్టు వినియోగంలోకి రావడంపై ఆసక్తి నెలకొంది.కానీ రాబోయే రెండు, మూడు నెలల్లో వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మరమ్మతులు గడువులో పూర్తవుతాయా అన్న ఉత్కంఠ రాష్ట్రవ్యాప్తంగా నెలకొంది. నిర్ణీత గడువులోగా మరమ్మతు పనులు పూర్తి కావడంపై సాగునీటి నిపుణులు సైతం అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇలాంటి కీలక సమయం లో ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి.ఇదిలా ఉండగా మరోవైపు నిర్మాణ సంస్థలు పునరుద్ధరణ పనులకు ముం దుకు వస్తాయా అన్న సందిగ్ధత కూడా తెరపైకి వస్తుంది. గతంలో ఎదురైన సాంకేతిక లోపాలు, ఇప్పటికే కాళేశ్వరం నీళ్లు అందక లక్షల ఎకరాల సాగు అనిశ్చితిలో పడిన నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు భవిష్యత్ కీలకంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న గడువులోగా, వరదలు రాకముందే ఈ మరమ్మతులు పూర్తుతైనే రైతులకు ఊరట, లేకపోతే వ్యవసాయ రంగానికి మరో పెద్దదెబ్బ తప్పదనే భావన మరింత బలపడుతోంది.కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి తాజా సమీక్ష, పనులు వేగవంతం చేయాలన్న కఠిన ఆదేశాలతో రైతుల్లో మళ్లీ ఆశ లు చిగురిస్తున్నా యి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో లక్షల ఎకరాల సాగు పూర్తిగా ఈ ప్రాజెక్ట్‌పై ఆధారపడటంతో, మరమ్మతులు త్వరగా పూర్తుతై నీటి సరఫరా పునరుద్ధరించే నమ్మకం రైతాంగంలో కొంత ఊరటనిస్తోంది. గతంలో ఈ ప్రాజెక్ట్ ద్వారా సాగునీరు అందిన సమయంలో పంటల దిగుబడులు పెరిగిన అనుభవం రైతులకు ఉన్నందున ఈసారి కూడా అదే పరిస్థితి తిరిగి వస్తుందన్న ఆశ స్పష్టంగా కనిపిస్తోంది.అయితే ఈ ఆశలతోపాటు ఆందోళనకర పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి. గతం లో మేడిగడ్డ వంటి కీలక భాగాల్లో తలెత్తిన సాం కేతిక లోపాలు, మరమ్మతుల్లో జరిగిన ఆలస్యం రైతుల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. ఇప్పటికీ పూర్తిస్థాయి పునరుద్ధరణపై స్పష్టత లేకపోవడం, ప నుల పురోగతిపై అధికారికంగా వెల్లడయ్యే వంటి కీలక నిర్మాణాల్లో లోపాలు బయటపడిన తర్వాత, మరమ్మతులు సాధారణ పనులు కాకుండా అత్యంత క్లిష్టమైన ఇంజినీరింగ్ సవాళ్లుగా మారాయి. ఇలాంటి పనులకు నైపుణ్యం ఉన్న సంస్థలు మాత్రమే ముందుకు రావాల్సి ఉండగా, వాటి సంఖ్య పరిమితంగా ఉండటం కూడా ఒక సమస్యగా మారింది. ఇక చెల్లింపుల విషయంలో అస్పష్టత, గ్యారంటీలు, అదనపు ఖర్చుల భారం ఎవరు భరిస్తారు? అన్న అంశాలు కూడా కీలకంగా మారాయి.ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీలు, ప్రోత్సాహకాలు ప్రకటిస్తేనే సంస్థలు ముందుకు వచ్చే అవ కాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. లేకపోతే టెండర్ ప్రక్రియ ఆలస్యం కావడం, పనులు ప్రారంభం కావడంలో జాప్యం ఏర్పడే ప్రమాదం ఉంది. దీంతో కాళేశ్వరం పునరుద్ధరణలో సాంకేతిక అంశాలకంటే నిర్మాణ సంస్థల భాగస్వామ్యం ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది. పనుల ప్రణాళిక, టెండర్లు, నిర్మాణ సంస్థల ఎంపిక, యంత్రాంగం సమీకరణ వంటి ప్రతి దశలో ఆలస్యం జరిగే అవకాశాలు ఉండటంతో గడువు మరింత కఠినంగా మారుతోంది. ముఖ్యంగా భారీస్థాయి నిర్మాణాల మరమ్మతులకు సాధారణంగా ఎక్కువ సమయం అవసరం ఉండగా, ఇప్పుడు మాత్రం కొద్ది నెలల్లోనే పూర్తి చేయాల్సిన ఒత్తిడి ఏర్పడింది. ఇక ముందస్తు వర్షాలు లేదా అనుకోని వరదలు వస్తే పనులకు అంతరాయం కలిగే ప్రమాదం ఉంది. మరోవైపు అధికారులు రోజువారీ మానిటరింగ్, ప్రత్యేక బృందాల ఏర్పాటు, నిపుణుల పర్యవేక్షణ వంటి చర్యలు గడువుపై ప్రభావం చూపనున్నాయి.కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల కారణంగా సుమారు 8 లక్షల ఎకరాల సాగుభూమి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ఈ ప్రాజెక్ట్‌పై ఆధారపడిన ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పంటల సాగు పెద్దఎత్తున ప్రభావితమవుతోంది. నీటి సరఫరా నిలిచిపోవడంతో రైతులు ఏ పంట వేయాలన్న దానిపై స్పష్టత లేక గందరగోళంలో పడుతున్నారు.ఇప్పటికే రాబోయే సాగు సీజన్ దృష్ట్యా రైతులు ప్రణాళికలు సి ద్ధం చేసుకోవాల్సిన సమయంలో, నీటి లభ్యతపై స్పష్టత లేకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చింది. కొందరు రైతులు తక్కువ నీటితో పెరిగే పంటల వైపు మళ్లుతుండగా, మరికొందరు పూర్తి గా సాగును వాయిదా వేసే పరిస్థితి కనిపిస్తోంది. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రత్యక్ష ప్రభావం చూపే అవకాశం ఉంది.

# సోషల్ మీడియా అస్త్రసన్యాసం

విజయవాడ ఏప్రిల్ 12

జనసేన సోషల్ మీడియా బలహీనమైంది. ఒకరకంగా జనసైనికులు అస్త్ర సన్యాసం చేసినట్లు కనిపిస్తున్నారు. 2014 నుంచి 2024 తర్వాత కూడా ఎంతో యాక్టివ్ గా ఉండే జనసైనికులు సోషల్ మీడియాలో ఇప్పుడు యాక్టివ్ గా కనిపించడం లేదు. తమ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పై చేసే విమర్శలకు కూడా వారి నుంచి స్పందన లేదు. ఇది ప్రమాదకరమని జనసేన పార్టీ నాయకత్వం గుర్తించాలి. ఈ ఏడాదిన్నర కాలంలో తమను విస్మరించారన్న కారణంతోనే వారు సోషల్ మీడియాలో యాక్టివ్ గా లేకపోవడానికి ప్రధాన కారణమని పార్టీ నేతలే స్వయంగా అంగీకరిస్తున్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమను పట్టించుకోవడం లేదన్న అభిప్రాయం ఎక్కువ మంది జనసైనికుల్లో ఉంది. తాము అనవసరంగా పవన్ కల్యాణ్ కు సపోర్టుగా పోస్టులు పెట్టి ప్రత్యర్థులు కావడం ఎందుకన్న ఆలోచనలో ఉన్నారు. గతంలో ఈ పరిస్థితి లేదు. పవన్ కల్యాణ్ పైన కానీ, ఆయన కుటుంబ సభ్యులపై ఎవరు విమర్శలు చేసినా వదలకుండా వెంటపడే వారు. పవన్ కల్యాణ్ ఒక పిలుపునిస్తే వెంటనే సోషల్ మీడియాలో పోస్టులు చేసేవారు. రోడ్లమీద గుంతల విషయంలోనూ గత ప్రభుత్వంలో జనసైనికులు సోషల్ మీడియాను షేక్ చేయగలిగారు.కానీ ఇప్పుడు పవన్ పైనా, ఆయన కుటుంబ సభ్యులపైన వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నా పట్టీపట్టనట్లు ఊరుకుంటున్నారు. వైసీపీ నాయకురాలు రోజా అసలు రాజకీయాలకు సంబంధం లేని అన్నా లెజినోవా ని టార్గెట్ చేస్తూ మాట్లాడుతుంటే వారికి కౌంటర్ ఇవ్వడానికి జనసేన నుంచి గెలిచిన ఎమ్మెల్యే, ఎంపీ లతో పాటు చివరకు జనసైనికులు కూడా స్పందించకపోవడం ఆ పార్టీ బలహీనత ఏంటో చెప్పకనే చెబుతుంది. జనసైనికులు సోషల్ మీడియాకు దూరంగా ఉంటున్నారని గత కొంత కాలం నుంచి నాయకత్వం గ్రహించినా దిద్దుబాటు చర్యలు తీసుకోవడం లేదన్నది పార్టీ నుంచి వినిపిస్తున్న మాట

# హత్య కేసులో ఐదుగురు నిందితులు అరెస్టు

వికారాబాద్ ఏప్రిల్ 12

వికారాబాద్ జిల్లా దోమ మండలం బడేంపల్లిలో గురువారం సాయంత్రం జరిగిన కావలి లాలయ్య హత్య కేసులో పోలీసులు 5 మంది నిందితులను రిమాండుకు తరలించారు. అక్రమ సంబంధం కారణంగానే ఈ దారుణ హత్య జరిగినట్లు పరిగి డిఎస్పీ శ్రీనివాసులు అధికారికంగా ధ్రువీకరించారు. ఈ కేసులో అదే గ్రామానికి చెందిన నీరటి భాస్కర్, అంజిలయ్య, శ్రీనివాస్, నరేష్ మరియు పద్మమ్మలను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా ...మృతుడు కావలి లాలయ్యకు గ్రామానికి చెందిన సుజాత అనే మహిళతో అక్రమ సంబంధం ఉందని... దీనిపై సదరు మహిళా కుటుంబ సభ్యులు పలుమార్లు హెచ్చరించినప్పటికీ లాలయ్య వినకపోవడంతో కక్ష పెంచుకున్నారని డీఎస్పీ తెలిపారు. గురువారం మధ్యాహ్నం లాలయ్య మహిళతో కలిసి బడేంపల్లి శివారులోని దండెమ్ చెరువు కాలువ వద్ద ఉండగా చూసిన నిందితులు... ఒక్కసారిగా వారిపై విరుచుకుపడి కర్రలు, రాళ్లతో లాలయ్యను విచక్షణా రహితంగా కొట్టి చంపేశారని స్పష్టం చేశారు. అంతటితో ఆగకుండా మృతదేహాన్ని పెట్రోల్ పోసి తగలబెట్టేందుకు ప్రయత్నించగా.. లాలయ్య కుమారులు అక్కడికి చేరుకోవడంతో నిందితులు పరారయ్యారు. డయల్ 100 కాల్ ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి హత్యకు వాడిన మూడు కట్టెలను స్వాధీనం చేసుకున్నామని..నిందితులను రిమాండ్కు తరలించామన్నారు.ఘటనకు కారణమైన అసలు సూత్రధారి సుజాత సంఘటన జరిగినప్పటికీ నుండి ఇప్పటివరకు కనిపించడం లేదు. సుజాత ఆచూకీ కోసం వెదుకుతున్నామని డీఎస్పీ తెలిపారు.

# టూరిస్ట్ స్పాట్ గా కర్రెగుట్ట

వరంగల్, ఏప్రిల్ 12

ములుగు జిల్లాలోని కర్రెగుట్టలు అంటే.. మావోయిస్టులకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది. కీలక నేతలు ఇక్కడ తలదాచుకునేవారు. కానీ ఇప్పుడు ఈ ప్రాంతం బలగాల చేతుల్లోకి వచ్చేసింది. ప్రభుత్వం కూడా దీనిని ఎకో టూరిజం హబ్‌గా మార్చాలని భావిస్తోంది. మావోయిస్టు రహిత ప్రాంతంగా మారిందని డీజీపీ శివధర్ రెడ్డి ప్రకటించారు. మావోయిస్టుల ఉనికి తెలంగాణలో లేదన్నారు.అపారమైన అటవీ సంపదతో, సుందరమైన సహజ సౌందర్యానికి ప్రసిద్ధి చెందిన కర్రెగుట్టల ప్రాంతాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా మార్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. పర్యటించే పర్యాటకులకు పూర్తి భద్రత కల్పించే లక్ష్యంతో పామునూరు ప్రత్యేక పోలీస్ అవుట్‌పోస్ట్ నిర్మాణానికి శంకుస్థాపన కూడా జరిగింది.పామునూరు ఆపరేటింగ్ బేస్ సమీపంలో ఇంటర్ ఏజెన్సీ కో-ఆర్డినేషన్ సెంటర్, పోలీస్ ఔట్ పోస్ట్ నిర్మాణానికి పోలీసు అధికారులతో కలిసి డీజీపీ శంకుస్థాపన చేశారు. మురుమూరు నుంచి పామునూరుకు, అక్కడి నుంచి తడపల అనే ప్రాంతానికి 13 కిలోమీటర్ల రహదారి నిర్మాణం కూడా జరుగుతోంది.కర్రెగుట్టల ప్రాంతంలో మావోయిస్టుల ప్రభావం ఇప్పుడు లేదని డీజీపీ పేర్కొన్నారు. ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం



ఎల్లప్పుడూ ఆదివాసీ సమాజానికి అండగా నిలుస్తూ, వారి సామాజిక, ఆర్థిక ఉన్నతికి కృషి చేస్తాయని తెలిపారు.కర్రెగుట్టలు ప్రాంతం వంటి కొండ ప్రాంతాలలో వ్యూహాత్మక స్థావరాన్ని ఏర్పాటు చేసుకోవడానికి, అలాగే ఆ ప్రాంతం మావోయిస్టు కార్యకలాపాల రహితంగా ఉండేలా చూసుకోవడానికి రాష్ట్ర పోలీసు, సీఆర్పీఎఫ్ బలగాల మధ్య నిరంతర సమన్వయం అత్యవసరం అని డీజీపీ శివధర్ రెడ్డి నొక్కి చెప్పారు.అంతేకాదు పామునూరు గుట్టల మీద నివసిస్తున్న ఏడు ఆదివాసీ కుటుంబాలకు బియ్యం, నిత్యావసర వస్తువులతోపాటుగా రవాణా కోసం ఆటోలను, బైకులను కూడా పోలీస్ శాఖ పంపిణీ చేసింది. ఇక వారికి పట్టణాలకు, గ్రామానికి మధ్య కనెక్టివిటీ పెరుగుతుంది.ఇక మె?త్తానికి తెలంగాణలో నక్సలిజం లేదని డీజీపీ శివధర్ రెడ్డి ప్రకటించారు. కర్రెగుట్టలు ప్రాంతాన్ని టూరిజం కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం కూడా ఆలోచనలు చేస్తోంది. ఏదైనా ఏజెన్సీకి టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేయాలని బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. నైట్ స్టేలు, హోటళ్లులాంటివి కూడా రావొచ్చు. ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లి తరహాలో టూరిజం స్పాట్‌గా చేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

==================

# మే 11 నుంచి జనాభా గణన

హైదరాబాద్, ఏప్రిల్ 12

తెలంగాణలో 2027 జనాభా లెక్కల సేకరణ ప్రక్రియకు రంగం సిద్ధమైంది. మే 11వ తేదీ నుంచి ఈ ప్రక్రియ షురూ కానుంది. జూన్ 9, 2026 వరకు పూర్తిగా డిజిటల్ విధానంలో జరగనుంది. ఈ తరహా డిజిటల్ లెక్కింపు విధానం? దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో చేపట్టనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.2011 వరకు మాన్యువల్(కాగితాలపై) విధానం ద్వారా జనాభా లెక్కింపు కొనసాగింది. అయితే ఈసారి అందుకు భిన్నంగా 2027 జనాభా లెక్కలను డిజిటల్ విధానంలో నిర్వహిస్తామని తెలంగాణ జనాభా లెక్కల కార్యకలాపాల డైరెక్టర్ భారతి హోలికేరి గురువారం తెలిపారు.మొదటి దశ ప్రక్రియ మే 11 నుండి జూన్ 9 వరకు జరుగుతుందని ఆమె ప్రకటించారు. రెండవ దశ ఫిబ్రవరి 2027 లో జరుగుతుందని తెలిపారు. తెలంగాణల జరిగే ఈ జనాభా లెక్కింపులో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లతో సహా 88,000 మంది సిబ్బంది పాల్గొంటారని ప్రకటించారు. సుమారు 93,000 నుంచి 94,000 మంది ఉద్యోగులు శిక్షణ పొందుతున్నారని వివరించారు."మునుపటి జనాభా గణనలతో పోలిస్తే ఇది చాలా ప్రత్యేకతను కలిగి ఉంది. మొదటిసారిగా డిజిటల్ మోడ్ లో లెక్కించబోతున్నాము. 2011 జనాభా లెక్కల వరకు గణనలు కాగితం ఆధారితంగా ఉండేవి. సెన్సస్ మేనేజ్ మెంట్ మానిటరింగ్ సిస్టమ్ (సీఎంఎంఎస్), సెల్ఫ్ ఎన్యూమరేషన్ పోర్టల్, హెచ్ ఎల్ వో యాప్ వంటి వివిధ డిజిటల్ సాధనాలు అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి ఇంటి నుంచి డేటాను సంగ్రహించడానికి ఎన్యూమరేటర్లు ఉంటారు" అని భారతి హోలికేరి తెలిపారు.డిజిటల్ విధానంలో సేకరించబోయే డేటా అత్యంత సురక్షింతగా ఉండనుంది. డేటా అప్లోడ్ అయిన వెంటనే?. అది ఎన్యూమరేటర్ల పరికరాల నుంచి సెంట్రల్ సర్వర్లలోకి వెళ్లిపోతుంది. ఎలాంటి అనుమానాలకు అవకాశం ఉండదని భారతి హోలికేరి స్పష్టం చేశారు.జనాభా గణనలో భాగంగా నిర్వహించబోయే కులగణనపై కూడా భారతి హోలికేరీ స్పందించారు. మొదటి దశలో ఇంటి పెద్ద (ఎస్సీ, ఎస్టీ, ఇతరులు) పేరు, కులం సేకరిస్తామన్నారు. రెండవ దశలో ఇతర సభ్యుల కుల వివరాలను సేకరిస్తామని తెలిపారు.జనాభా లెక్కల సమయంలో అడగాల్సిన ప్రశ్నల సంఖ్యపై ఆమె మాట్లాడుతూ?. మొదటి దశ షెడ్యూల్ ను కేంద్రం ఇప్పటికే నోటిఫై చేసిందని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా ఏకరీతిగా ఉన్న 33 ప్రశ్నలు అడుగుతామని ఆమె చెప్పారు.ఏప్రిల్ 16 నుంచి మే 10 వరకు తెలంగాణ ప్రజలకు సెల్ఫ్ ఎన్యూమరేషన్ పోర్టల్ అందుబాటులో ఉంటుంది. పోర్టల్ చాలా యూజర్ ఫ్రెండ్లీ డిజిటల్ టూల్. ఇంటి సందర్శన



సమయంలో పోర్టల్ లో పూర్తి చేసిన డేటాను ఎన్యూమరేటర్ లు ధృ?వీకరిస్తారు. పౌరుల కోసం హెల్ప్ లైన్ అందుబాటులోకి వస్తుంది.మొదటి దశ జనాభా గణన 2026 మే 11న ప్రారంభమై జూన్ 9 వరకు కొనసాగుతుంది. రెండో దశ 2027 ఫిబ్రవరిలో జరుగుతుంది.ప్రజలు తమకు తాముగా నిర్ణీత పోర్టల్‌లో కుటుంబ వివరాలను నమోదు చేసుకోవడాన్ని సెల్ఫ్ ఎన్యూమరేషన్ అంటారు. ఇది ఏప్రిల్ 16 నుంచి మే 10 వరకు అందుబాటులో ఉంటుంది.కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం మొత్తం 33 రకాల ప్రశ్నలను ఎన్యూమరేటర్లు అడుగుతారు. ఇవి దేశవ్యాప్తంగా అందరికీ ఒకేలా ఉంటాయి.అవును. మొదటి దశలో ఇంటి పెద్ద కుల వివరాలను, రెండో దశలో కుటుంబ సభ్యులందరి కుల వివరాలను సేకరిస్తారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాలు

హైదరాబాద్,ఏప్రిల్ 12

విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాలు అందించాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే 1 నుంచి 12వ తరగతి విద్యార్థులు పాలు అందిస్తారు.పంపిణీ కోసం రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి(విజయ డెయిరీ)కి మె?దటి విడతగా.. రూ.120 కోట్ల ఆర్డర్ ఇచ్చింది ప్రభుత్వం. వచ్చే విద్యా సంవత్సరం జూన్‌లో పాఠశాలలు తెరిచేనాటి నుంచి పాలు సరఫరా చేయాలని చెప్పింది. వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వం పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాలు అందనున్నాయి. విద్యార్థులకు పాలు పంపిణీ చేయాలని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆ బాధ్యతలు విజయ డెయిరీకి అప్పగించాలని ఆదేశాలు ఇచ్చారు.ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు ఉదయంపూట బ్రేక్ ఫాస్ట్‌తోపాటుగా పాలను అందజేయనున్నారు. విద్యార్థుల్లో రక్తహీనతను తగ్గించడం, వారికి పౌష్టికాహార లోపాన్ని నివారించాలని ప్రభుత్వం అనుకుంటోంది. అందులో భాగంగా ఈ పథకాన్ని తీసుకొస్తుంది. జూన్ నెలలో విద్యాసంస్థలు పున:ప్రారంభం అయ్యే సమయానికి ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని విద్యాశాఖ అనుకుంటోంది. రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులకు ఈ పథకం లబ్ధి చేకూరుస్తుంది.ఈ పథకం అమలులో భాగంగా పాల సరఫరా బాధ్యతను ప్రభుత్వ రంగ సంస్థ అయిన విజయ డెయిరీకి అప్పగించారు. ఇందుకు రూ.120 కోట్ల విలువైన భారీ ఆర్డర్‌ను ప్రభుత్వం కేటాయించింది. పాలు త్వరగా పాడవకుండా ఉండేందుకు, పంపిణీ సులభతరం చేయడానికి 150-200 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లను సిద్ధం చేయనున్నారు.జూన్ వరకు ఈ ప్యాకెట్లను స్కూళ్లకు చేర్చడానికి డెయిరీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనితో విద్యార్థులకు నాణ్యమైన పాలు అందుతాయనే నమ్మకం వ్యక్తం అవుతోంది.విద్యార్థులకు అందించే ఆహారంలో వైవిధ్యాన్ని, పోషక విలువలను సమపాళ్లలో అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక మెనూను రూపొందించింది. ఇందులో భాగంగా.. వారానికి మూడు రోజులు పాలను, మిగిలిన మూడు రోజులపాటు రాగి జావను పంపిణీ చేస్తారు. రాగి జావలో కాల్షియం, ఐరన్ అధికంగా ఉండటం వలన విద్యార్థులకు ఇది ఎక్కువగా ఉపయోగపడుతుంది. మధ్యాహ్నం భోజనం, ఉదయం పూట పౌష్టికాహారంతో విద్యార్థుల ఎదుగుదల బాగుంటుందని ప్రభుత్వం భావిస్తోంది. అంతేకాదు పాఠశాలల్లో హాజరుశాతం పెరగుతుందని అధికారులు చెబుతున్నారు.

# పొంగులేటి ఉక్కిరిబిక్కిరి

హైదరాబాద్, ఖమ్మం ఏఏప్రిల్ 12

తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య అవినీతి అస్త్రాల యుద్ధం పతాక స్థాయికి చేరింది. గత కొన్ని రోజులుగా బీఆర్ఎస్ నేతలు, ముఖ్యంగా హరీష్ రావు, కేటీఆర్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని లక్ష్యంగా చేసుకుని చేస్తున్న ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. అయితే, ఈ ఆరోపణలను తిప్పికొట్టడంలో కాంగ్రెస్ మంత్రుల స్పందన కేవలం డిఫెన్సివ్‌గా మాత్రమే ఉందని, బలమైన కౌంటర్ ఇవ్వడంలో వారు వెనుకబడిపోతున్నారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్ నేతలు వ్యూహాత్మకంగా మంత్రి పొంగులేటిని ముందు పెట్టి ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. ప్రధానంగా నాదర్‌గుల్ భూముల్లో 7,000 కోట్ల కుంభకోణం జరిగిందని, ఇందులో మంత్రి కుటుంబానికి చెందిన సంస్థల ప్రమేయం ఉందని హరీష్ రావు ఆరోపించారు. దీనికి తోడు రాఘవ కన్స్ట్రక్షన్స్ ద్వారా అక్రమ మైనింగ్ సాగిస్తున్నారని, కొండగల్ లిఫ్ట్ ఇరిగేషన్ కాంట్రాక్టుల్లో అక్రమాలు జరిగాయని కేటీఆర్ విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ ఆరోపణలు కేవలం ఒక మంత్రికి పరిమితం కాకుండా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూడా ఈ వివాదాల్లోకి లాగుతూ బీఆర్ఎస్ మైలేజ్ పొందుతోంది.బీఆర్ఎస్ చేస్తున్న నిర్దిష్టమైన ఆరోపణలకు కాంగ్రెస్ మంత్రులు ఇస్తున్న సమాధానాలు చాలా బలహీనంగా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి , ఇతర మంత్రులు ఈ ఆరోపణలను నిరాధారమైనవి అని కొట్టిపారేసినప్పటికీ, ప్రజల్లోకి బలమైన సంకేతం పంపడంలో విఫలమయ్యారన్న అంచనాలు వస్తున్నాయి. గత 10 ఏళ్లలో బీఆర్ఎస్ చేసిన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే ఈ ఆరోపణలు చేస్తున్నారు అనే ఒకే మాటను వారు పదే పదే చెబుతున్నారు. దీనివల్ల ప్రస్తుత ఆరోపణలపై స్పష్టత ఇవ్వడం కంటే, పాత విషయాలను తోడటంపైనే వారు ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు.బీఆర్ఎస్ నాయకత్వం ఒక టీమ్‌గా విరుచుకుపడుతుంటే, కాంగ్రెస్ వైపు నుండి కేవలం పొంగులేటి మాత్రమే సమాధానం చెప్పాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఇతర కీలక మంత్రులు ఈ వివాదాల జోలికి వెళ్లకపోవడం లేదా అరకొరగా స్పందించడం వల్ల ప్రభుత్వం డిఫెన్స్ లో



పడిపోయిందనే భావన కలుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారంలో ఉండటం, ఇక్కడ మంత్రుల మధ్య సరైన సమన్వయం లేకపోవడంతో బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలు ప్రజల మెదళ్లలోకి బలంగా వెళ్తున్నాయి. మైనింగ్ ఆదాయంపై బీఆర్ఎస్ లేవనెత్తిన సాంకేతిక అంశాలకు ప్రభుత్వం నుండి పక్కాగా సమాధానం రావడం లేదు. ఇసుక ధరలు పెరిగాయని, ఆదాయం ఎందుకు తగ్గింది? అనే ప్రశ్నలకు మంత్రులు సమాధానం చెప్పలేక, దానిని చిన్న విషయం గా కొట్టిపారేయడం విమర్శలకు తావిస్తోంది. సీఐడీ విచారణకు ఆదేశించామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, సిట్టింగ్ మినిస్టర్‌పై సీఐడీ విచారణ ఎలా నిష్పక్షపాతంగా జరుగుతుంది అనే ప్రతిపక్షాల ప్రశ్నకు మంత్రుల దగ్గర గట్టి సమాధానం లేదు.రాజకీయంగా బీఆర్ఎస్ ఇప్పుడు అటాకింగ్ మోడ్‌లో ఉంది. కాంగ్రెస్ మంత్రులు కేవలం ఆరోపణలు నిరూపించండి.. నేను రాజీనామా చేస్తా వంటి పాత డైలాగులతో కాకుండా, డేటా, డాక్యుమెంట్లతో కూడిన కౌంటర్ ఇవ్వాల్సిన అవసరం ఉందని భావిస్తున్నారు. లేకపోతే, ఈ అవినీతి ముద్ర ప్రభుత్వ ఇమేజ్‌ను దెబ్బతీసే అవకాశం ఉంది. ముఖ్యంగా పాలనలో పారదర్శకత ఉందని చెప్పుకుంటున్న కాంగ్రెస్, ఇలాంటి ఆరోపణల సమయంలో మరింత వేగంగా ,బలంగా స్పందించకపోతే ప్రజల్లో అనుమానాలు పెరిగే ప్రమాదం ఉందని అనుకోవచ్చు.

# సైబారాబాద్‌లో మరో టవర్

హైదరాబాద్, ఏప్రిల్ 12

సైబరాబాద్ నగరపాలక సంస్థ కోసం కైత్లాపూర్‌లో రూ.200 కోట్లతో కొత్తగా సమీకృత భవన సముదాయాన్ని నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. 5 ఎకరాల విస్తీర్ణంలో జీ+8 అంతస్తులతో సైబర్ టవర్స్ తరహాలో ఇది నిర్మాణం కానుంది. ఒకే భవనంలో మున్సిపల్, జలమండలి, రెవెన్యూ, విద్యుత్ శాఖల కార్యాలయాలు కొలువుదీరనున్నాయి. ప్రజలకు పరిపాలనను మరింత సులభతరం చేసేలా ఈ క్యూఆర్ రీజియన్ అభివృద్ధి ప్రణాళిక రూపుదిద్దుకుంది.హైదరాబాద్ నగరం అనగానే అందరికీ ఠక్కున గుర్తొచ్చేది మాదాపూర్‌లోని సైబర్ టవర్స్. ఐటీ విప్లవానికి చిహ్నంగా నిలిచిన ఆ కట్టడం తరహాలోనే.. ఇప్పుడు అత్యాధునిక హంగులతో మరో భారీ భవన సముదాయం నిర్మాణానికి రంగం సిద్ధమైంది. కొత్తగా ఏర్పాటైన సైబరాబాద్ నగరపాలక సంస్థ కోసం ఈ ఐకానిక్ భవనాన్ని నిర్మించబోతున్నారు. ఐటీ కారిడార్‌లో పాలనను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం ఈ ప్రతిష్టాత్మక నిర్ణయం తీసుకుంది. ఈ నూతన పరిపాలన భవనం కోసం కైత్లాపూర్‌లోని ఐదెకరాల భూమిని అధికారులు ఎంపిక చేశారు. సుమారు రూ.200 కోట్ల అంచనా వ్యయంతో ఈ భవన నిర్మాణానికి ఇంజినీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.ప్రస్తుతం సీఎంసీ కార్యాలయం హైటెక్స్‌లోని న్యాక్ భవనంలో కొనసాగుతుండగా.. కమిషనర్ సృజన ఆధ్వర్యంలో నూతన భవన ఆకృతుల రూపకల్పన వేగంగా జరుగుతోంది. ప్రభుత్వ ఆమోదం పొందిన వెంటనే పనులు ప్రారంభం కానున్నాయి.

ప్రభుత్వం జీహెచ్‌ఎంసీని పునర్వ్యవస్థీకరించి జీహెచ్‌ఎంసీ, సీఎంసీ (సైబరాబాద్), ఎంఎంసీ (మల్కాజిగిరి)లుగా విభజించిన సంగతి తెలిసిందే. సీఎంసీ పరిధిలోకి మణికొండ, నార్సింగి, శేరిలింగంపల్లి నుంచి మేడ్చల్ వరకు 3 జోన్లు, 16 సర్కిళ్లు వచ్చాయి. ఈ భారీ భవనాన్ని 'జీ+8' అంతస్తులతో నిర్మించనున్నారు. కేవలం మున్సిపల్ కార్యాలయం మాత్రమే కాకుండా.. ప్రజలకు అన్ని సేవలు ఒకే చోట అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.ఒకే గొడుగు కింద అన్ని విభాగాలు చేర్చనున్నారు. ఈ సమీకృత భవన సముదాయంలో సీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్, జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయం, విద్యుత్, రెవెన్యూ శాఖల విభాగాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రజలు వివిధ పనుల కోసం వేర్వేరు కార్యాలయాలకు తిరిగే అవసరం లేకుండా.. ఒకే భవనంలో అన్ని ప్రభుత్వ సేవలు లభించేలా ప్రణాళికలు రూపొందించారు. ఐటీ నగరిలో ఈ కొత్త భవనం మరో ప్రధాన ఆకర్షణగా నిలవనుందని సైబరాబాద్ నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నారు. త్వరలోనే అందుకు సంబంధించిన పనులు ప్రారంభం అవుతాయని అంటున్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు: మున్సిపల్ కమిషనర్ రవీందర్

## హోటళ్లు,టిఫిన్ సెంటర్లలో తనిఖీలు. రూ.12 వేల జరిమానా

కోరుట్ల: ఏప్రిల్ 12

పట్టణంలో ప్రభుత్వం నిషేధించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవీందర్ హెచ్చరించారు.కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం మున్సిపల్ అధికారులు పట్టణంలోని పలు రెస్టారెంట్లు,హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో నిషేధిత ప్లాస్టిక్ కవర్లతో పాటు నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన యజమానులకు రూ. 12,000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పర్యావరణానికి ముప్పుగా మారిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని వ్యాపారులు తక్షణమే నిలిపివేయాలన్నారు. ప్లాస్టిక్ బదులు బట్ట సంచులను ప్రోత్సహించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాలతో పాటు దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.అలాగే, ట్రేడ్ లైసెన్స్ గడువు ముగిసిన వారు వెంటనే రెన్యువల్ చేసుకోవాలని ఆదేశించారు. వ్యాపార సంస్థల



నుంచి వెలువడే వ్యర్థాలను తడి,పొడి,హానికరమైన చెత్తగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని కమిషనర్ స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహిస్తే ఎస్ డబ్ల్యు యం -2019 చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్,అశోక్, రికార్డ్ అసిస్టెంట్ జగదీష్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్లు మహేష్, హేమంత్,జవాన్లు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పూలే స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలి: ఎంపి ఈటల

హైదరాబాద్ ఏప్రిల్ 12సైనిక్ పురిలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలలో ఎంపి ఈటల రాజేందర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగ ఈటల మాట్లాడుతూ ఈ దేశం గర్వించే ముద్దుబిడ్డ, ఈ దేశానికే రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్ కి గురువుగా, మార్గదర్శకంగా నిలిచిన మహానీయుడు మహాత్మ జ్యోతిబాపూలే అని అన్నారు.. పూలే 199వ జయంతి ఉత్సవాలు దేశవ్యాప్తంగా జరుపుకోవడం, ఆయన ఆశయాలను మరోసారి నేమరువేసుకొని, ఆయన త్యాగాలకు స్ఫూర్తి పొంది ఈ తరం మాత్రమే కాదు రాబోయే తరాలు కూడా త్యాగమంటే, ప్రజాహితం కోసం పనిచేయడం అంటే ఏంటో ఆయన జీవితమే ఒక ఆదర్శం. పూలే అడుగుజాడల్లో నడిచిన వారి సతీమణి సావిత్రిబా పూలే మొట్టమొదటగా దేశంలో మహిళలకు చదువు ఉంటేనే సమాజం బాగుపడుతుంది అని నమ్మి... ఆనాటి ఉన్మాదానికి వ్యతిరేకంగా, సనాతన పద్ధతులకు వ్యతిరేకంగా పోరాటం చేసి ఆడపిల్లలకు చదువు చెప్పిన మొట్టమొదటి గురువు సావిత్రిబాయి పూలే.

మిలటరీ, స్పేస్, అడ్మినిస్ట్రేషన్, అన్ని రంగాలతో పాటు రాబోతున్న 33% రిజర్వేషన్లలో కూడా సావిత్రిబాపూలే వేసిన పునాది భారతదేశంలోని మహిళ లోకానికి ఎంతో స్ఫూర్తినిచ్చింది. రేపు అసెంబ్లీ, పార్లమెంట్లో కూడా ఈ దేశహితం కోసం జరిగే చట్ట నిర్మాణంలో కూడా మహిళలకు 33% నరేంద్ర మోడీ చేయాలనుకున్న సంకల్పం దానికి పునాది వేసిన మహానాయకురాలు సావిత్రిబాపూలే. 200 ఏళ్ల క్రితం పుట్టిన వీరు భారతదేశానికి వెలుగు, స్ఫూర్తినిచ్చే మహనీయులు కాబట్టి ఆ మహా పురుషులు ఎన్నటికీ మరణించరు... వాళ్ళ ఆశయాలు సజీవంగానే ఉంటాయి. వాళ్ల స్ఫూర్తి ఈ దేశ యువత ఆదర్శంగా తీసుకొని ముందుకి కదలాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నాను. మహాత్మ జ్యోతిబా పూలే, సావిత్రిబా పూలే కు ఘనమైన నివాళులర్పిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో నేరేడ్మెట్ మాజీ కార్పొరేటర్ ఉపేందర్ రెడ్డి, మాల్కాజ్గిరి మాజీ కార్పొరేటర్ శ్రవణ్, వినాయకనగర్ మాజీ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, మౌలాలి మాజీ కార్పొరేటర్ సునీత యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాణిక్ రెడ్డి, గోపు రమణ రెడ్డి, సీనియర్ నాయకులు వి కే మహేష్, మౌలాలి డివిజన్ అధ్యక్షులు శివ, , బుల్లెట్ స్వప్న, , గణేష్ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జగిత్యాల తర్వాత జనంలోకి కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 12

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ త్వరలో మళ్లీ ప్రజాక్షేత్రంలోకి రానున్నట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి గ్రామంలోని మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం లో బీఆర్ఎస్ నేతలు కొప్పుల ఈశ్వర్, ఎల్ రమణ ఆయనతో భేటీ అయ్యారు. అనంత రం ఫామ్‌హౌస్ వద్ద వారు మీడియాతో మాట్లాడారు. ఈనెల 20వ తేదీ లోపే మాజీమంత్రి జీవన్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ సమ క్షంలో బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు తెలిపారు.ఈ మేరకు కేసీఆర్‌ను జీవన్‌రెడ్డి కలిసి వెళ్లినట్లు తెలిపారు. జగిత్యాలలో భారీ బహి రంగ సభలో ఈ చేరికలు జరగనున్నాయని, రాష్ట్రంలో రైతు సమస్యలు, ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తూ ఈ సభను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్లీనరీకి ముందే మరిన్ని చేరికలు ఉంటా యన్నారు. కేసీఆర్‌తో కలిసి పనిచేయడానికి జీవన్‌రెడ్డి ముందుకు వచ్చారని, ఆయనకు పార్టీలో తగిన ప్రాధాన్యత కల్పిస్తామని కేసీఆర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.'అన్నా.. నన్ను దేవుడే పంపిండు మీతో కలిసి పని చేయమని' అని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. -బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తో ఎర్రవెల్లి నివాసంలో మాజీమంత్రి జీవన్‌రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వక భేటీ అయ్యారు. ఎర్రవెల్లి నివా సానికి చేరుకున్న జీవన్‌రెడ్డికి వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు, పార్టీ ముఖ్య నేతలు పుష్పగుచ్ఛాలందించి సాదరంగా ఆహ్వానించారు.కేసీఆర్‌తో కలిసిన సంద ర్భంలో జీవన్‌రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. నిరంతరం తన నియోజకవర్గం, జిల్లా ప్రజలు, రైతుల గురించి ఆలోచన చేసే రైతు నాయకుడు, తెలంగాణ తనానినికి దర్పణంగా నిలిచే మాజీ మంత్రి జీవన్ రెడ్డి., తెలంగాణ సాధకుడు, రైతు బాంధవుడు బీఆర్ఎస్ అధినేత కెసీఆర్ కలయిక సందర్భంగా భావోద్వేగ వాతావరణం నెలకొంది... 'తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన అవ సరమున్నదని, మీతో కలిసి పనిచేయమని దేవుడే నన్ను మీదగ్గరికి పంపించిండు.. అన్నా. చాలా గ్యాప్ తర్వాత ఇన్నాళ్లకైనా మీతో కలిసిపనిచేసే అవకాశం రావడం సంతోషంగా వుంది అన్నా..' అంటూ తన మనసులోని మాటను భావోద్వేగంతో వ్యక్తం చేశారు. జీవన్‌రెడ్డిని అప్యాయంగా దగ్గరికి తీసుకున్న కేసీఆర్ హృద యపూర్వకంగా ఆలింగనం చేసుకొని, దుశ్శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించారు. కాసేపు ఇష్టాగోష్టి తర్వాత జీవన్‌రెడ్డి బృందాన్ని లంచ్‌కు కేసీఆర్ ఆహ్వానించారు. ప్రస్తుతం పీసీసీ అనేది కేవలం సీఎం ఆదేశాలను అమలుచేసే ఒక విభాగంగా మారిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'పీసీసీ చేసే తప్పులకు చివరకు ఏఐసీసీని నిందించడం సరికాదని హితవు పలికారు. పార్టీ మాత్రమే కాదు, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇప్పుడు తిరోగమనంలో పయనిస్తోందని విశ్లేషించారు. అధికార పార్టీ నుంచి ప్రతిపక్షంలోకి ఎం దుకు వెళ్తున్నానో మీకే తెలియాలంటూ కాంగ్రెస్ నేతలకు చురకలు అంటించారు.మొదటి సంవత్సరం 2 లక్షల ఉద్యోగాలు అని అన్నారు.. రెండో సంవత్సరం 1 లక్ష ఉద్యోగాలు అని అన్నారు, ఏమైంది? అని ప్రభు త్వాన్ని నిలదీశారు. పదవుల కోసమే బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లాలంటే తాను ఆరోజే వెళ్ళేవాడినని, కాంగ్రెస్ పార్టీ



ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చనందుకు, ప్రజల పక్షాన పోరాడేందుకు తాను బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లేందుకు నిర్ణయించుకున్నానని జీవన్‌రెడ్డి తెలిపారు.త్వరలోనే జగిత్యాలలో భారీ బహిరంగ సభ పెట్టి కేసీఆర్ సమక్షంలో తాను బీఆర్ఎస్‌లో చేరుతానని జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. దాదాపు 5 గంటలపాటు కేసీఆర్‌తో జీవన్‌రెడ్డి చర్చించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డికి పార్టీలో సముచిత ప్రాధాన్యం ఇస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. జగిత్యాలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా రావాలని జీవన్‌రెడ్డి ఆహ్వానించగా గులాబీ అధినేత సానుకూలంగా స్పందించారని సమాచారం.

# సింగర్ మంగ్లీపై కేసు నమోదు

హైదరాబాద్ ఏప్రిల్ 12

సింగర్ మంగ్లీ పై పంజాగుట్ట పీఎస్ లో కేసు నమోదయింది. న్యాయవాది సుబ్బారావు తనను ఆక్సిడెంట్ చేసి చంపిస్తానని మంగ్లీ మనుషులు బెదిరించినట్లుగా పిర్యాదు చేసారు. తన దగ్గర రూ.10 కోట్లు తీసుకుని మోసం చేసిందని, అడిగితే శవం కూడా దొరకకుండా చేస్తానని మంగ్లీ బెదిరించిందని పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసారు.

దాదాపు 150 మందిని మోసం చేశారని, డైరెక్టర్ వేణు ఉడుగుల, మంగ్లీ సోదరుడు కూడా ఈ కుట్రలో భాగమని ఆరోపించాడు. తనకు ప్రాణ హాని ఉందని బాధితుడు ఫిర్యాదు చేయడంతో, బీఎన్ఎస్ 351(2), 352 సెక్షన్ల ప్రకారం మంగ్లీ, వేణు ఉడుగుల, మంగ్లీ సోదరుడిపై పోలీసులు కేసు నమోదు చేసారు.

# సిగాచి ప్రమాదానికి భాద్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి

## -నవభారత్ నిర్మాన్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టుశ్రీధర్

పటాన్ చెరువు, ఏప్రిల్12 (భారత శక్తి న్యూస్):



సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్ యాజమాన్యం సంబంధిత అధికారుల ఘోర నిర్లక్ష్యం వల్ల అమాయక కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ తీవ్రంగా ఆరోపించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన పటాన్చెరు పట్టణంలో

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిని కలిసి, 2018 నుండి 2024 వరకు జరిగిన తనిఖీ నివేదికల ఆధారంగా సమగ్ర వివరాలతో కూడిన ఫిర్యాదును సమర్పించారు.

ఈ సందర్భంగా మెట్టు శ్రీధర్ మాట్లాడుతూ,సిగాచి ఇండస్ట్రీస్ గత ఏడేళ్లుగా ఫ్యాక్టరీ చట్టాలను నిర్లక్ష్యంగా ఉల్లంఘిస్తూ వస్తోందని పలు ఆధారాలతో వివరించారు. ముఖ్యంగా 2018-19లో అనుమతించిన 100 మంది కార్మికుల పరిమితిని మించి నియామకాలు జరిపినట్టు, 2022లో 818 హెచ్ పి లైసెన్స్ పరిమితి ఉండగా 1777 హెచ్ పి గల యంత్రాలను అనుమతి లేకుండా ఏర్పాటు చేసి ప్రమాదాలకు కారణమయ్యారని వెల్లడించారు.

అలాగే 2019, 2021, 2023 సంవత్సరాల తనిఖీలలో యంత్రాలకు భద్రతా గార్డులు లేవని స్పష్టంగా గుర్తించినప్పటికీ యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ప్రమాదకర రసాయనాలు ఉపయోగించే ఫ్యాక్టరీలో హాజర్డ్ అనాలిసిస్ నివేదికలు లేకపోవడం అత్యంత ఆందోళనకరమని అన్నారు. ప్రతి ఏడాది తనిఖీల్లో లోపాలు బయటపడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇటువంటి విషాద ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

కార్మికుల మరణాలకు బాధ్యులై సిగాచి ఇండస్ట్రీస్ యాజమాన్యంతో పాటు విధి నిర్వహణలో విఫలమైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు పూర్తిస్థాయి నష్టపరిహారం చెల్లించాలని

అమాయక కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న సంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టడి చేయాలని మెట్టు శ్రీధర్ డిమాండ్ చేశారు.

# సంగారెడ్డి బైపాస్ రోడ్ లో 5 చోట్ల జంక్షన్ లు ఏర్పాటు : టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 12 :



సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్ విస్తరణ పనులు వేగవంతం అవుతున్నాయి. రూ.13 కోట్లతో చేపడుతున్న ఈ బై పాస్ రోడ్ లో ఐదు చోట్ల జంక్షన్ లు ఏర్పాటు చేయాలని హెచ్ఎండిఏ అధికారులకు జగ్గారెడ్డి సూచించారు. ఈ నేపథ్యంలో ఐబి గెస్ట్ హౌస్ మొదలుకుని బసవేశ్వర చౌక్ వరకు ఐదు చోట్ల జంక్షన్ లు ఏర్పాటు కానున్నాయి. హెచ్ఎండిఏ అధికారులతో కలిసి జంక్షన్ లు ఏర్పాటయ్యే ఐబి చౌరస్తా, ఆర్డీవో క్యాంప్ ఆఫీస్, చౌరస్తా ను పరిశీలించారు. జంక్షన్ లు ఏవిధంగా ఏర్పాటు చేయాలి, జంక్షన్ల లో సుందరీకరణ పనులు చేయాలని,జంక్షన్ లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని అధికారులకు జగ్గారెడ్డి సూచించారు. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా జంక్షన్ ల డిజైన్ లు ఉండాలని కన్సల్టెన్సీ ప్రతినిధుల ను ఆదేశించారు. జంక్షన్ లు ఏర్పాటు విషయం లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ కు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలని, సాధ్యమైనంత త్వరలో పనులు పూర్తి కావాలని అధికారులకు జగ్గారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్ , ఇంజనీర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యాలే విజయానికి తొలి అడుగు : కలెక్టర్ పి.ప్రావీణ్య

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 12:

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. పఠాన్ చెర్వు మండలం ముత్తంగిలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ తర్వాత ఉండే పోటీ పరీక్షలకు ఇప్పటి నుంచే సిద్ధమవ్వాలని సూచించారు. విద్యార్థి జీవితంలో 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు అత్యంత కీలక దశగా పేర్కొన్నారు. ఈ సమయంలో కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు. ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకుని అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ అందిస్తున్నదని చెప్పారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రతిష్టాత్మక కళాశాలల్లో సీట్లు సాధించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. జీవితంలో ఎదురయ్యే అవాంతరాలను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని, కష్టపడే వారికి విజయమే ప్రతిఫలమని కలెక్టర్ పేర్కొన్నారు. చదువుతో పాటు ఆత్మవిశ్వాసం, పట్టుదల, క్రమశిక్షణ కూడా ఎంతో అవసరమని ఆమె వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని తరగతి గదులు, స్టోర్ రూమ్, వంటగదిని పరిశీలించారు. నూతనంగా ఏర్పాటు చేసినచపాతీ మేకింగ్ మిషన్‌ను ప్రారంభించారు.



ఈ సందర్భనలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కామధేను ఫౌండేషన్ ప్రతినిధులు , తదితరులు పాల్గొన్నారు .

# కన్నుల పండుగగా వేణుగోపాల స్వామి కళ్యాణం



రేగొండ, ఏప్రిల్ 12(భారత శక్తి) పరభావవ సంవత్సరం చైత్ర సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ గడిపల్లిల వేణుగోపాల స్వామి దేవాలయంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కళ్యాణం కన్నుల పండవగా కొనసాగింది. ఆలయ ఆవరణంలో కళ్యాణం మండపాన్ని నిర్వాహకులు శోభాయమనంగా అలంకరించారు. ముందుగా దేవతమూర్తులను శుద్ధ జలం పంచామృతంతో అభిషేకం చేశారు. మంగళ వాయిద్యాల నడుమ అర్చకులు సురేష్ నరేష్ బీద మంత్రోచ్ఛరాణలు , కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. దేవాలయం ప్రధాన కార్యదర్శి నామాల రమేష్ రజిత దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు తలంబ్రాలు సమర్పించగా ఆలయ అభివృద్ధి దాత ఏడునుతుల సులోచనమ్మ గారు పాల్గొన్నారు. వేడుకకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ దేవస్థాన అభివృద్ధి కృషి చేస్తానన్నారు. వేడుకలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు ఏడునుతుల నిషిధర్ రెడ్డి,గ్రామ పెద్దలు మోడెమ్ ఉమేష్ గౌడ్,కాంగ్రెస్ నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి,ఆలయ కమిటీ చైర్మెన్ జిట్ట రామకృష్ణ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గంగుల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి నామాల రమేష్ కార్యదర్శి ముస్కే రమేష్, కోశాధికారి గోగుల అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులతో కలిసి అల్పాహారం తిన్న కలెక్టర్ గరిమ అగ్రవాల్.

## కేజీబీవీలో ఆకస్మిక తనిఖీ..



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 12 (భారత శక్తి): సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం విద్యార్థులకు అల్పాహారం వడ్డించే సమయంలో పాఠశాలకు చేరుకున్న కలెక్టర్, తొలుత మెనూ చార్టును క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం నేరుగా డైనింగ్ హాలులోకి వెళ్లి, స్వయంగా ప్లేట్ తీసుకుని విద్యార్థుల సరసన కూర్చుని వారితో కలిసి టిఫిన్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటిస్తూ, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతుందా లేదా అని ఆరా తీశారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థుల సన్నద్ధతపై కలెక్టర్ ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ఎలా చదవాలి, ప్రణాళికాబద్ధంగా ఎలా ముందుకు సాగాలి అనే అంశాలపై వారికి విలువైన సూచనలు చేశారు. బాగా చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలని విద్యార్థులను కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు.

# చట్టసభలో మహిళ అడుగు,మానవాభివృద్ధికి ముందడుగు

జనాభాలో సగం
ఆకాశంలో సగం
అని మహిళల పట్ల
నినాదాలు హోరు
జోరు పెరిగిందే గాని
పురుషులతో పాటు
సమాన అభివృద్ధిలో
మహిళా లోకం
వెనుకబడి ఉంది

మహిళా సంక్షేమం పట్ల
రాజకీయ పార్టీల మాటలు
కోటలు దాటుతున్నాయి

రాజకీయాధికారానికి
మహిళలను అంటరాని
వారిగా చూసే పార్టీల
దంద్వ వైఖరి
మహిళలకు శాపంగా
పరిణమించింది

రాజకీయ అధికారంలో స్త్రీలకు
సమాన వాటా ఇవ్వడంకోసం
మహిళా రిజర్వేషన్స్ చట్టంతో
పరిపాలనకు న్యాయబద్ధత
చేకూరుతుంది విధాన రచనలో
ప్రజాహిత కార్యక్రమాల అమలులో
నాణ్యత పెరుగుతుంది

78 సం" రాల స్వతంత్ర భారత్లో
కొన్ని రాజకీయ కుటుంబాలకు
సంపన్న వర్గాలకే నాయకత్వ
అవకాశాలు పరిమితమైనవి

అలాకాకుండా విభిన్న నేపద్యానికి
చెందిన సమర్థులకు బాధ్యతా
యుతమైన స్థానంలోకి
ఎదిగివచ్చేందుకు వీలు కల్పించాలి
అందుకు రిజర్వేషన్స్ ద్వారా
మహిళా సాధికార సాధనకు
కట్టుబడి ఉన్నట్లు ప్రకటించే
పార్టీలు ప్రజాస్వామ్య స్ఫూర్తితో
మహిళా రిజర్వేషన్స్ బిల్లును
ప్రజాస్వామిక స్ఫూర్తితో
వ్యవహరించి మహిళా
సాధికారత పట్ల చిత్తశుద్ధిని
ప్రకటించాలి

ఇల్లు చక్కదిద్దే చేతులు
నేడు దేశాన్ని తీర్చి దిద్దాలి
కుటుంబ భారం మోసే చేతులు
నేడు చట్టాలు చేయాలి

మహిళలు చట్టసభల గడప
దాటాలి అవకాశాల బాటలో
నడవాలి
మహిళా రిజర్వేషన్స్ అనేది
కేవలం సీటు కాదు
ఆత్మగౌరవానికి దక్కిన
అధికార పీఠం

మహిళలు చట్టసభలకు చేరితే
వివక్ష సంకెళ్లు తెగిపోతాయి

న్యాయం గొంతుక నినదిస్తుంది
అభివృద్ధి ఊపిరి పోసుకుంటుంది

ఆడపిల్లల చదువుకు ఆటంకం
ఉండదు. మహిళలకు సత్వర
న్యాయం సిద్ధిస్తుంది
మహిళ రక్షణకు భయం ఉండదు.
సుస్థిర నిర్ణయాలు జరుగుతాయి
అవినీతి రహిత సమాజం
ఏర్పడుతుంది
ప్రజాస్వామ్యాన్ని పరిహాసం
పాలు చేస్తున్న పురుషాధిక్య
సంస్కృతి రూపుమాసి ప్రజా
పనులు త్వరిత గతిన
పూర్తి అవుతాయి.
ఓర్పుసానుభూతితో నిర్ణయాలు
తీసుకునే మహిళల సహజ శక్తి
సామర్థ్యాలు సమాజ అభివృద్ధికి
చోదక శక్తి లవుతాయని
పలు అధ్యయనాలు
చాటుతున్నాయి.

మహిళా రిజర్వేషన్స్ వల్ల
ప్రగతి పురోగతి సమాజ
హితం జరిగి భావితరాలకు
భాగ్యోదయం సిద్ధిస్తుంది

చట్టసభల్లో మహిళలరిజర్వేషన్స్
మహిళా రక్షణ విద్యా వైద్య
సంక్షేమ మెరుగైనచట్టాలు చేస్తారు

మహిళా ప్రాతినిధ్యం పెరగడం
వల్ల ప్రజాస్వామ్యం మరింత
బలపడుతుంది
లింగ వివక్ష తగ్గి మహిళలు
స్వంత నిర్ణయాలుతీసుకునే
శక్తి పొందుతారు

చట్టసభల్లో రిజర్వేషన్స్ తో
మహిళా కోటలో సీటుతో పాటు
సీటు వెనుక ఉన్నఅధికారం
రావాలి
భర్త / తండ్రి చెప్పినట్లు ఆడే
బొమ్మల కాకుండ
తన గొంతు తనే వినిపించే
బాధ్యత పెరగాలి

వారసత్వ రాజకీయాల
వెలుగులో కాకుండా
సామాన్య మహిళలకు
సభలో చోటు దక్కాలి

రాజకీయ చైతన్యం ప్రతి
గడపకు చేరాలి ముసుగులో
ఉన్న నాయకత్వం
బయటకు రావాలి

మహిళా రిజర్వేషన్లుఅంటే
కేవలం అవకాశం కాదు
అది ఒక సామాజిక విప్లవం
కావాలి

సమస్యల సుడిగుండంలో
ఉన్న మహిళలకు చట్టసభలే
ధైర్యాన్నిచ్చే వేదికలు కావాలి

నిదులకేటాయింపులో వాటా
ఉండాలి నిర్ణయాలు
తీసుకోవడంలో మహిళలకు
అధికారం ఉండాలి జనాభాలో
సగభాగం సగం అవకాశం అన్న
మాటకు అర్థం ఉన్న మహిళలు
పాలనలో కూడా సగభాగమై
వర్ధిల్లాలి

అక్షరాలే ఆయుధాలుగా
ఆత్మవిశ్వాసమే కవచం కావాలి
అప్పుడే మహిళాసంక్షేమం
సంపూర్ణం భారత ప్రజాస్వామ్యం
పరిపూర్ణం

మహిళా ప్రతినిధులు
కుటుంబ సభ్యుల భర్త /తండ్రి
నీడలో కాకుండా
స్వయంగా నిర్ణయాలు
తీసుకోవాలి

రాజకీయ నేపథ్యమున్న
మహిళలకు కాకుండా
సామాన్య మహిళలకు
అవకాశం అందాలి
పదవితో పాటు బడ్జెట్ పై
పాలనపై అవగాహన
నియంత్రణ ఉండాలి

అట్టడుగున ఉన్న అబలలకు
అధికారం దక్కాలి
రిజర్వేషన్స్ ఫలితాలు కొందరికి
పరిమితమైతే సామాజిక
న్యాయం అన్న మాటకు అర్థం?

కులానికి ఓ కోటా
గొడుగు కింద నీడలా
బీసీ ఉప కులాల కోట
ఉండాలి
అదే వారికి రక్షణ కవచం
రక్షణ కవచం లాగా ఉన్న
వారసత్వ రాజకీయాల
గోడలు బద్దలు కావాలి.

శ్రమజీవుల ఆడబిడ్డలు
చట్టసభల్లో అడుగుపెట్టాలి
జనాభా లెక్కల ప్రాతిపదికన
వాటా తేలాలి రావాలి మార్పు
కులగణన సాగాలి ఎవరి
వాటాఎంతో లెక్కలు తేల్చాలి

పాలనలో బహుజన మహిళా
ప్రాతినిధ్యం పెరగాలి
కోటా లో ఉపకోటా చేర్చినపుడే
మహిళా రిజర్వేషన్స్ పరిపూర్ణం
అప్పుడే ప్రజాస్వామ్యం సంపూర్ణం ఘోరం

మహిళలకు చట్టసభ
టికెట్ల కేటాయింపులో
పంపిణీలో సామాజిక
న్యాయ జరగాలి
ప్రజాస్వామ్యం వెలగాలి

ఒకరికి చేతిలో అధికారం
ఇంకొకరి చేతిలో ఆశలు వద్దు
అందరికి సమాన గౌరవం
సగభాగం వాటా ముద్దు
అపుడే మహిళా రిజర్వేషన్స్
ఒక చారిత్రిక విజయం
అపుడే వికసిత్ భారత్ లక్ష్య
సాకారం కావాలంటే
జనాభాలో సగభాగం ఉన్న
మహిళలు పాలన నిర్ణయాల్లో
క్రియాశీలక పాత్ర పోషించాలి
మహిళా రిజర్వేషన్స్ చట్టం
వస్తే సరిపోదు చైతన్యం రావాలి
సామాజిక వర్గాల్లో మార్పు
రావాలి

రిజర్వేషన్స్ ఫలాలు కేవలం
పైన ఉన్నవారికే కాదు
బహుజన గుమ్మం వరకు చేరాలి

బీసీ ఉప కోటా కోట్లాదిమంది
మహిళా రాజకీయ ఉనికికి
నిదర్శనం
రిజర్వేషన్స్ తరతరాల
అణిచివేతకు ముగింపు పలకాలి
అణగారిన వర్గాల ఆత్మగౌరవ
జెండా ఎగరాలి

మహిళలు అలంకార ప్రాయం
కాదు
చట్టాలు శాసించే చైతన్య
కిరణాలు కావాలి

బీసీ ఉప కోటా ఆది సంఖ్య కాదు
సకల జనుల సార్వభౌమత్వానికి
దారి దీపం కావాలి

జనాభాకు తగ్గట్లు పాలనలో
మహిళలను భాగస్వాములను
చేసి దేశాన్ని పీడిస్తున్న పలు
వ్యవస్థాగత సామాజిక సమస్యల
పరిష్కారానికి ఉద్యమిద్దాం

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు,తెలంగాణ ఎకనామిక్

# ఇంటర్ ఫలితాల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ..

## -శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 6 120,(భారత శక్తి): ఆదివారం విడుదలైన ఇంటర్ పరీక్ష ఫలితాలలో జిల్లా విద్యార్థులు ఘనమైన ప్రతిభ కనబరిచారని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాలలో, నిర్మల్ జిల్లా, 62.93 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్ర స్థాయిలో 12 వ ర్యాంక్, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 73.43 శాతం ఉత్తీర్ణతో 13 వ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం పై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఈ సందర్భంగా ఆమె శుభాకాంక్షలు తెలిపారు. మున్ముందు పై తరగతుల్లో మరింత కష్టపడి చదివి, ఉన్నతంగా నిలవాలని ఆకాంక్షించారు. అనుత్తీర్ణులు అయిన విద్యార్థులు బాధపడకూడదని, మరింత కష్టపడి చదివి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా కృషిచేసిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. రానున్న రోజుల్లో మరింత మంచి ఫలితాలు సాధించి జిల్లాను రాష్ట్రస్థాయిలో మంచి స్థానంలో నిలపాలని అప్రకటన ద్వారా తెలిపారు.

# రేణుక చౌదరి పర్యటనను జయప్రదం చేయండి.

మణుగూరు ఏప్రిల్ 12(భారతశక్తి): మాజీ కేంద్రమంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ ఈ నెల 13న భద్రాచలం, మణుగూరు పర్యటనకు విచ్చేయుచున్న సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు గురిజాల గోపి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో కలిసిన ఐదు గ్రామ పంచాయితీలను తెలంగాణ లో విలీనం చేయాలని, ప్రజా సమస్యలపై తన గొంతుక వినిపించేందుకు విచ్చేయుచున్న ఖమ్మం ముద్దు బిడ్డ మాజీ కేంద్రమంత్రి రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి, ఎంపీ బలరాం నాయక్ పర్యటనను విజయవంతం చేయాలని గురిజాల గోపి కోరారు.



# ఘనంగా జిల్లా కేంద్రంలో మహాత్మ జ్యోతిబాపూలే 200 జయంతి వేడుకలు



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఏప్రిల్ 12: జిల్లా కేంద్రంలో మహాత్మ జ్యోతిబా పూలే 200వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఆవరణలో వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, అదనపు కలెక్టర్ విక్టర్ పాల్గొన్నారు.

వారు మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ఏప్రిల్ 11న పూలే జయంతిని ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మహాత్మ జ్యోతిరావు పూలే ఒక గొప్ప సామాజిక సంస్కర్తగా నిలిచారని, సమానత్వం కోసం ఆయన చేసిన కృషి అపారమని పేర్కొన్నారు. బాలికల విద్యకు ప్రాధాన్యత ఇచ్చిన తొలి సంస్కర్తల్లో ఆయన ఒకరని, కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతూ సమాజంలో సమానత్వం, విద్యా విస్తరణకు చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.

అలాగే, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, మున్సిపల్ చైర్మన్ ఉమారాణి, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక విప్లవకారుడు,తత్వవేత్త,ఆధునిక యుగ వైతాళికుడు..మహాత్మా జ్యోతిరావు పూలే

## విక్కుర్తి లక్ష్మీనారాయణ ప్రధానోపాధ్యాయుడు

వేములవాడ (ఏప్రిల్ 12

భారతదేశ ఆధునిక యుగ వైతాళికుడు,దేశ ప్రప్రథమ సామాజిక తత్వవేత్త,గాంధీ కంటే ముందే మహాత్ముడిగా జన నీరాజనాలందుకున్న విశిష్ట మూర్తి మహాత్మా జ్యోతిబాపూలే 199వ జయంతి సందర్భంగా ప్రాథమిక పాఠశాల న్యూ అర్బన్ కాలనీ వేములవాడలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ “మహాత్మ జ్యోతిరావు పూలే 19 వ శతాబ్దపు గొప్ప భారతీయ సంఘసంస్కర్త,విద్యావేత్త మరియు సామాజిక విప్లవకారుడని,కుల వివక్ష నిర్మూలన,స్త్రీ విద్య మరియు అణగారిన వర్గాల హక్కుల కోసం పూలే పోరాడాడని,1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలోని సతారా జిల్లాలో ఒక మాలి (పూల వ్యాపార )కుల కుటుంబంలో జన్మించాడని,పూణేలోని మిషన్ పాఠశాలలో చదువుకున్నాడని,అంటరానితనం,కుల వ్యవస్థ మరియు మహిళలపై జరుగుతున్న అణచివేతకు వ్యతిరేకంగా పూలే దంపతులు జీవితాంతం పోరాడారని,1848లో పూణేలో నిమ్న కులాల బాలికల కోసం మొదటి పాఠశాలను స్థాపించారని,1848 నుండి 1888 మధ్య తన భార్య సావిత్రిబాయి తో కలిసి మొత్తం 52 పాఠశాలలను స్థాపించారని,1873లో కులవ్యవస్థ నిర్మూలన మరియు అణగారిన వర్గాల సాధికారత కోసం ‘సత్యశోధక్ సమాజ్’ (సత్యశోధకుల సమాజం)ను స్థాపించారని,గులాం గిరి ( బానిసత్వం) వంటి పుస్తకాల ద్వారా సమాజంలోని కుల వ్యవస్థ పై తీవ్ర విమర్శలు చేశారని,సామాజిక సంస్కరణలకు ఆయన




చేసిన కృషికి గాను 1888లో ఆయనకు మహాత్మా (గొప్ప ఆత్మ) అనే బిరుదు లభించిందని,1890 నవంబర్ 28న పూణేలు మరణించారని,జ్యోతిరావు పూలే భారత సమాజంలో ముఖ్యంగా అణగారిన వర్గాలలో చైతన్యాన్ని తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారని,పూలే దంపతులు మహిళల విద్యకు మార్గదర్శకులుగా నిలిచారని,పూలే నిమ్న కులాల ప్రజల హక్కుల కోసం,వితంతు పునర్వివాహాల కోసం,స్త్రీల విద్యాభివృద్ధి కోసం తన జీవితాంతం కృషి చేసిన గొప్ప మానవతావాది” అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ,దాసరి సుజాత,అంగన్వాడి ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల,ఈడుగు లక్ష్మి,యదులపురం స్వప్న మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# యు ఐ ఎం ఓ లో బీరం విద్యార్థుల ప్రతిభ

## ఆల్ ఇండియా స్థాయిలో గోల్డ్ మెడల్స్, నగదు బహుమతులు

కడప ఏప్రిల్ 12యునైటెడ్ ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్ (యు ఐ ఎం ఓ) పరీక్షలో బీరం విద్యాసంస్థల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో గొప్ప విజయాన్ని సాధించారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రతిష్ఠాత్మక పరీక్షలో బీరం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపించి గోల్డ్ మెడల్స్, నగదు బహుమతులు మరియు సర్టిఫికెట్లు సాధించి పాఠశాలకు గౌరవాన్ని తెచ్చిపెట్టారు.ఈ పరీక్షలో విద్యార్థి బీరం స్వశ్రీత్ రెడ్డి ఆల్ ఇండియా స్థాయిలో 9వ ర్యాంక్ సాధించి ప్రత్యేక గుర్తింపు పొందాడు. అతను గోల్డ్ మెడల్, నగదు బహుమతి మరియు ఆన్లైన్ శిక్షణ తరగతులకు అర్హత సాధించి ప్రతిభను చాటుకున్నాడు.అదేవిధంగా ఏ. మహేష్ నాయుడు, ఆర్. రాజేష్, పి. నరసింహారెడ్డి విద్యార్థులు గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్లు మరియు ఆన్లైన్ క్లాసులకు అర్హత సాధించి తమ ప్రతిభను నిరూపించారు.మరియు పి. మొహమ్మద్ నౌమన్, ఏ.వి. భువనేశ్వర్, జి. వంశీధర్ యాదవ్, శాంసన్ క్రిస్టియాని, ఎం. కేతన్ నాయుడు, జి. జాశ్రీతారెడ్డి, ఎం. శ్రీజ నని, ఎన్. జితేష్,



పి. ఆఫియా సుల్తానా, పి. తన్విత రెడ్డి, పి. వాణిశ్రీ చెన్న వంటి విద్యార్థులు గోల్డ్ మెడల్స్ మరియు సర్టిఫికెట్లు సాధించి ఆల్ ఇండియా స్థాయిలో విశిష్ట ర్యాంకులు సాధించారు.ఈ విజయంతో బీరం విద్యాసంస్థల ప్రతిష్ఠ మరింత పెరిగింది. విద్యార్థుల ఈ అద్భుత విజయాన్ని పురస్కరించుకొని విద్యాసంస్థల అధినేత బీరం సుబ్బారెడ్డి, చైర్ పర్సన్ సరస్వతమ్మ, డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, పాఠశాల ప్రిన్సిపల్ శ్వేత, కళాశాల ప్రిన్సిపాల్ హేమచంద్ర గార్లు విద్యార్థులను హృదయపూర్వకంగా అభినందించారు. అలాగే ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల వల్ల ఈ విజయం సాధ్యమైంద?



# మత్తు పదార్థాల నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం

## డి-అడిక్షన్ సెంటర్ సందర్శించిన ఎస్పీ, ఎమ్మెల్యే

జగిత్యాల: ఏప్రిల్ 11

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో మత్తు పదార్థాల వినియోగాన్ని నిర్మూలించేందుకు, వ్యసనానికి గురైన వ్యక్తులను తిరిగి సాధారణ జీవన విధానంలోకి తీసుకురావడానికి హెల్త్ మరియు పోలీస్ శాఖలు సంయుక్తంగా చేపడుతున్న కార్యక్రమాలలో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఈరోజు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న డి-అడిక్షన్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ సమస్య ఒక పెద్ద సవాలుగా మారిందని, దీన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా ఈగల్ టీం ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బృందం ద్వారా డ్రగ్స్ నియంత్రణ, అవగాహన కార్యక్రమాలు, పర్యవేక్షణ చర్యలు మరింత బలోపేతం చేయబడుతున్నాయని వివరించారు.మత్తు పదార్థాల వినియోగం వలన ఆరోగ్య సమస్యలు మాత్రమే కాకుండా కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, నేరాలకు దారితీసే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఎస్పీ పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలన అనేది కేవలం లా అండ్ ఆర్డర్ సమస్య మాత్రమే కాకుండా ఇది ఒక సామాజిక సమస్య, ప్రజా ఆరోగ్య సమస్య కూడా అని స్పష్టం చేశారు. కావున దీన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించాలంటే అన్ని వర్గాల ప్రజలు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.ముఖ్యంగా యువత ఈ వ్యసనాలకు గురికాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలు వ్యక్తి జీవితాన్ని పూర్తిగా దెబ్బతీసే ప్రమాదకరమైన అలవాటు అని పేర్కొంటూ, డి-అడిక్షన్ సెంటర్ అనేది వ్యసనానికి గురైన వారికి ఒక రెండవ అవకాశమని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు.అదేవిధంగా జిల్లాలో మత్తు పదార్థాల సరఫరా, రవాణా, విక్రయాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని, ఎవరైనా ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు ఎక్కడైనా మత్తు పదార్థాల వినియోగం లేదా విక్రయాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత దేశానికి అతి పెద్ద సంపద అని, యువత సన్మార్గంలో నడవడం చాలా అవసరమని పేర్కొన్నారు.ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా మంచి మార్గంలో నడుచుకుంటూ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు.జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు ప్రత్యేక వార్డులను డి-అడిక్షన్ సెంటర్‌గా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సెంటర్‌లో ఎంత సీరియస్ కేసులైనా సమర్థవంతంగా చికిత్స అందించే నిపుణ వైద్యులు అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. చికిత్సతో పాటు అవసరమైన మందులు, సేవలు ప్రభుత్వం తరఫున ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.యువత బాగుంటేనే దేశం బాగుంటుందని, అందువల్ల యువత మత్తు పదార్థాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పాఠశాల, కళాశాలలో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేసి డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మత్తు పదార్థాల నిర్మూలన మరియు వాటి వల్ల కలిగే దుష్పరిణామాలపై నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎస్పీ, ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు, సర్టిఫికెట్లు ప్రధానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో వైద్యులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యసన బాధితులకు సమగ్ర చికిత్స, పునరావాస సేవలు అందించడమే లక్ష్యం

## డి అడిక్షన్ కౌన్సిలింగ్ సెంటర్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అంకిత్

భద్రాద్రి

కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డి అడిక్షన్ కౌన్సిలింగ్ సెంటర్‌ను శనివారం జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. వ్యసన బాధితులకు సమగ్ర చికిత్స, పునరావాస సేవలు అందించేందుకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం అదే ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ కేంద్రాన్ని కూడా కలెక్టర్ ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా మత్తు వ్యసనానికి గురైన వారికి ప్రత్యేక వైద్య చికిత్సలు, నిపుణుల పర్యవేక్షణలో పునరావాస సేవలు, నిరంతర కౌన్సిలింగ్ అందించబడతాయని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మద్యానికి బానిసై చికిత్స కోసం వచ్చిన రోగితో మాట్లాడి, రోజువారీ ఆదాయం, మద్యంపై ఖర్చు వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ వ్యక్తి తాను మద్యం మానేందుకు పలు మార్లు ప్రయత్నించినప్పటికీ, వణుకుడు, ఫిట్స్ వంటి సమస్యలు రావడంతో చికిత్స కోసం ఈ కేంద్రానికి వచ్చానని తెలిపాడు. ఈ తరహా కేసులకు అందిస్తున్న వైద్య సేవలు, కౌన్సిలింగ్ విధానాలు, చికిత్స ప్రక్రియ గురించి కలెక్టర్ అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులు పూర్తిగా కోలుకునేలా సమగ్ర చికిత్సతో పాటు నిరంతర కౌన్సిలింగ్ అందించాలని వైద్యులకు సూచించారు. ఇదే సందర్భంగా “డ్రగ్స్ కంట్రోల్ అండ్ రెగ్యులేటరీ స్ట్రెంగ్తెనింగ్ డే” కార్యక్రమం కింద నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి కలెక్టర్ ప్రశంస పత్రాలు, శిల్డులను అందజేశారు. యువతలో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. మత్తు వ్యసన నిర్మూలనలో ప్రభుత్వ శాఖలు, వైద్య విభాగం, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యులు బాధితులను ప్రోత్సహించి, ఈ కేంద్రం సేవలను వినియోగించుకునేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, ఆసుపత్రి సూపర్డెంట్ రమేష్, డాక్టర్ రాధిక, డాక్టర్ రాదా మోహన్, ఇతర వైద్యులు సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శిరివెళ్ళలో చలి వేంద్రాలు ఎక్కడా?ప్రజల దాహాన్ని తీర్చేవారే లేరా...

శిరివెళ్ల ఏప్రిల్ 12

మండే ఎండలు మండల ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.దాహార్తిని తీర్చాల్సిన చలివేంద్రాలు మాత్రం ఎక్కడా కనిపించకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ఏప్రిల్ మొదలైన వెంటనే ఎండలు విపరీతంగా పెరిగినా , శిరివెళ్ళ మండలంలో ఒక్క చలివేంద్రం కూడా ఏర్పాటు కాకపోవడం ప్రజల్లో ఆగ్రహాన్ని రగిలిస్తోంది.రోజూ పనుల నిమిత్తం బయటకు వచ్చే కూలీలు , కార్మికులు , ఆటో డ్రైవర్లు , బస్సు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి మజ్జిగ , నీళ్లు పంపిణీ చేస్తూ ప్రజలకు ఉపశమనం కలిగించేవి. కానీ ఈసారి ఎవరూ ముందుకు రాకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది.మండల హెడ్‌క్వార్టర్‌గా శిరివెళ్ళకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. పోలీస్ స్టేషన్ , తహశీల్దార్ కార్యాలయం , ఎంపిడిఓ కార్యాలయం , అగ్రికల్చర్ ఆఫీస్ వంటి కీలక కేంద్రాల వద్ద కూడా తాగునీటి సదుపాయం లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు మండిపడుతున్నారు.ప్రజల ప్రాణాలకే ముప్పు వాటిల్లే పరిస్థితుల్లో కూడా అధికారులు , ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల దాహం కూడా తీర్చలేని వారు , ప్రజల సమస్యలు ఎలా పరిష్కరిస్తారు




## ఆశా భోంస్లే మృతి పట్ల చిరంజీవి, కమల్ హాసన్, మోహన్ బాబు స్పందన






భారతీయ సంగీత ప్రపంచంలో తనకంటూ ఓ సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న ప్రముఖ గాయని ఆశా భోంస్లే (92) కన్నుమూశారు. ఆదివారం ముంబైలోని తన నివాసంలో ఆమె తుదిశ్వాస విడిచారు. ఆమె మరణ వార్తతో భారతీయ సినీ పరిశ్రమ శోకసంద్రంలో మునిగిపోయింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులతో పాటు పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా నివాళులర్పిస్తున్నారు. దక్షిణాది తారలు చిరంజీవి, కమల్ హాసన్, జూనియర్ ఎన్టీఆర్, మోహన్ బాబు, విక్రమ్ ప్రభు వంటి వారు సోషల్ మీడియా వేదికగా ఆమెకు కన్నీటి నివాళులు అర్పించారు. మెగాస్టార్ చిరంజీవి 'ఎక్స్' వేదికగా ఆశా భోంస్లేకు భావోద్వేగ నివాళి అర్పించారు. "ఆశా భోంస్లే గారి గొంతు భారతీయ సినిమాకు తరతరాలుగా నిలిచిపోయే ఓ అపురూపమైన తోడు. ఎన్నో భావోద్వేగాలను పలికించింది. ప్రతి పాటలోనూ ఆమె చూపిన అప్రయత్నమైన శైలి, వైవిధ్యం నన్ను ఎప్పుడూ ఆకట్టుకునేవి. భారతీయ సినిమా భర్తీ చేయలేని గొంతుకలలో ఒకదాన్ని కోల్పోయింది. ఆమె కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి. ఓం శాంతి" అని చిరంజీవి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రముఖ నటుడు కమల్ హాసన్ కూడా 'ఎక్స్'లో ఒక వీడియో క్లిప్ పోస్ట్ చేసి హిందీలో నివాళి అర్పించారు. మలయాళ దర్శకుడు ప్రియదర్శన్, "ఆశా జీ, మిమ్మల్ని కోల్పోవడం నాకు వ్యక్తిగతంగా అనిపిస్తోంది. ఎందుకంటే మీ గొంతు నా చిత్రాలను ఆశీర్వదించింది" అని ఇన్స్టాగ్రామ్‌లో రాశారు. మలయాళ నటుడు, కేంద్ర మంత్రి సురేష్ గోపి స్పందిస్తూ, "హద్దులు దాటిన గొంతుక ఆమెది. ఆమె లేని లోటు భారతీయ సినిమాకు, సంగీత ప్రపంచానికి తీరనిది" అని పేర్కొన్నారు. ఈ వార్త తెలిసిన వెంటనే స్పందించిన జూనియర్ ఎన్టీఆర్, "ఆశా భోస్లే గారి మరణ వార్త నన్ను తీవ్రంగా కలచివేసింది. దశాబ్దాలుగా భారత సినిమాకు ఆమె మాయా గాత్రం గుండెచప్పుడులా నిలిచింది. ఆమె వారసత్వం తరతరాలకు నిలిచిపోతుంది. ఆమె కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి. ఓం శాంతి," అని తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. సీనియర్ నటుడు మోహన్ బాబు స్పందిస్తూ, "ఆశా భోస్లే గారితో ఒక శకం నిశ్శబ్దంగా ముగిసింది. ఆమె గొంతు కేవలం సంగీతం కాదు, మన జీవితంలోని ప్రతి దశలో మనతో ఉన్న భావోద్వేగం. తరతరాల హృదయాలను ఆమెలా స్పృశించిన కళాకారులు అరుదు. ఆమె గాత్రం శాశ్వతంగా నిలిచిపోతుంది," అని పేర్కొన్నారు. నటుడు విష్ణు మంచు కూడా, "మనం ఆశా భోస్లే గారి పాటలను కేవలం వినలేదు.. వాటితో జీవించాం. ఇది పూడ్చలేని లోటు," అని ఆవేదన వ్యక్తం చేశారు. తమిళ నటుడు విక్రమ్ ప్రభు తన కుటుంబంతో ఆశా భోస్లేకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. "ఆశా గారు మమ్మల్ని ఎంతో ప్రేమగా పలకరించేవారు. ఆమె మా కుటుంబ సభ్యురాలు. చెన్నై వచ్చినప్పుడల్లా మా తాత శివాజీ గణేశన్ ఇంట్లోనే ఉండేవారు" అని తెలిపారు. ఆస్కార్ విజేత సౌండ్ డిజైనర్ రసూల్ పూకుట్టి కూడా ఆమెకు నివాళులు అర్పించారు.

> 'ఆశా భోంస్లే మరణ వార్త విని దిగ్భ్రాంతికి గురయ్యాను. దశాబ్దాల పాటు సాగిన ఆమె సంగీత ప్రస్థానం.. ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది అభిమానుల హృదయాలను గెలుచుకుంది. ఆమె కుటుంబ సభ్యులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. ఆశా భోంస్లే జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం. ఆమె పాటలు ప్రజల జీవితాల్లో శాశ్వతంగా నిలిచి ఉంటాయి'
>
> - ప్రధాని నరేంద్ర మోదీ



> 'ఆశా భోంస్లే మరణ వార్త విని బాధపడ్డా. ఆమె ఓ దిగ్గజ గాయని. అత్యధిక పాటలు పాడి చరిత్ర సృష్టించారు. దాదాపు ఏడు దశాబ్దాల పాటు మ్యూజిక్ ఇండస్ట్రీకి సేవలందించారు. భారతీయ సంగీత జగత్తులో ఆమె పాటలు తరతరాలపాటు ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి. ఆశా కుటుంబానికి, ఆమె అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా"
>
> - ఏపీ సీఎం చంద్రబాబు



- **ముంబై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస**
- **కన్నీళ్లతో ప్రకటించిన భోంస్లే కుమారుడు, మనవరాలు**
- **సోమవారం శివాజీ పార్క్ లో అంత్యక్రియలు**
- **20కి పైగా భాషల్లో 12,000 పాటలు పాడిన గాన దిగ్గజం**



భారతీయ సంగీత ప్రపంచంలో ఓ శకం ముగిసింది. సుప్రసిద్ధ గాయని ఆశా భోంస్లే ఇక లేరు. తీవ్ర అస్వస్థతతో శనివారం ముంబైలోని బ్రీచ్ కాండీ ఆసుపత్రిలో చేరిన ఆశా భోంస్లే.. చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. శనివారం తీవ్రమైన నీరసం, ఛాతీలో ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో వైద్యులు ఐసీయూకి తరలించి చికిత్స అందించినప్పటికీ ఫలితం దక్కలేదు. ఆమె మరణ వార్తను కుమారుడు ఆనంద్ భోంస్లే, మనవరాలు జానై భోంస్లే ధృవీకరించారు. ఆమె పార్థివ దేహాన్ని సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అభిమానుల సందర్శనార్థం ఆమె నివాసంలో ఉంచనున్నారు. అనంతరం, సాయంత్రం 4 గంటలకు ముంబైలోని శివాజీ పార్కులో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దిగ్గజ గాయని లతా మంగేష్కర్ కు ఆశా భోంస్లే స్వయానా సోదరి. బ్రిటీష్ ఇండియాలోని సాంగ్లీ స్టేట్ లో 1933 సెప్టెంబర్ 8న జన్మించారు. 1943లో ఆమె తన సంగీత ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఎనిమిది దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో 20కి పైగా భాషల్లో 12,000కు పైగా పాటలు పాడి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ (2011)లో స్థానం సంపాదించారు. తెలుగులో కూడా ఆమె పాడిన ఎన్నో పాటలు విశేష ప్రజాదరణ పొందాయి. ఆమె మరణం భారత సంగీత ప్రపంచానికి తీరని లోటు.

### * ఆశా భోంస్లే మరణానికి కారణం అదే: వైద్యులు

భారత సంగీత ప్రపంచంలో తీవ్ర విషాదం నెలకొంది. తన గానంతో దశాబ్దాల పాటు శ్రోతలను ఉర్రూతలూగించిన దిగ్గజ గాయని, గానకోకిల ఆశా భోంస్లే (92) ముంబైలో తుదిశ్వాస విడిచారు. తీవ్ర అస్వస్థతతో నిన్న ఆమెను బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ ఇవాళ కన్నుమూశారు. ఆమె మరణంతో భారతీయ సినీ సంగీతంలో ఒక స్వర్ణయుగం ముగిసినట్లయింది. ఆశా భోంస్లే పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, బహుళ అవయవాలు విఫలం కావడం వల్లే ఆమె మరణించారని డాక్టర్ ప్రతీత్ సందానీ వెల్లడించారు. "ఆశా భోంస్లే మరణించడం చాలా బాధాకరమైన వార్త. ఆమె బహుళ అవయవాల వైఫల్యం (మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్) కారణంగా కన్నుమూశారు" అని ఆయన తెలిపారు. మహారాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి ఆశిష్ షెలార్ ఆసుపత్రి బయట ఆశా భోంస్లే మరణవార్తను అధికారికంగా ప్రకటించారు. ఆమె అంత్యక్రియలు సోమవారం సాయంత్రం 4 గంటలకు ముంబైలోని శివాజీ పార్కులో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. కడసారి నివాళులర్పించాలనుకునే వారు సోమవారం ఉదయం 11 గంటలకు లోయర్ పరేల్‌లోని ఆమె నివాసానికి రావచ్చని కుమారుడు ఆనంద్ భోంస్లే కోరారు. "మా అమ్మ ఆశా భోంస్లే ఈరోజు మరణించారు. రేపు ఉదయం 11 గంటలకు ప్రజలు ఆమె నివాసంలో నివాళులర్పించవచ్చు" అని ఆయన పేర్కొన్నారు. తీవ్రమైన అలసట, ఛాతీ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న తన నానమ్మను ఆసుపత్రిలో చేర్పించినట్లు శనివారం ఆమె మనవరాలు జనై భోంస్లే ఇన్‌స్టాగ్రామ్‌లో వెల్లడించారు. 1943లో 'మాఝా బల్' అనే మరాఠీ చిత్రంతో తన గాన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆశా భోంస్లే, ఆ తర్వాత హిందీ చిత్ర పరిశ్రమలో తనదైన ముద్ర వేశారు. 'చురా లియా హై తుమ్నే జో దిల్ కో', 'దో లఫ్జోం కీ హై దిల్ కీ కహానీ', 'ఓ హసీనా జుల్ఫోంవాలే', 'యే లడ్కా హాయ్ అల్లా' వంటి ఎన్నో అజరామరమైన గీతాలతో సంగీత ప్రియుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆమె మృతి పట్ల యావత్ సినీ, సంగీత ప్రపంచం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోంది.

## ఆశా భోంస్లే కేవలం ఒక గాయని కాదు... ఒక శకానికి గుండె చప్పుడు : రామ్ గోపాల్ వర్మ ఎమోషనల్ ట్వీట్



ప్రముఖ గాయని, లెజెండ్ ఆశా భోంస్లే మృతి పట్ల ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఆమె కేవలం ఒక గాయని మాత్రమే కాదని, ఒక శకానికి గుండెచప్పుడు వంటి వారని అభివర్ణించారు. ఆశాజీతో తనకున్న అనుబంధాన్ని, ఆమెతో కలిసి పనిచేసిన అనుభవాలను సోషల్ మీడియా వేదికగా పంచుకుంటూ వర్మ నివాళులర్పించారు. "ఈరోజు నా ఆల్ టైమ్ ఫేవరెట్ సింగర్, లెజెండరీ ఆశా భోంస్లే గారి మరణ వార్త విని తీవ్రంగా చలించిపోయాను. ఆమె గురించి ఆలోచిస్తుంటే ఎన్నో జ్ఞాపకాలు గుర్తొస్తున్నాయి. 'రంగీలా' సినిమాకు ఏఆర్ రెహమాన్ అద్భుతమైన సంగీతం అందించినా, ఆ పాటలకు అమరత్వాన్ని, యవ్వనపు ఉత్సాహాన్ని ఇచ్చింది కేవలం ఆశా గారి గొంతు మాత్రమే. "రంగీలా రే" కేవలం ఒక పాట కాదు, బాలీవుడ్‌ను కుదిపేసిన ఒక ఉరుములాంటిది. ముంబై వీధుల్లో ఊర్మిళా మటోండ్కర్ ఎలక్ట్రిఫైయింగ్ స్టెప్పులకు, ఆశా గారి కొంటెతనం, ఉత్సాహం నిండిన గానం తోడై వెండితెరపై అద్భుతమైన మ్యాజిక్ సృష్టించాయి. ఆమె స్టూడియోలోకి అడుగుపెట్టే తీరే వేరు. ఒక మహారాణిలా వచ్చినా, రెహమాన్ లాంటి కొత్త తరం సంగీత దర్శకుడితో పనిచేస్తున్నప్పుడు కొత్త విషయాలు నేర్చుకోవాలనే చిన్నపిల్లల కుతూహలంతో ఉండేవారు. ఒకే టేక్‌లో, చిన్న చిన్న మార్పులతో ఆమె పాడే విధానం ఓ ప్రభంజనంలా ఉండేది. యాదృశ్చికంగా, ఈరోజే నా సినిమా 'కంపెనీ'లోని 'ఖల్లాస్' పాట విడుదలై 24 ఏళ్లు పూర్తయింది. ఇషా కొప్పికర్‌పై చిత్రీకరించిన ఆ హై ఓల్టేజ్ ఐటమ్ సాంగ్, ఆశా గారి పవర్‌ఫుల్ వాయిస్ వల్లే ఒక ట్రెండ్‌సెట్టర్‌గా నిలిచింది. ఆ పాట ఇప్పటికీ అదే శక్తితో వినిపిస్తుంది. ఆశా గారు కేవలం ఒక గాయని కాదు, ఆమె ఒక తరం మొత్తానికి గుండెచప్పుడు. శాస్త్రీయ సంగీతం నుంచి ఆధునిక బీట్స్ వరకు, ఎన్నో భాషల్లో, ఎన్నో భావోద్వేగాలను తన గొంతులో పలికించారు. మనుషుల అన్ని రకాల భావాలను ఆమెలా పండించిన వారు మరొకరు లేరు. మీరు మరో లోకానికి వెళ్లి ఉండొచ్చు ఆశా జీ, కానీ మీ సంగీతం ఇక్కడ శాశ్వతంగా ఉంటుంది. మీ ఆత్మకు శాంతి చేకూరాలి" అంటూ వర్మ ఎమోషనల్ ట్వీట్ చేశారు.

> "ప్రముఖ గాయని, జాతీయ పురస్కార గ్రహీత, పద్మ విభూషణ్ ఆశా భోంస్లే లేరన్న వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. భారతీయ సంగీత రంగానికి ఆమె అందించిన విశిష్ట సేవలు, దశాబ్దాల పాటు పలు భాషల్లో ప్రదర్శించిన అపూర్వ ప్రతిభ చిరస్మరణీయం. ఆమె మరణం దేశంలోని సాంస్కృతిక, కళారంగాలకు తీరని లోటు. ఆశా కుటుంబ సభ్యులకు, అభిమానులకు, సంగీత ప్రపంచానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా"
>
> - తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి



# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెరిసిన తారాజువ్వలు

ఎల్బీనగర్, ఏప్రిల్ 12 (భారత శక్తి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల్లో రంగారెడ్డి జిల్లా సరూర్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఘన విజయాన్ని సాధించారు. బైపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని శ్రీ యశస్విని 1000 మార్కులకు గాను 975 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. అలాగే ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని నాజియా ఖాతూన్ 1000 మార్కులకు గాను 970 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబరిచింది.




ఈమె తల్లిదండ్రులు సాజా ఖాతూన్, అన్నారుల్. అన్నారుల్ సైకిల్ పంక్చర్ షాప్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తల్లి గృహిణి. అత్యంత పేదరికం నుంచి వచ్చిన నాజియా ఖాతూన్ పాఠశాల స్థాయి నుంచే ప్రతిభ చూపుతూ వస్తోంది.

**ఇతర గ్రూపులలో :**

- సీఈసీలో ఆర్. నందిని 920/1000 మార్కులతో ప్రథమ స్థానం సాధించింది.
- హెచ్‌ఈసీలో మహేష్ 696/1000 మార్కులతో ప్రథమ స్థానం పొందాడు.
- ఏ & టీలో ఎం. శ్రీకాంత్ 962/1000 మార్కులతో అగ్రస్థానంలో నిలిచాడు.

మొత్తం కళాశాలలో 65% ఉత్తీర్ణత నమోదు కావడం విశేషం. ప్రథమ సంవత్సరం మరియు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి రేణుకుంట్ల అనురాధ, అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు సాధించిన ఈ విజయానికి ప్రిన్సిపాల్ అనురాధ మార్గదర్శకత్వం, అధ్యాపకుల కృషి ఎంతో దోహదం చేసిందని తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ మరియు అధ్యాపకులు ఘనంగా సన్మానించారు.



### ట్రాఫిక్ అంతరాయం లేకుండా

## డివైడర్ వెడల్పు తగ్గించండి

* **ట్రాఫిక్ అధికారులకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆదేశం**

ఎల్బీనగర్, ఏప్రిల్ 12 (భారత శక్తి): ఎల్బీనగర్ నియోజకవర్గం చింతల్ కుంట బస్ స్టాప్ వద్ద ఉన్న డివైడర్ వెడల్పు తగ్గింపు కోసం ట్రాఫిక్ అధికారులతో కలిసి పరిశీలించిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో పైలెట్ ప్రాజెక్టు కింద చింతల్ కుంట వద్ద డివైడర్ ఏర్పాటు చేయడం జరిగిందని, కానీ డివైడర్ దాదాపు పది నుంచి పన్నెండు ఫీట్లు వెడల్పుగా నిర్మించడం వల్ల పలు ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్న నేపథ్యంలో డివైడర్ వెడల్పు తగ్గించాలని సుధీర్ రెడ్డి అధికారులకు సూచించారు. ఈ డివైడర్ వెడల్పు తగ్గించడం వల్ల ట్రాఫిక్ సమస్యలు కొంతమేర తగ్గించవచ్చని తెలిపారు. అలాగే సర్వీస్ రోడ్డు వెడల్పు పెరిగితే కూడా సాఫీగా ప్రయాణం చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ట్రాఫిక్ ఏసీపీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ, ఎంత మేర డివైడర్ తగ్గించాలో ప్రణాళిక సిద్ధం చేసుకుని దానికి అనుకూలంగా డివైడర్ వెడల్పు తగ్గిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ. వెంకటేశ్వర్లు, జక్కిడి రఘువీర్ రెడ్డి, రవి ముదిరాజ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో దీక్ష జూనియర్ కళాశాల ప్రభంజనం

* **స్టేట్ సెకండ్ ర్యాంకర్ గా ఎంపీసీ జూనియర్ విద్యార్థిని లేఖశ్రీ**
* **విద్యార్థులను అభినందించిన కళాశాల యాజమాన్యం**
* **హర్షం వ్యక్తం చేసిన ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి, మధుసూదన్ రెడ్డి**

సిద్దిపేట, ఏప్రిల్ 12 (భారత శక్తి) : ఆదివారం వెలువడిన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో సిద్దిపేట జిల్లాలోని దీక్ష జూనియర్ కళాశాల ప్రభంజనం సృష్టించినట్లు ప్రిన్సిపాల్స్ బ్రహ్మానందరెడ్డి, మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కళాశాలలో పత్రిక విలేకర్లతో వారు మాట్లాడారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో లేఖశ్రీ 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించి స్టేట్ రెండవ ర్యాంక్ సాధించగా మరో 75 మంది విద్యార్థులు 400 మార్కులు సాధించి వారి ప్రతిభను చాటారన్నారు. జూనియర్ బైపీసి విబాగంలో గోనేపల్లి శ్రీజ 440 మార్కులకు గానూ 436 మార్కులు సాధించింది. అదే విభాగంలో 15 మంది పైగా 434 నుండి మొదలుకొని 421 మార్కులు సాదించారని పేర్కొన్నారు. ఇక సీనియర్ ఎంపీసీ విభాగంలో లింగంపల్లి శిరీష 1000 మార్కులకు గానూ 992 మార్కులు సాధించింది. ఆమెతో పాటు మరో 10 మంది విద్యార్థులు మంచి మార్కులు సాధించారని తెలిపారు. సీనియర్ బైపీసి విభాగంలో కోర్మాణి భవాని 1000 మార్కులకు గానూ 984 మార్కులు సాధించడంతో పాటు మరో 8 మంది విద్యార్థులు చక్కటి ఫలితాలు సాధించి జిల్లాలో అగ్రగామిగా నిలిచినట్లు పేర్కొన్నారు. తమ కళశాలలో చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం తరుపున శుభాకాంక్షలు తెలియజేశారు.










# కాంగ్రెస్ పార్టీతో దోస్తీ...బీజేపీ కార్యకర్తలతో కుస్తీ

* **అకారణంగా నన్ను కొట్టిన కొప్పులపై చర్యలు తీసుకోవాలి..**
* **ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోని పార్టీ అగ్ర నేతలు...**
* **బీజేపీ సీనియర్ నాయకులు గుమ్మకొండ ముత్యం రెడ్డి ఆవేదన**



ఎల్బీనగర్, ఏప్రిల్ 12 (భారత శక్తి ): ఎన్నో ఏండ్లుగా విద్యార్థి దశ నుండి పార్టీ కోసం పని చేస్తూ బీజేపీ క్రియాశీలక సభ్యుడిగా ఉన్న తనపై పార్టీలు మారుతూ బీజేపీ పార్టీలోకి వచ్చిన మన్సురాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి దాడి చేయడం హేయమైన చర్య అని, కండ్ల ముందే దాడి చేసినా ఇప్పటి వరకు పార్టీ అగ్ర నేతలు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బిజెపి సీనియర్ నాయకుడు గుమ్మకొండ ముత్యంరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీ సాయినాథ్ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కొప్పుల నర్సింహారెడ్డి చర్యపై ఆవేదనతో కన్నీటి పర్యంతం అయ్యారు. తన జీవితం మొత్తం పార్టీ కోసం పని చేశానని, సంఘ్ పరివార్, ఏబీవీపీ, బీజేపీ పార్టీ బలోపేతానికి కృషి చేశానని తెలిపారు. ఎల్బీనగర్ చౌరస్తాలో మాజీ ప్రధాని అటల్ బీహార్ వాజ్ పేయ్ విగ్రహ ఏర్పాటు కోసం శ్రీకారం చుట్టినప్పటి నుండి నాపై కక్ష సాధింపు కుట్రలు పన్నుతున్నాడని ఆరోపించాడు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం కోసం సహారా రోడ్డు టంగ్రిల్ల అపార్ట్మెంట్ వద్ద బిజెపి జెండాను ఎగురవేసేందుకు కట్టిన దిమ్మెను మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కూల్చి వేయించాడని తెలిపారు. ఇందిరా నగర్ బస్తీ చౌరస్తాలో ఈనెల ఆరవ తేదీ బీజేపీ పార్టీ ఆవిర్భావ వేడుకల్లో రంగారెడ్డి అర్బన్ జిల్లా మాజీ అధ్యక్షుడు నియోజకవర్గ ఇన్చార్జి సామ రంగారెడ్డి, సీనియర్ నాయకుడు ఎల్బీనగర్ నియోజకవర్గం బిజెపి కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్, బీజేపీ కార్యకర్తలు చూస్తుండగా కొప్పుల నరసింహారెడ్డి దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని వాపోయాడు. స్వార్థపూరితంగా సొంత ప్రయోజనాల కోసం పూటకో పార్టీ మారే కొప్పుల నరసింహారెడ్డి తీరుపై పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. దాడిపై వనస్థలిపురం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశానని, పోలీసులు ఆలస్యంగా ఈ నెల 3న కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. కేసు నమోదు కాకుండా ఉండేందుకు ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, ఎల్బీనగర్ నియోజకవర్గం ఇన్చార్జి మధు యాష్కీ గౌడ్, రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డిలతో పైరవీలు చేయించినట్లు తెలిసిందని ఆరోపించారు. బీజేపీ పార్టీకి చెందిన మాజీ కార్పొరేటర్ కు అధికార కాంగ్రెస్ పార్టీ పెద్దలతో ఆయనకున్న సత్సంబంధాలు చూస్తుంటే ఆయన ఏ పార్టీలో ఉన్నాడన్నది ఆలోచించాల్సి వస్తుందన్నారు. పార్టీ పెద్దలు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు అమంచ శ్రీనివాస్ పాల్గొన్నారు.



### సిగాచి యాజమాన్యం

## అధికారులపై చర్యలు తీసుకోవాలి

* ***కార్మిక శాఖ మంత్రికి మెట్టు శ్రీధర్ విజ్ఞప్తి**

పటాన్‌చెరు, ఏప్రిల్ 12: భారత శక్తి : సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్ యాజమాన్యం, సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అమాయక కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని నవభారత్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ ఆరోపించారు. ఆదివారం ఆయన పటాన్‌చెరులో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. 2018 నుంచి 2024 వరకు జరిగిన తనిఖీ నివేదికల ఆధారంగా పరిశ్రమలో జరుగుతున్న నిబంధనల ఉల్లంఘనలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

* **నివేదికలోని ప్రధాన అంశాలు**

* అదనపు నియామకాలు:201819లో 100 మంది కార్మికులకు మాత్రమే అనుమతి ఉన్నప్పటికీ, పరిమితికి మించి నియామకాలు చేపట్టారు.
* యంత్రాల సామర్థ్యం:2022లో 818 HP లైసెన్స్ ఉండగా, అనుమతి లేకుండానే 1777 HP సామర్థ్యం గల యంత్రాలను ఏర్పాటు చేశారు.
* భద్రతా లోపాలు:* 2019, 2021, 2023 తనిఖీల్లో యంత్రాలకు భద్రతా గార్డులు లేవని గుర్తించినా యాజమాన్యం పట్టించుకోలేదు.

**నివేదికల గైర్హాజరు:**

* ప్రమాదకర రసాయనాలు వాడే ఈ ఫ్యాక్టరీలో కనీసం 'హాజర్డ్ అనాలిసిస్' నివేదికలు కూడా లేవు.

ప్రతి ఏడాది తనిఖీల్లో లోపాలు బయటపడుతున్నా అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇటువంటి ప్రమాదాలు పునరావృతమవుతున్నాయని శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో విఫలమైన అధికారులతో పాటు పరిశ్రమ యాజమాన్యంపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని కోరారు




* **ప్రజల దాహార్తిని తీర్చడం అభినందనీయం**
* **భగవాన్ సత్యసాయి సేవాసమితి చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్**

# మానవ సేవయే మాధవ సేవ

పటాన్‌చెరు ఏప్రిల్ 12 భారత శక్తి : మానవసేవయే మాధవసేవ అని, వేసవికాలంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు శ్రీ భగవాన్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం పటాన్‌చెరు బస్టాండ్ లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రశంసించారు. ఆదివారం ఉదయం స్థానిక నాయకులతో కలిసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్య సాయి బాబా సేవా సమితి ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలతో పాటు భక్తి భావాన్ని పెంపొందించేలా కార్యక్రమాలు రూపొందించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం మార్కెట్ రోడ్డులో మురళి కిరాణా యాజమాన్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సైతం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, రామిరెడ్డి, రాజు, రామ్మోహన్ మల్లేష్, అజ్మత్, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# అమీన్‌పూర్‌లో ఆక్రమణల 'హైడ్రా' కట్టడి

* **861 ఎకరాల ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్.. అక్రమ కట్టడాల కూల్చివేత**

హైదరాబాద్, ఏప్రిల్ 12: భారత శక్తి : అమీన్‌పూర్ పరిధిలోని విలువైన ప్రభుత్వ భూములను కాపాడేందుకు 'హైడ్రా' (HYDRAA) చేపట్టిన భారీ ఆపరేషన్ రెండో రోజూ ముమ్మరంగా కొనసాగింది. సుమారు 861 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూమికి రక్షణగా ఫెన్సింగ్ పనులు చేపట్టిన అధికారులు, అదే ప్రాంతంలోని అక్రమ కట్టడాలను నేలమట్టం చేస్తున్నారు.

**నిరంతరాయంగా కూల్చివేతలు**

శనివారం ఉదయం ప్రారంభమైన ఈ ఆక్రమణల తొలగింపు ప్రక్రియ రాత్రి విరామం మినహా ఆదివారం కూడా కొనసాగింది. ప్రధానంగా ముఖీమ్ సోదరుడు అజీమ్ నిర్మించిన ఆరు అంతస్తుల అక్రమ భవనాన్ని తొలగించడంపై అధికారులు దృష్టి సారించారు. ఆదివారం సాయంత్రానికి ఈ భవనం కూల్చివేత 90 శాతానికి పైగా పూర్తయింది. పక్కనే ఉన్న ఇతర అపార్టుమెంట్లు, నివాసాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అత్యంత జాగ్రత్తగా కూల్చివేతలు చేపట్టడం వల్ల ప్రక్రియ కాస్త నెమ్మదిగా సాగినా, లక్ష్యాన్ని మాత్రం పక్కాగా అమలు చేశారు.

**భూములకు రక్షణ కవచం**

సర్వే నంబర్ల వారీగా ఆక్రమణకు గురైన, ఖాళీగా ఉన్న 861 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్న హైడ్రా, చుట్టూ ఫెన్సింగ్ నిర్మించే పనులను వేగవంతం చేసింది. ఈ భారీ విస్తీర్ణంలో అక్రమార్కులు చొరబడకుండా శాశ్వత ప్రాతిపదికన రక్షణ ఏర్పాట్లు చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో ఉండి పనులను పర్యవేక్షిస్తున్నారు.

**స్థానికుల్లో భరోసా**

హైడ్రా చర్యల పట్ల స్థానిక ప్రజల నుంచి సానుకూల స్పందన వ్యక్తమవుతోంది. గతంలో భూకబ్జాదారుల ఆగడాలతో భయం భయంగా గడిపిన సామాన్యులు, ఇప్పుడు ప్రభుత్వ భూములకు ఫెన్సింగ్ వేయడాన్ని స్వాగతిస్తున్నారు.

* అభినందనలు: వందల ఎకరాల భూమిని మాయం చేసి కోట్లు గడించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడాన్ని స్థానికులు అభినందిస్తున్నారు.

**నిరుపేదలకు ఊరట:**

సామాన్యుల ఇళ్లను కూల్చబోమని ప్రభుత్వం ఇచ్చిన హామీతో తమ ఆందోళనలు తొలగిపోయాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హైడ్రా రాకతో ప్రభుత్వ భూములకు భద్రత పెరగడమే కాకుండా, సామాన్యులకు వ్యవస్థపై నమ్మకం కలిగిందని విశ్లేషకులు భావిస్తున్నారు.





ఈ ఆపరేషన్ ద్వారా కబ్జాదారుల గుండెల్లో హైడ్రా గజగజలాడించింది అనడంలో సందేహం లేదు.

# జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ గా ఇటీవల నియమితులైన దినేష్‌కు మంత్రి అడ్లూరి శుభాకాంక్షలు

* కష్టపడిన ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తాం
* ప్రజల మధ్యలో ఉంటాం.మరో మారు అధికారంలోకి వస్తాం.
* బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన ఆఫర్లకు లొంగలేదు
* అందుకే నేడు క్యాబినెట్ లో మంత్రిని అయ్యాను.
* జీవన్ రెడ్డి పై మంత్రి అడ్లూరి మరో మారు ఫైర్..



జగిత్యాల, ఏప్రిల్ 12 (భారత శక్తి ప్రతినిధి): పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా ఎన్నికైన సంగనభట్ల దినేష్ పదవి ప్రమాణ స్వీకారం, అభినందన సభ జగిత్యాల జిల్లా కేంద్రంలో సుమంగళి గార్డెన్ ఫంక్షన్ హాల్ లో జరిగిన కార్యక్రమానికి మంత్రి అడ్లూరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా పనిచేస్తూ గెలిచిన, ఓడిన ప్రజల మధ్యనే ఉంటూ ముందుకు సాగానని అన్నారు. అనేక అవమానాలు ఎదుర్కొంటూ ఎన్నికల్లో ఓటమి చెందిన అధైర్య పడకుండా కాంగ్రెస్ పార్టీ జెండాను నమ్ముకొని ముందుకు సాగినట్లు మంత్రి తెలిపారు. పార్టీలో కమిట్మెంట్ గా పని చేశాను కనుక నేడు క్యాబినెట్ లో పని చేసే అవకాశం దక్కిందని మంత్రి అడ్లూరి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో తనకు అనేక ఆఫర్లు ఇచ్చిందని అయినప్పటికీ ఏలాంటి ఆఫర్లను లొంగకుండా కాంగ్రెస్ పార్టీలో కొనసాగానని మంత్రి అడ్లూరి అన్నారు. జగిత్యాల జిల్లాలో పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకు సరైన సమయంలో గుర్తింపు లభిస్తుందని ఎవరు నిరాశ పడవద్దని మంత్రి అన్నారు. రాష్ట్రంలో రేవంత్ పాలన పోవాలి.. మార్పు రావాలి అని జీవన్ రెడ్డి నినాదం ఎత్తుకున్నారని ఎందుకు మార్పు రావాలి అని మంత్రి ప్రశ్నించారు. రాష్ట్రంలో సన్నబియ్యం పథకం అమలు చేస్తున్నందుకు మార్పు రావాలా. అర్హులకు రేషన్ కార్డు లు అందించినందుకు మార్పు రావాలా. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చినందుకు మార్పు రావాలా. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినందుకు మార్పు రావాలా. అని జీవన్ రెడ్డిని మంత్రి అడ్లూరి ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని రానున్న రోజుల్లో నిత్యం ప్రజల మధ్య ఉంటూ రాష్ట్రంలో మరో మారు అధికారంలోకి వస్తామని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. 2029లో సైతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు. కొత్తగా జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా ఎన్నికైన సంగనభట్ల దినేష్ కు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, దుద్దిళ్ల శ్రీను బాబుతో పాటు జగిత్యాల జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు.



## మార్గదర్శి, నిత్య స్ఫూర్తి ప్రదాత మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి సందర్భంగా ఘన నివాళి

నర్సాపూర్, భారత శక్తి, ఏప్రిల్ 12:బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సమాజంలోని అంటరానితనాన్ని రూపుమాపడానికి కృషి చేసి, సమాజంలో సమానత్వం, విద్యా వెలుగులు పంచి విద్యా హక్కు అందరికీ అందించాలని కృషిచేసి సమాజంలోని పౌరులందరికీ కూడా సమానత్వం, విద్య,స్వేచ్ఛ,న్యాయం కోసం పోరాటం చేసిన తొలి తరం మహా నాయకుడు,మార్గదర్శి,నిత్య స్ఫూర్తి ప్రదాత మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి సందర్భంగా స్మరించుకుంటూ ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ మాచు నూరి లక్ష్మీరాజు యాదవ్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ.8 కోట్ల 90 లక్షలతో ఇందిరాగాంధీ స్టేడియం అభివృద్ధి

* కామారెడ్డిని క్రీడల హబ్‌గా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వ అడుగులు



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఏప్రిల్ 12: కామారెడ్డి పట్టణాన్ని క్రీడల కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియం 8అభివృద్ధి పనులను, ప్రతిపాదిత ఇండోర్ స్టేడియం స్థలాన్ని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ శనివారం అధికారులతో కలిసి పరిశీలించి పనులను ప్రారంభించారు. ఇందిరాగాంధీ స్టేడియం ఆధునీకరణ పనులను అధికారులు సమక్షంలో పరిశీలించిన షబ్బీర్ అలీ, పనులు నాణ్యతతో వేగవంతంగా చేపట్టాలని సూచించారు.

**రూ. 8.90 కోట్లతో ఆధునీకరణ**

ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ, ఇందిరాగాంధీ స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ. 8 కోట్ల 90 లక్షలను కేటాయించిందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా కామారెడ్డి క్రీడా రంగంలో విశిష్ట స్థానం సంపాదించనుందని పేర్కొన్నారు. స్టేడియంలో ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాల రన్నింగ్ ట్రాక్, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ,విశాలమైన గ్యాలరీలు,అత్యాధునిక ఇండోర్ స్టేడియం,ఆధునిక జిమ్,రైఫిల్ షూటింగ్ రేంజ్, వాలీబాల్ కోర్టు,టెన్నిస్ కోర్టు,టేబుల్ టెన్నిస్ సదుపాయాలు ముఖ్యమంత్రితో చర్చించి భవిష్యత్తులో స్విమ్మింగ్ పూల్ నిర్మాణాన్ని కూడా చేపడతామని షబ్బీర్ అలీ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వాలు క్రీడలను విస్మరించాయి. కానీ మన కాంగ్రెస్ ప్రభుత్వం యువత ప్రతిభను వెలికితీయడానికి ప్రత్యేక చర్యలు చేపడుతోంది. గ్రామీణ క్రీడాకారులు ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ వేదికలపై మెరవడం మా లక్ష్యం. అదేవిధంగా రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.నిధుల మంజూరు ప్రక్రియ పూర్తయింది.పనులు ఈరోజు నుంచే ప్రారంభమయ్యాయి.ఈ సంవత్సరం సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. స్టేడియం పూర్తయిన తరువాత ఇతర జిల్లాల నుంచి క్రీడాకారులు శిక్షణ పొందేందుకు రావడమే కాకుండా, జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించే అవకాశాలు కూడా ఏర్పడనున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి చిత్తశుద్ధితో కట్టుబడి ఉందని ఈ కార్యక్రమం ద్వారా స్పష్టంగా తెలియజేస్తున్నాము అని తెలిపారు. కామారెడ్డి పట్టణ నడిబొడ్డున ఉన్న ఇందిరాగాంధీ స్టేడియం రూపురేఖలు మారనున్నాయనే వార్తతో స్థానిక క్రీడాకారులు, యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ జిల్లాలో క్రీడా వికాసానికి నూతన దిశను నిర్దేశించనుంది. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విక్టర్, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమా శ్రీనివాస్, పండ్ల రాజు, గూడెం శ్రీనివాస్ రెడ్డి, అనంతరెడ్డి, భీంరెడ్డి, నౌసిలాల్, పాత రాజు, లక్ష్మీ రాజా గౌడ్, ఐరేనీ సందీప్, కారంగుల అశోక్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎస్ఈలో ఫాతిమాకు పీహెచ్.డీ



సంగారెడ్డి, ఏప్రిల్ 12 (భారత శక్తి ప్రతినిధి): హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ పరిశోధక విద్యార్థి సయ్యదా ఇమ్రానా ఫాతిమా ఖవాజా జకియుల్లా ఖ్వాద్రి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'సురక్షిత చిత్ర స్టెగానోగ్రఫీ కోసం ఒక ఉత్పాదక ప్రతికూల నెట్ వర్క్'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి. యుగంధర్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. వినూత్న డీప్ లెర్నింగ్ పద్ధతుల ద్వారా సురక్షిత డేటా ప్రసారాన్ని మెరుగుపరచడంపై ఈ అధ్యయనం దృష్టి సారించినట్టు తెలియజేశారు. ప్రస్తుత స్టెగానోగ్రాఫిక్ పద్ధతులలోని కీలక పరిమితులను పరిష్కరిస్తూ, శిక్షణ స్థిరత్వాన్ని పెంచే, ఎంబెడింగ్ సామర్థ్యాన్ని మెరుగుపరిచే, దాగి ఉన్న సమాచారాన్ని విశ్వసనీయంగా వెలికితీసేలా చూసే పటిష్టమైన ఆధారిత ఫ్రేమ్ వర్కుల శ్రేణిని ఈ అధ్యయనం ప్రతిపాదిస్తుందని వివరించారు.గేమ్ థియరీ, డీప్ కన్వల్యూషనల్ నెట్ వర్కులు, సైకిల్ కన్సిస్టెన్సీ లెర్నింగ్, ఆప్టిమైజేషన్ వ్యూహాలను ఏకీకృతం చేయడం ద్వారా, ఈ పరిశోధన ఇమేజ్ స్టెగానోగ్రఫీ సిస్టమ్ ల భద్రతను, గుర్తించలేనితనాన్ని, ప్రతికూల దాడులు, డేటా నష్టానికి వ్యతిరేకంగా వాటి స్థితిస్థాపకతను గణనీయంగా బలపరుస్తుందని పేర్కొన్నారు.సాంప్రదాయ పద్ధతులతో పోలిస్తే మెరుగైన దృశ్య నాణ్యత, గుర్తింపును నిరోధించే పటిష్టత, సురక్షితమైన డేటా పునరుద్ధరణ వంటివి ఈ పరిశోధన ఫలితాలలో కనబడుతున్నాయన్నారు. ఇవి మరింత సురక్షితమైన, విశ్వసనీయమైన డిజిటల్ కమ్యూనికేషన్ వ్యవస్థలకు దోహదపడతాయని తెలిపారు.డాక్టర్ సయ్యదా ఇమ్రానా ఫాతిమా సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ షేక్ మహబూబ్ బాషా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## దోపిడి పీడనలకు వ్యతిరేకంగా పోరాడిన ప్రతిఘటన యోధుడు పూలే

: సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు



నర్సాపూర్, ఏప్రిల్ 12 (భారత శక్తి న్యూస్): దోపిడీ,పీడనలకు వ్యతిరేకంగా ప్రతిఘటన పోరాటాలు చేసిన గొప్ప పోరాట యోధుడు మహాత్మ జ్యోతిబాపూలే అని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు అన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే 199వ జయంతి సందర్భంగా శనివారం నర్సాపూర్ కేంద్రంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూస్వామ్య సమాజం, పెత్తందారి వ్యవస్థ ప్రభలంగా ఉన్న నాటి కాలంలోనే దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, కూలీలను కలుపుకొని ప్రతిఘటన పోరాటాలు చేసిన పోరాట స్ఫూర్తి పూలే అని కొనియాడారు. సత్యశోధక్ సమాజ్ అనే సంస్థ స్థాపించి కార్మికులు రైతులకు తమ హక్కులను తెలియజేసి చైతన్యవంతం చేసిన గొప్ప వ్యక్తి పూలే అని అన్నారు. నాడు కష్టానికి ప్రతిఫలం ఇవ్వాలని, సంపదపై యాజమాన్యం కార్మికునికి ఉండాలని, శ్రమకు తగ్గ ఫలితం రావాలని, పూలే కోరుకుంటే నేడు బిజెపి నాలుగు లేబర్ కోడ్ ల రూపంలో కార్మిక హక్కులను కాలరాస్తున్నదని విమర్శించారు. దేశంలో మనుస్మృతిని అమలు చేస్తూ కష్టానికి ప్రతి ఫలం ఆశించని సమాజాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నదని, అందులో భాగంగా కార్మిక వర్గానికి కనీస వేతనాలు అడగకుండా, సంఘటితంగా ప్రశ్నించకుండా ఉండేందుకు లేబర్ కోడ్ లను తీసుకొచ్చిందని విమర్శించారు. పూలే స్ఫూర్తితో కార్మిక వర్గం సంఘటితంగా ఉండి దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా పోరాడటం తో పాటు ప్రజాస్వామిక హక్కులను కాలరాసే చట్టాలకు వ్యతిరేకంగా చేసే పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ గెజిటెడ్ హేడమాస్టర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుండం మోహన్ రెడ్డి, సీఐటీయూ నాయకులు అన్నపూర్ణ, కుమార్, నాఘభూషణం, శ్రీనివాస్, అశోక్, మంజుల తదితరులు పాల్గొన్నారు.




## భ్రమరంభ మల్లికార్జున స్వామి కటాక్షం అందరిపై ఉండాలి

: ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 12 : సంగారెడ్డి జిల్లా గొల్లగూడెం 9వ వార్డులో భ్రమరంభ సమేత మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారి కళ్యాణ మహోత్సవంలోపాల్గొన్నారు. ఎమ్మెల్యే కు స్థానికులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే స్వామివారి ఆశీస్సులు పొందారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వామివారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. భ్రమారంభ మల్లికార్జున స్వామి వారి కటాక్షం ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రజలు అందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కళ్యాణ మహోత్సవంలో డా.శ్రీహరి, పట్టణ అధ్యక్షుడు ఆర్ వెంకటేశ్వర్లు, నాయకులు వేణుగోపాల స్వామి, కౌన్సిలర్ లాడే మల్లేశం, 9 వ వార్డు పార్టీ ఇంచార్జి లాడే బాలు, కురుమ సంఘం పట్టణ అధ్యక్షుడు కర్కం మల్లేశం పెద్ద ఎత్తున మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నంలో 56 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

* రూ. 24.02 లక్షల విలువైన చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డ



ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 12 (భారతశక్తి) : ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) నిరుపేదలకు వరమని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని తుర్కయంజాల్, పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీలతో పాటు అబ్దుల్లాపూర్ మెట్ మండలానికి చెందిన 56 మంది లబ్ధిదారులకు మంజూరైన *రూ. 24,02,000* విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సాయం ఎంతో భరోసానిస్తుందని పేర్కొన్నారు. అనారోగ్య కారణాలతో ఇబ్బంది పడుతున్న నిరుపేదలు ఈ నిధిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాయం పొందిన లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

**ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్ చారి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తామని ధీమా వ్యక్తం చేశారు.

* **పాల్గొన్న ముఖ్య నాయకులు:**

ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పండుగల జయశ్రీ రాజు, మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస్ గౌడ్, విజయేందర్ రెడ్డి, శివలింగం గౌడ్ పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్ రెడ్డి, వంశీధర్ రెడ్డి, మూల కిరణ్, మిర్యాల రాజశేఖర్, మారుతి చారి తదితర స్థానిక నాయకులు, కార్యకర్తలు ఈ చెక్కుల పంపిణీలో

# భారత్-పాక్ యుద్ధాన్ని ఆపాను

వాషింగ్టన్/న్యూఢిల్లీ, ఏప్రిల్ 12 : భారత్, పాకిస్థాన్ మధ్య జరగాల్సిన పూర్తిస్థాయి యుద్ధాన్ని తాను ఆపడం వల్లే దాదాపు 5 కోట్ల మంది ప్రాణాలు నిలిచాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన తాజా 'స్టేట్ ఆఫ్ ది యూనియన్ (SOTU 2026)' ప్రసంగంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేస్తూ, 'ఆపరేషన్ సిందూర్' సమయంలో తన పాత్రను ప్రముఖంగా ప్రస్తావించారు. పాకిస్థాన్ నాయకులు తనకు నిరంతరం కృతజ్ఞతలు తెలుపుతున్నారని ఆయన చెప్పుకొచ్చారు. గతేడాది (2025) కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిలో 26 మంది భారతీయులు మరణించిన విషయం తెలిసిందే. దీనికి ప్రతిగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' ప్రారంభించింది. ఈ పరిణామంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరి, అణు యుద్ధం ముంగిట నిలిచాయని ట్రంప్ వివరించారు. ఆ క్లిష్ట సమయంలో తాను జోక్యం చేసుకోకపోతే పెను విధ్వంసం జరిగి ఉండేదని అన్నారు. "భారత్, పాకిస్థాన్ మధ్య అణు యుద్ధం జరిగి ఉండేది. దానివల్ల 3 నుంచి 5 కోట్ల మంది ప్రాణాలు కోల్పోయేవారు. 'మీరు లేకపోతే నేను సహా 3.5 కోట్ల మంది చనిపోయేవారు' అని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ నాతో చెప్పారు" అని ట్రంప్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. తన మొదటి 10 నెలల పాలనలోనే భారత్‌పాక్ ఘర్షణ సహా 8 యుద్ధాలను అంతం చేశానని గుర్తుచేశారు. ఆ ఘర్షణ సమయంలో 11 ఖరీదైన యుద్ధ విమానాలు కూలిపోయాయని కూడా ప్రస్తావించారు. పాక్ ప్రధాని తన చీఫ్ ఆఫ్ స్టాఫ్ ముందే తనకు బహిరంగంగా కృతజ్ఞతలు తెలిపారని ట్రంప్ ఉదహరించారు. అయితే, ట్రంప్ వాదనలను భారత్ గతంలోనే తోసిపుచ్చింది. భారత్‌పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం పూర్తిగా ద్వైపాక్షిక చర్చల ద్వారానే జరిగిందని, ఇందులో ఎలాంటి మూడో పక్షం జోక్యం లేదని భారత విదేశాంగ శాఖ పలుమార్లు స్పష్టం చేసింది.

## విజయ్‌పై డీఎంకే 'వర్క్ ఫ్రమ్ హోమ్' సెటైర్లు!

చెన్నై, ఏప్రిల్ 12 ( (భారత శక్తి): తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతున్న తరుణంలో, నటుడు, తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధినేత విజయ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ముందుగా ఖరారైన పలు బహిరంగ సభలను ఆయన అకస్మాత్తుగా రద్దు చేసుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ నిర్ణయంపై అధికార డీఎంకే 'వర్క్ ఫ్రమ్ హోమ్' రాజకీయమంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. రాష్ట్రవ్యాప్తంగా జరగాల్సిన కీలకమైన ర్యాలీలు, సభలను విజయ్ రద్దు చేస్తున్నట్టు టీవీకే వర్గాలు తెలిపాయి. అయితే, ఈ నిర్ణయానికి కచ్చితమైన కారణాలను పార్టీ అధికారికంగా వెల్లడించలేదు. ప్రచార వ్యూహంలో మార్పులు చేయడం లేదా భద్రతాపరమైన అంశాలు దీనికి కారణమై ఉండవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. విజయ్ నిర్ణయంపై అధికార డీఎంకే పార్టీ వ్యంగ్యంగా స్పందించింది. ఎన్నికల సమయంలో ప్రజల మధ్య ఉండాల్సింది పోయి, ఇలా సభలు రద్దు చేయడం ఏమిటని ప్రశ్నించింది. విజయ్ క్షేత్రస్థాయిలో తిరగకుండా 'వర్క్ ఫ్రమ్ హోమ్' పాలిటిక్స్ చేస్తున్నారంటూ ఎద్దేవా చేసింది. మరోవైపు, అధినేత పర్యటనలు ఆగిపోవడంతో టీవీకే కార్యకర్తలు, అభిమానులు కొంత నిరాశకు గురయ్యారు. అయితే, విజయ్ సోషల్ మీడియా, ఇతర డిజిటల్ వేదికల ద్వారా ప్రజలకు చేరువవుతారని పార్టీ నాయకులు చెబుతున్నారు. డీఎంకే, అన్నాడీఎంకే కూటములకు పోటీగా తమిళనాడులో మూడో ప్రత్యామ్నాయంగా నిలవాలని టీవీకే లక్ష్యంగా పెట్టుకుంది. ఇలాంటి కీలక సమయంలో విజయ్ ప్రచార సభలను రద్దు చేసుకోవడం ఆయన వ్యూహంపై ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## రాష్ట్రంలో కాంగ్రెస్ 'దోచుకోదాచుకో' పథకం నడిపిస్తోంది

హైదరాబాద్, ఏప్రిల్ 12 (భారత శక్తి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 'దోచుకోదాచుకో' అనే కొత్త పథకాన్ని ప్రారంభించిందని, ముఖ్యమంత్రి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల వరకు అందరూ అవినీతి, దోపిడీకి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో క్యాతనపల్లి మున్సిపాలిటీకి ఎన్నికైన బీఆర్ఎస్ కౌన్సిలర్ల అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి అంతటి భారీ అవినీతిపరుడైన ముఖ్యమంత్రి దేశంలోనే మరొకరు లేరని ఘాటుగా విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలు తోడుదొంగల్లా మారి ఒకరినొకరు కాపాడుకుంటున్నాయని కేటీఆర్ ఆరోపించారు. "సింగరేణిలో వేల కోట్ల రూపాయల దోపిడీ జరుగుతున్నా, 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం ఉలుకూపలుకూ లేకుండా మౌనంగా ఉంది. దీనిపై సీబీఐ విచారణ జరపాలని కోరినా పట్టించుకోవడం లేదు. ప్రధాని మోదీ తెలంగాణకు వచ్చి 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తున్నారని విమర్శించారు. హోంమంత్రి అమిత్ షా తెలంగాణ కాంగ్రెస్ ఏటీఎంగా మారిందని ఆరోపించారు. కానీ, ఇప్పటివరకు ఆ ఆరోపణలపై ఎందుకు విచారణకు ఆదేశించలేదు? దీన్నిబట్టి కాంగ్రెస్, బీజేపీలు చీకటి దోస్తులని, ఒకరి అవినీతిని మరొకరు కాపాడుకుంటున్నారని స్పష్టమవుతోంది," అని కేటీఆర్ విమర్శించారు. సింగరేణిలో ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి అరాచకాలకు పాల్పడుతున్నారని, 'సైట్ విజిటేషన్ సర్టిఫికేట్' అనే కొత్త విధానంతో కాంట్రాక్టర్లను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. వేల కోట్ల కుంభకోణంపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, స్థానిక మంత్రి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన వారసత్వ ఉద్యోగాలపై విచారణ జరిపిస్తామని బెదిరించడం కాదని, సృజన్ రెడ్డి అవినీతిపై విచారణ జరిపించే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని సవాల్ విసిరారు. సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా, అవినీతిని ఆపకపోతే ప్రతి బొగ్గు గనిపైనా అగ్గిపుట్టిస్తామని హెచ్చరించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ 14 స్థానాలు గెలిచినా, మంత్రి వివేక్ ఓటమిని తట్టుకోలేక కౌన్సిలర్లను వేధించారని కేటీఆర్ మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను అక్రమంగా అరెస్ట్ చేసి జైల్లో పెట్టారని, పోలీసులతో భయానక వాతావరణం సృష్టించారని ఆరోపించారు. ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా లొంగని తమ పార్టీ కౌన్సిలర్లను అభినందించారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, కేసీఆర్ చెప్పినట్లుగానే కాంగ్రెస్ పార్టీ అభయహస్తం పేరుతో తెలంగాణపై భస్మాసుర హస్తం పెట్టిందని కేటీఆర్ అన్నారు. సింగరేణి కార్మికుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని, రానున్న యూనియన్ ఎన్నికల్లో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘాన్ని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

## అమర్‌నాథ్ యాత్ర 2026 షెడ్యూల్ విడుదల.. 57 రోజుల పాటు యాత్ర

అమర్‌నాథ్, ఏప్రిల్ 12 (భారత శక్తి): పవిత్ర అమర్‌నాథ్ యాత్ర 2026 షెడ్యూల్‌ను జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. ఈ ఏడాది యాత్ర జులై 3న ప్రారంభమై, 57 రోజుల పాటు కొనసాగి ఆగస్టు 28న రక్షాబంధన్ పర్వదినం రోజున ముగుస్తుందని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వెల్లడించారు. ఈ మేరకు ఆయన కార్యాలయం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా వివరాలను పంచుకుంది. షెడ్యూల్ ప్రకారం యాత్ర ప్రారంభానికి ముందు జూన్ 29న జ్యేష్ఠ పూర్ణిమ సందర్భంగా శివుని ఆశీస్సులు కోరుతూ 'ప్రథమ పూజ' నిర్వహిస్తారు. యాత్ర కోసం ఈ నెల 15 నుంచి అడ్వాన్స్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని లెఫ్టినెంట్ గవర్నర్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న జమ్మూకశ్మీర్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఎస్‌బీఐ, యస్ బ్యాంక్‌లకు చెందిన 554 బ్రాంచుల ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల్లో భక్తులు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. దక్షిణ కశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లాలో సముద్ర మట్టానికి 3,888 మీటర్ల ఎత్తులో ఉన్న హిమాలయ గుహలో ఈ పుణ్యక్షేత్రం ఉంది. ఇక్కడ సహజసిద్ధంగా ఏర్పడే మంచు లింగాన్ని శివుని స్వరూపంగా భక్తులు విశ్వసిస్తారు. భక్తులు రెండు మార్గాల ద్వారా ఈ యాత్రను పూర్తి చేసుకోవచ్చు. ఒకటి సాంప్రదాయ పహల్గామ్ మార్గం కాగా, మరొకటి బల్తాల్ మార్గం. పహల్గామ్ మార్గంలో 34 కిలోమీటర్ల ట్రెక్కింగ్ ఉంటుంది, దీనికి 35 రోజులు పడుతుంది. బల్తాల్ మార్గం 14 కిలోమీటర్లు మాత్రమే ఉండి, యాత్ర పూర్తి చేసి అదే రోజు బేస్ క్యాంప్‌కు తిరిగి రావచ్చు. ఈ రెండు మార్గాల నుంచి హెలికాప్టర్ సేవలు కూడా అందుబాటులో ఉంటాయి.

## తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల.. అమ్మాయిలదే హవా!

హైదరాబాద్, ఏప్రిల్ 12 (భారత శక్తి): క్షలాది మంది విద్యార్థుల ఉత్కంఠకు తెరపడింది. తెలంగాణ ఇంటర్మీడియట్ ఫస్టియర్, సెకండియర్ వార్షిక పరీక్షల ఫలితాలు 2026 విడుదలయ్యాయి. హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రజా సంబంధాల సలహాదారు కె. కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా ఈ ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. ఈ ఫలితాల్లో ఇంటర్ ఫస్టియర్‌లో 66.20 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, సెకండియర్‌లో 70.58 శాతం మంది పాసయ్యారు. ఎప్పటిలాగే ఈసారి కూడా ఫలితాల్లో అమ్మాయిలే పైచేయి సాధించి తమ సత్తా చాటారు. ఈ ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1,495 పరీక్షా కేంద్రాల్లో సుమారు 9.9 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. అనంతరం మార్చి 15 నుంచి ఏప్రిల్ 1వ తేదీ మధ్య 20 కేంద్రాల్లో సమాధాన పత్రాల మూల్యాంకన ప్రక్రియను రికార్డు సమయంలో పూర్తి చేసి, వేగంగా ఫలితాలను సిద్ధం చేశారు.

**వెబ్‌సైట్లు, వాట్సాప్‌లోనూ ఫలితాలు**

విద్యార్థులు తమ ఫలితాలను సులభంగా తెలుసుకునేందుకు ఇంటర్ బోర్డు పలు మార్గాలను అందుబాటులోకి తెచ్చింది. అధికారిక వెబ్‌సైట్లయిన `tgbie.cgg.gov.in`, `results.cgg.gov.in`లను సందర్శించి, తమ హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను నమోదు చేయడం ద్వారా మార్కుల మెమోను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ ఏడాది ప్రత్యేకంగా వాట్సాప్ ద్వారా కూడా ఫలితాలు తెలుసుకునే సౌకర్యాన్ని కల్పించారు. `8096958096` నంబర్‌కు వాట్సాప్‌లో 'Hi' అని మెసేజ్ పంపి, సూచనలను అనుసరించి హాల్ టికెట్ నంబర్ ఎంటర్ చేస్తే వెంటనే ఫలితాలు స్క్రీన్‌పై కనిపిస్తాయి. అక్కడే మార్కుల షీట్‌ను డౌన్‌లోడ్ చేసుకునే వీలుంది.

**మే నెలలో సప్లిమెంటరీ పరీక్షలు**

వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయిన విద్యార్థుల కోసం మే నెలలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటించనున్నారు. వీటి ఫలితాలను కూడా అదే నెల చివరికల్లా ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు స్పష్టం చేశారు.



## హనుమాన్ దయతో రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

**- డిసిసి అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి**

సిద్దిపేట, ఏప్రిల్ 12 (భారత శక్తి ): హనుమాన్ దయతో రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని డిసిసి అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో శ్రీ హనుమాన్ స్వామి, నవగ్రహ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి, సర్పంచ్ విజయలక్ష్మి యాదగిరితో కలిసి పాల్గొని మాట్లాడారు. హనుమాన్ దయతో రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. గ్రామంలోని పురాతన హనుమాన్ ఆలయం పునర్నిర్మాణం, స్వామివారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ గత నాలుగు రోజులుగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు కన్నుల పండుగగా గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని, స్వామివారి కృప అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ పంచాయతీ పాలక వర్గం సభ్యులు, పురోహితులు రవీంద్ర శర్మ, గురుస్వామి అంజా గౌడ్, దాతలు, గ్రామస్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పటాన్‌చెరు లో నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఘన సన్మాన సభ

* **మంత్రుల సమక్షంలో మార్కెట్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం**




పటాన్‌చెరు ఏప్రిల్ 12, భారత శక్తి : పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతనంగా ఏర్పాటైన సందర్భంగా, పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పటాన్‌చెరు మార్కెట్ ప్రాంగణంలో ఘనంగా సన్మాన సభ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు దామోదర్ రాజనరసింహ, తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు మరియు భూగర్భ శాస్త్ర శాఖ మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి TGIIC చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి , ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్ , మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్, పాల్గొని మార్కెట్ కమిటీ నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి వారిని ఘనంగా సన్మానించారు. నూతనంగా ఏర్పాటైన మార్కెట్ కమిటీకి శివానందం చైర్మన్‌గా, రాజశేఖర్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. కమిటీ సభ్యులుగా బిక్షపతి, మైపాల్, నాగరాజు, నర్సింలు, బాలరాజ్, ఈశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, సతీష్ కుమార్ గౌడ్, ఇమ్రాన్, సునీత, హమీద్, సామయ్య, మల్లయ్య, గోపాల్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఢిల్లీలో తెలంగాణ వాణిని వినిపించిన శివంత్..

* **సంసద్ 2026లో 'సమాఖ్య స్ఫూర్తి'పై శివంత్ రెడ్డి ధ్వజం**
* **రాష్ట్రాల హక్కుల కోసం యువ పార్లమెంట్‌లో గళం**
* **ఆర్థిక వివక్ష, గవర్నర్ల తీరుపై నిలదీత.. సభ ప్రశంసలు**




న్యూఢిల్లీ, ఏప్రిల్ 12 భారత శక్తి: దేశ రాజధాని ఢిల్లీలో ఏప్రిల్ 9, 10 తేదీల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగిన 'సంసద్ 2026 ది యువత పార్లమెంట్'లో తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మహబూబ్ నగర్ జిల్లా ఇంచార్జ్ *శివంత్ రెడ్డి* తన గళాన్ని వినిపించారు. రాజ్యసభ వేదికగా వేం నరేందర్ రెడ్డి పాత్రలో పరకాయ ప్రవేశం చేసిన ఆయన, "సమాఖ్య స్ఫూర్తి రాష్ట్రాల హక్కులు" అనే అంశంపై చేసిన ప్రసంగం సభను ఆలోచింపజేసింది. రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని దెబ్బతీస్తున్న కేంద్ర విధానాలను ఆయన తనదైన శైలిలో ఎండగట్టారు.

**ఆర్థిక వివక్షపై నిప్పులు:**

పన్నుల పంపిణీలో రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయాన్ని శివంత్ రెడ్డి ప్రధానంగా ప్రస్తావించారు. సెస్సుల మాయాజాలం: కేంద్రం విధిస్తున్న సెస్సులు, సర్చార్జీల వల్ల రాష్ట్రాలకు దక్కాల్సిన 41 శాతం వాటా నీరుగారుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇది రాష్ట్రాల ఆర్థిక వెన్నెముకను విరిచే చర్య అని మండిపడ్డారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం:* జనాభా నియంత్రణ పాటించి అభివృద్ధిలో దూసుకుపోతున్న దక్షిణాది రాష్ట్రాలకు, ఆర్థిక సంఘం కేటాయింపుల్లో అన్యాయం జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు.

**గవర్నర్ వ్యవస్థపై ఘాటు విమర్శలు**

రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలను తొక్కిపెడుతూ, సమాంతర పాలన సాగిస్తున్న గవర్నర్ల తీరును శివంత్ రెడ్డి ఎండగట్టారు. సర్కారియా కమిషన్ సిఫార్సులను తు.చ. తప్పకుండా అమలు చేయాల్సిన అవసరం ఉందని, లేనిపక్షంలో ప్రజాస్వామ్యానికే ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. అలాగే, 7వ షెడ్యూల్‌ను పునఃసమీక్షించి, ఉమ్మడి జాబితాలో రాష్ట్రాల అధికారాలను పునరుద్ధరించాలని కోరారు.


**నవ సమాఖ్య ఒప్పందం' ప్రతిపాదన**

కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, సమస్యల పరిష్కారానికి శివంత్ రెడ్డి కొన్ని కీలక సంస్కరణలను ప్రతిపాదించారు:

1. ఫెడరల్ కౌన్సిల్: రాష్ట్రాల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఒక 'ఫెడరల్ కౌన్సిల్'ను ఏర్పాటు చేయాలని సూచించారు.
2. డిజిటల్ ఫెడరలిజం: ఆధునిక యుగంలో డేటా సేకరణలోనూ రాష్ట్రాలకు స్పష్టమైన వాటా ఉండాలని 'డిజిటల్ ఫెడరలిజం'ను ప్రతిపాదించారు.

## వధూవరులను ఆశీర్వదించిన పారిజాత నరసింహారెడ్డి

బడంగ్పేట్ ఏప్రిల్ 12 భారత శక్తి: మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రంలోని నవారు బాల్ రెడ్డి గార్డెన్స్‌లో జరిగిన వివాహ వేడుకలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డి దంపతులు పాల్గొన్నారు. బాలాపూర్‌కు చెందిన గండికోట యాదయ్య కుమారుని వివాహానికి హాజరైన వీరు, నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చిగిరింత దయాసాగర్ రెడ్డి, నాయకులు గిరికంటి కృష్ణంరాజు గౌడ్, టేకుల సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్పెషల్ స్టోరీ

# నమిశ్రీ 'అరియా'లో

# ఫ్లాటు, కొంటే మునిగిపోవాల్సిందే..!

**హైదరాబాద్ ఏప్రిల్ 12 భారతశక్తి:** రాజధాని నగరంలో రియల్ ఎస్టేట్ మాఫియా ఆకలికి హద్దు అదుపు లేకుండా పోతోంది. సామాన్యుడి సొంతింటి కలను ఆసరాగా చేసుకుని, ప్రభుత్వ ఆస్తులను మింగేస్తూ, చట్టాలను తుంగలో తొక్కుతున్నారు. నాగోల్ బండ్లగూడ పరిధిలోని తట్టి అన్నారంలో *'నమిశ్రీ అరియా'* ప్రాజెక్ట్ పేరుతో సాగుతున్న వేల కోట్ల అవినీతి బాగోతం ఇప్పుడు సంచలనం రేపుతోంది. అటవీ భూములను కాపాడాల్సిన అధికారులే అక్రమార్కులకు 'రెడ్ కార్పెట్' పరుస్తున్న వైనంపై 'వార్తా వెలుగు' అందిస్తున్న ప్రత్యేక పరిశోధనాత్మక కథనం.

### నకిలీ స్కెచ్‌లతో నయవంచన!

నమిశ్రీ సంస్థ అరియా ప్రాజెక్ట్ కోసం సర్వే నంబర్ 121లో అనుమతులు పొందింది. కాగితాల్లో చూపించిన భూమి కేవలం 2 ఎకరాల 35 గుంటలే. కానీ క్షేత్రస్థాయిలో జరుగుతున్న దందా వేరు. పక్కనే ఉన్న *సర్వే నంబర్ 117/6 (అటవీ భూమి)* కు సంబంధించిన 4 ఎకరాలను, అలాగే సర్వే నంబర్ 122లోని మరో 2 ఎకరాలను కలుపుకుని ఆకాశహర్మ్యాలను నిర్మిస్తున్నారు.

**RERA నంబర్: 02400061375**

****HMDA పర్మిషన్:* 001610/BP/HMDA/0341/g1/GHT/2023**


నిబంధనల ప్రకారం రెవెన్యూ స్కెచ్, NOCలు లేకుండా అనుమతులు రావు. మరి అటవీ భూమిని కలుపుకుని ప్లాన్ గీస్తే.. హెచ్ఎండీఏ టౌన్ ప్లానింగ్ అధికారులు కళ్లు మూసుకున్నారా? లేక ముడుపుల మత్తులో సంతకాలు పెట్టారా?

### కంచె చేను మేస్తే కాపాడేదెవరు?

అటవీ భూమి కబ్జాకు గురవుతుంటే గంద్రగొడ్డలి పట్టాల్సిన ఫారెస్ట్ అధికారులు మౌన ముద్రలో ఉండటం వెనుక మర్మమేమిటి?




1. క్రిమినల్ కేసులున్నా ఆగని పనులు:* ఫోర్జరీ పత్రాల వ్యవహారంలో సి. అమరేందర్ రెడ్డి, పి. ధర్మవీర్ రెడ్డిపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైనా నిర్మాణాలు ఆగకపోవడం చూస్తుంటే అధికారుల అండదండలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతోంది.
2. పట్టించుకోని అధికార గణం:* ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఏడాది క్రితమే ఫిర్యాదు చేసినా.. నాగోల్ సర్కిల్ కమిషనర్ రవీందర్ రెడ్డి, జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ పాటిల్ వంటి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వీరి మౌనం వెనుక ఉన్న 'ముడుపుల' బాగోతంపై ఏసీబీ (ACB) విచారణ జరగాల్సిన అవసరం ఉంది.








* **చట్టం ఏం చెప్తోంది? (అటవీ భూమి ఆక్రమణ - కఠిన శిక్షలు)**

అటవీ చట్టం (Forest Conservation Act) ప్రకారం ప్రభుత్వ భూమిని ఆక్రమించడం శిక్షార్హమైన నేరం:

* సెక్షన్ 20 & 26: రిజర్వ్డ్ ఫారెస్ట్ భూమిని ఆక్రమిస్తే కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధిస్తారు.

అధికారులపై చర్యలు: ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్నా స్పందించని అధికారులపై 'డ్యూటీ పట్ల నిర్లక్ష్యం' (Dereliction of Duty) కింద సర్వీసు నుంచి తొలగించే అధికారం ప్రభుత్వానికి ఉంది. అవినీతి నిరూపితమైతే ఏసీబీ కేసులు తప్పవు.







### మధ్యతరగతి ప్రజలారా.. తస్మాత్ జాగ్రత్త!

అక్రమ లేఅవుట్లు, కబ్జా భూముల్లో కట్టే భవనాల్లో ఫ్లాట్లు కొంటే రేపు ఆ అనుమతులు రద్దు అయితే మధ్యతరగతి జనం వీధిన పడటం ఖాయం. ఇప్పటికే బ్యాంకులు రుణాలు ఇచ్చాయి, రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. కానీ రేపు కోర్టులు కూల్చివేతలకు ఆదేశిస్తే కష్టమర్ల కష్టార్జితం బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది.

* డిమాండ్: మల్కాజ్గిరి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి మరియు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు తక్షణమే ఈ అక్రమ ప్రాజెక్టుపై దృష్టి సారించాలి. తక్షణమే 'నమిశ్రీ అరియా' రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలి. అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇచ్చి, అటవీ భూమిని స్వాధీనం చేసుకోవాలి. అవినీతి అధికారుల భరతం పట్టాలి.



* నమిశ్రీ అంటేనే మోసం..! హైదరాబాద్ మహానగరం నడిబొడ్డున ప్రభుత్వ స్థలంలో ఉన్న ప్రముఖ ట్రస్ట్ హాస్పిటల్ ని అక్రమ పద్ధతిలో చేజిక్కించుకున్నదెవరు.. ఒక్కొక్కటిగా పూర్తి ఆధారాలతో తదుపరి కథనంలో...



## ఉప్పల్‌లో ఐపీఎల్ సందడి..

# నేడు ట్రాఫిక్ ఆంక్షలు

* **సాయంత్రం 7.30కు ఎస్ఆర్హెచ్ వర్సెస్ రాజస్థాన్ రాయల్స్**
* **మధ్యాహ్నం 12 నుంచే ట్రాఫిక్ ఆంక్షలు షురూ**
* **నగరవాసులకు తప్పని తిప్పలు.. మెట్రోనే బెటర్**

హైదరాబాద్, ఏప్రిల్ 12 భారతశక్తి: సిటీలో క్రికెట్ ఫీవర్ మొదలైంది. ఉప్పల్ స్టేడియం వేదికగా సోమవారం సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH), రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య భారీ ఫైట్ జరగనుంది. అయితే మ్యాచ్ మజా ఒకవైపు ఉంటే.. ట్రాఫిక్ కష్టాలు మరోవైపు సామాన్యుడిని భయపెడుతున్నాయి. ఈ మ్యాచ్ కోసం పోలీసులు భారీ బందోబస్తుతో పాటు ఉప్పల్ చుట్టుపక్కల రూట్లను డైవర్ట్ చేశారు.

* **ఏప్రిల్, మే నెలల్లో ఏడు రోజులు గండమే!**

కేవలం ఇవాళే కాదు.. ఏప్రిల్ 5, 13, 18, 21 తేదీలతో పాటు, మే 3, 6, 22 తేదీల్లో ఉప్పల్‌లో మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ ఏడు రోజులు ఉప్పల్ జంక్షన్ మీదుగా వెళ్లాలంటే చుక్కలు కనిపించడం ఖాయం. ఇవాళ మధ్యాహ్నం 12 గంటల నుంచే పోలీసులు ఆంక్షలు అమల్లోకి తెచ్చారు. రాత్రి 12 వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయి.

* **భారీ వాహనాలు 'ఔట్'.. రూట్ మారిందిలా!**

లారీలు, ట్రక్కులు, ప్రైవేటు బస్సులు, డీసీఎంలు ఉప్పల్ వైపు వస్తే పోలీసులు లోపలికి రానివ్వడం లేదు. వాటి కోసం వేరే రూట్లు ఫిక్స్ చేశారు:

* వరంగల్ నుంచి వచ్చే వాహనాలు: ఘట్‌కేసర్ వద్దే ఔటర్ రింగ్ రోడ్డు (ORR) ఎక్కి అబ్దుల్లాపూర్‌మెట్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.
* ఎల్బీనగర్ నుంచి ఉప్పల్ వచ్చేవి:** నాగోల్ మెట్రో స్టేషన్ దగ్గర యూటర్న్ తీసుకుని భగ్యాత్, చెర్లపల్లి మీదుగా మళ్లించనున్నారు.
* తార్నాక, రామంతాపూర్ సైడ్:** హబ్సిగూడ వద్దే నాచారం, ఎన్ఎఫ్సీ రోడ్డు వైపు దారి మళ్లించారు.

**పార్కింగ్ ఎక్కడంటే..?**

>> స్టేడియం చుట్టుపక్కల మొత్తం 5 పార్కింగ్ స్లాట్లు ఏర్పాటు చేశారు.

1. హబ్సిగూడ వైపు నుంచి వచ్చేవారు: పెంగ్విన్ గ్రౌండ్స్ లేదా టీజీఐఏఎల్ఏలో వాహనాలు ఆపాలి.
2. ఎల్బీనగర్, రామంతాపూర్ నుంచి వచ్చేవారు: డీఎస్ఎల్ ఓపెన్ స్పేస్, మోడ్రన్ బేకరీ ఏరియాల్లో పార్క్ చేయాలి.
3. వీఐపీలకు మాత్రమే: స్టేడియం లోపల ఏ గ్రౌండ్‌లో పార్కింగ్ ఉంటుంది. పాస్ ఉంటేనే లోపలికి ఎంట్రీ.

**పోలీసు వారి సూచన:**

మ్యాచ్ చూడటానికి వెళ్లే ఫ్యాన్స్ సాధ్యమైనంత వరకు మెట్రో రైలు లేదా ఆర్టీసీ బస్సులను వాడటం మంచిది. సొంత కార్లు, బైకులతో వెళ్తే పార్కింగ్ దొరక్క, ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి సగం మ్యాచ్ మిస్ అయ్యే ప్రమాదం ఉంది. ఉప్పల్ మీదుగా వెళ్లే ప్రయాణికులు కూడా ప్రత్యామ్నాయ దారులను చూసుకోవడం ఉత్తమం.

## 'జవాన్' ఆస్తిపై కబ్జా కోరలు

# కోర్టు ఆర్డర్లు ఉన్నా, అధికారుల బేఖాతరు!

* **సరిహద్దులో విధి నిర్వహణ.. సొంతూరిలో ప్లాటు ఆక్రమణ**
* **మాజీ కార్పొరేటర్ 'కబ్జా' పర్వం.. అండగా ఖద్దరు చొక్కాలు!**
* **కోర్టు తీర్పులు బేఖాతరు.. CMC అధికారుల మామూళ్ల మత్తు?**
* **శేర్లింగంపల్లి జోన్ లో ఎస్.టి.ఎఫ్ నిర్వీర్యం .. తారా స్థాయిలో అక్రమాలు అవినీతి..!**
* **ఎస్టిఎఫ్ బాస్ జోనల్ కమిషనర్ హేమంత్ ఐఏఎస్ నిర్లక్ష్యం..**

హైదరాబాద్, శేర్లింగంపల్లి ఏప్రిల్ 12 (భారత శక్తి): దేశ సరిహద్దులో ప్రాణాలకు తెగించి ఉగ్రవాదులతో పోరాడుతున్న ఒక జవానుకు సొంత గడ్డపై రక్షణ కరువైంది. జమ్మూకాశ్మీర్‌లో CRPF సెకండ్ ఇన్ కమాండెంట్ హోదాలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఎన్. ఆస్తులపై కబ్జా కోరలు చాచాయి. గచ్చిబౌలి పరిధిలోని గోపన్‌పల్లిలో ఆయనకు చెందిన విలువైన ప్లాట్లను స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, వారి అనుచరులు కలిసి అక్రమంగా ఆక్రమించుకోవడం నగరంలో కలకలం రేపుతోంది. పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినా, హైకోర్టు మొట్టికాయలు వేసినా కబ్జాదారులు మాత్రం వెనక్కి తగ్గడం లేదు. అధికారుల అండదండలతో బహిరంగంగానే సవాల్ విసురుతున్నారు.

**స్టేటస్ కో ఉన్నా.. ఆగని దౌర్జన్యం!**

గోపన్‌పల్లి గ్రామంలోని సర్వే నెం. 155 AA, 156 AAలలో డాక్టర్ ప్రవీణ్ కుమార్ 2016లో ప్లాట్ నెం. 11, 12లను చట్టబద్ధంగా కొనుగోలు చేశారు. అయితే 2018 నుంచే ఈ ప్లాట్లపై కబ్జాదారుల కన్ను పడింది. చెట్టి శ్యామ్ బాబు అనే వ్యక్తి సరిహద్దు గోడను కూల్చివేయడానికి ప్రయత్నించగా, బాధితుడు సివిల్ కోర్టును ఆశ్రయించారు. కేసు పెండింగ్‌లో ఉన్నందున 'యథాతథ స్థితి' (Status Quo) పాటించాలని కోర్టు స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చింది. చట్టాన్ని గౌరవించి సదరు అధికారి తన గోడను కూడా మరమ్మత్తు చేసుకోకుండా వదిలేశారు. కానీ కబ్జాదారులు మాత్రం కోర్టు ఉత్తర్వులను కాలి కింద చెప్పులా భావిస్తున్నారు.

**అదును చూసి 'షెడ్డు' వేశారు..**


ప్రవీణ్ కుమార్ జమ్మూ కాశ్మీర్‌లో విధుల్లో ఉన్న అదను చూసి కబ్జాదారులు రెచ్చిపోయారు. 2024 జనవరిలో గచ్చిబౌలి 105 డివిజన్ కార్పొరేటర్ వాసేపల్లి గంగాధర్ రెడ్డి, చెట్టి శ్యామ్ బాబు, శేఖర్ గౌడ్, కృష్ణారెడ్డి తదితరులు కలిసి ప్రవీణ్ కుమార్ ప్లాట్లతో పాటు పక్కనే ఉన్న BSF ఉద్యోగి రాఘవరావు ప్లాట్‌ను కూడా ఆక్రమించారు. రాత్రికి రాత్రే పాత సరిహద్దు గుర్తులను తుడిచివేసి, కాంపౌండ్ వాల్ నిర్మించి, ఒక ఫ్యాబ్రికేటెడ్ షెడ్‌ను కూడా లేపేశారు. ఏప్రిల్ 2025లో సెలవుపై వచ్చిన బాధితుడు తన ప్లాట్ల పరిస్థితి చూసి హతాశుడయ్యారు.

* **ఖద్దరు బెదిరింపులు.. అధికారుల లొంగుబాటు?**

ఈ వ్యవహారంలో మున్సిపల్ అధికారుల తీరు అనేక అనుమానాలకు తావిస్తోంది. హైకోర్టు ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన అధికారులు, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విచారణకు అసలు నిందితుడు రాకుండా, కార్పొరేటర్ హాజరై అధికారులను బహిరంగంగానే బెదిరించడం చర్చనీయాంశంగా మారింది. హైకోర్టు నాలుగు వారాల్లో చర్యలు తీసుకోవాలని చెప్పినా, డిప్యూటీ కమిషనర్ మరియు అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ACP) ఇప్పటివరకు ఎటువంటి నోటీసులు గానీ, కూల్చివేత ఉత్తర్వులు గానీ జారీ చేయలేదు. అక్రమ నిర్మాణం అని తేలినప్పటికీ 'డిమాలీషన్'కు వెనకడుగు వేయడం వెనుక భారీగా చేతులు మారినట్లు తెలుస్తోంది.







**జోనల్ కమిషనర్ తీరుపై నిరసన**

తాజాగా విభజించబడిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (CMC) కమిషనర్ డాక్టర్ సృజన గారికి మార్చి 30న జవాను ఫిర్యాదు చేయగా, ఆమె సానుకూలంగా స్పందించి చర్యల కోసం శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ కు ఆదేశాలు జారీ చేశారు. అయితే మరుసటి రోజు బాధితుడు జోనల్ కమిషనర్‌ను కలవగా, ఆయన కనీస మర్యాద లేకుండా దురుసుగా వ్యవహరించడం గమనార్హం. "నాకు సంబంధం లేదు.. టౌన్ ప్లానింగ్ అధికారులను కలవండి" అంటూ విధి నిర్వహణ నుంచి తప్పుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎస్.టి.ఎఫ్ బాస్ స్పెషల్ స్టాల్ టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ ఇలా వ్యవహరించడం ఆశ్చర్యానికి గురి చేస్తున్న విషయం, తమ పరిధిలో అక్రమ నిర్మాణం ఏర్పాటు చేస్తే నోటీసు లేకుండానే కూల్చివేసే అధికారం ఎస్టిఎఫ్ కు ఉంటుంది ఇది చట్టం చట్టంలో ఉంది అన్న విషయం కూడా ఆయనకు తెలియదు, నా పరిధి కాదు అంటూ ముఖం చాట్ చేయడం, అంతర్యమేమిటో ఉన్నతాధికారులు గ్రహించాలి...!

సంబంధిత టౌన్ ప్లానింగ్ ఏసిపి వెంకటరమణను అడుగుతే ఆ క్రమ నిర్మాణాన్ని కూల్చివేయడానికి లెటర్ రెడీ చేసాము పోలీస్ ప్రొటెక్షన్ కోసం వెయిట్ చేస్తున్నామంటూ కాలయాపన చేయడం.. బాధితులను మభ్యపెట్టి మోసం చేయడం ఎంతవరకు సమంజసం ఈ విషయంపై సిఎంసి కమిషనర్ విజిలెన్స్ అధికారులు దృష్టి సారించి విధుల దుర్వినియోగం అవినీతి ఆరోపణలపై ఎంక్వయిరీ చేయాలని కోరుచున్నాము...

**న్యాయం జరిగే వరకు పోరాటం**

"దేశం కోసం నేను అక్కడ పోరాడుతుంటే, ఇక్కడ నా ఆస్తిని కాజేస్తున్నారు.. అధికారులేమో కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారు" అని డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏకంగా బీజేపీ మాజీ కౌన్సిలర్ అండతోనే ఈ దౌర్జన్యం సాగుతున్నట్లు ఆధారాలు లభిస్తున్నాయి. ఇప్పటికైనా CMC విజిలెన్స్ అధికారులు, ఏసీబీ (ACB) రంగంలోకి దిగి, అవినీతికి పాల్పడిన టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను తక్షణమే కూల్చివేయాలని బాధితుడు డిమాండ్ చేస్తున్నారు.



Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.